దాశరథి సాహిత్యం-3
రూ॥ 450/-
పేజీలు: 480
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 323 | బుధవారం | 14-05-2025 | హైదరాబాద్ | Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12 | వెల రూ. 5.00

పాక్ హైకమిషన్ ఉద్యోగిని

## బహిష్కరించిన భారత్

పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ కొనసాగుతున్న వేళ భారత్ అనూహ్య నిర్ణయం తీసుకుంది. కార్యాలయ పరిధి దాటి కార్యకలాపాలు సాగిస్తున్న పాకిస్థాన్ హైకమిషన్ ఉద్యోగిని దేశం నుంచి బహిష్కరించింది. 24 గంటల్లోగా భారత్ నుంచి వెళ్లిపోవాలని హుకుం జారీ చేసింది. ఈమేరకు భారత విదేశాంగశాఖ ఆదేశాలు వెలువరించింది.

ఆపరేషన్ సిందూర్

# పాక్‌కు లక్ష్మణరేఖ



- దాయాది దేశంలో 9 ఉగ్రకేంద్రాలు విధ్వంసం
- 8 సైనిక స్థావరాలకు నష్టం
- సైన్యం సాధించింది అపూర్వం
- సైనికులను ప్రశంసించిన ప్రధాని నరేంద్రమోదీ
- ఆదంపూర్ వైమానిక స్థావరం సందర్శన

**న్యూఢిల్లీ** :'ఆపరేషన్ సింధూర్' పాకిస్థాన్‌కు స్పష్టమైన 'లక్ష్మణ రేఖ'ను గీసిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తొమ్మిది ఉగ్ర వాద కేంద్రాలు విధ్వంసం, ఎనిమిది సైనిక స్థావ రాలకు నష్టం కలిగించి నాలుగు రోజుల పోరా టంలో పాకిస్థాన్‌ను ఓడించినందుకు ఆయన సైన్యాన్ని ప్రశంసించారు. సైన్యం సాధించింది అపూర్వమైనది అని, ఊహించలేనిది,అద్భుతమై నదని ఆయన కొనియాడారు. ఆదంపూర్‌లోని భారత్‌కు చెందిన ఎస్ 400 క్షిపణులను లాంచ ర్లతో సహా ధ్వంసం చేశామని పాకిస్తాన్ పేర్కొంది. భారతదేశం ఈ వాదనలను తోసిపు చ్చింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ప్రధాని నరేంద్ర మోదీ అనూహ్యంగా ఆదంపూర్ వైమానిక స్థావరాన్ని సందర్శించారు. ఆదంపూర్ భారతదేశ రెండవ అతిపెద్ద వైమానిక స్థావరం రాఫెల్, మిగ్29 స్క్వాడ్రన్లకు నిలయంగా ఉంది. ఇది 1969, 1971 లో పాకిస్థాన్‌లో జరిగిన యుద్ధాలలో కూడా ముఖ్యమైన పాత్ర పోషిం చింది. 'భారత్ మాతా కీ జై' అని నినాదాలు చేస్తూ యూనిఫాం ధరించిన వైమానిక బలగం సభ్యులు మోదీని తరువాయి 2లో



కీలక ప్రశ్నలకు

# జవాబివ్వని మోదీ



- తక్షణమే పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలి
- ప్రధాని ప్రకటనలో గంభీర ప్రకటనలు తప్ప స్పష్టత లేదు
- అమెరికా పాత్రను ఉద్దేశపూర్వకంగానే ప్రస్తావించలేదు

**న్యూఢిల్లీ :** ''ఆపరేషన్ సిందూర్'' అనంతరం జాతిని ఉద్దేశించి మొదటిసారి ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతీయ ప్రయోజనాలకు, దేశ భద్రతకు సంబంధించిన కీలక ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంలో విఫలమయ్యారని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) తీవ్రంగా విమర్శించింది. ఈ మేరకు సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, దేశ ప్రధానమంత్రి తరువాయి 2లో

అండమాన్‌ను తాకిన

## నైరుతి రుతుపవనాలు



**న్యూఢిల్లీ :** భానుడికి భగభగలతో మండుతున్న దేశానికి వాతావరణశాఖ చల్లటి కబురు అందించింది. నైరుతి రుతుపవనాలు మంగళవారం దక్షిణ బంగాళాఖాతం, దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, ఉత్తర అండమాన్ సముద్రంలోని కొన్ని ప్రాంతాలలోకి ప్రవేశించాయని తెలిపింది. గత రెండు రోజుల్లో నికోబార్ దీవులలో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిశాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ సమయంలో దక్షిణ బంగాళాఖాతం, నికోబార్ దీవులు, అండమాన్ సముద్రంపై పశ్చిమ గాలుల బలంగా వీచాయని, సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తులో గాలి వేగం 20 నాట్లకు మించి కొన్ని ప్రాంతాలలో 4.5 కి.మీ వరకు విస్తరించాయి. ఇక నైరుతి దక్షిణ అరేబియా సముద్రం, మాల్దీవులు, తరువాయి 2లో

అఖిలపక్ష భేటీలో ట్రంప్

## వ్యాఖ్యలపై ప్రశ్నిస్తాం : ఖర్గే



**కాలుబురిగి :** భారత్‌—పాకిస్థాన్ మధ్య 'కాల్పుల విరమణ'కు తాము పరిపాలన యంత్రాంగం మధ్యవర్తిత్వం వహించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ఈ విషయమై ప్రతిపక్షం అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. అయితే సరిహద్దులో తాజా పరిణామాలు, కాల్పుల విరమణపై చర్చించడానికి త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతానని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. మంగళవారం ఖర్గే కర్నాటకలోని బాలబురిగిలో విలేకరులతో మాట్లాడారు. ట్రంప్ క్రెడిట్ పొందేందుకు కొన్ని మాటలు చెబుతుండగా, ప్రధాని , కేంద్ర ప్రభుత్వం మాత్రం వద్దు అంటున్నదన్నారు. ఇది చాలా సున్నితమైన విషయంమని, తరువాయి 2లో



ధాన్యం సేకరణలో మేమే బెస్ట్

03

కెటిఆర్‌కు పార్టీ బాధ్యతలు ఇస్తే స్వాగతిస్తా



కశ్మీర్ అంశంలో

# మార్పు లేదు

- ద్వైపాక్షికంగానే పరిష్కారం
- ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** కశ్మీర్ అంశంపై అనుసరిస్తున్న దీర్ఘకాలిక వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, అది న్యూఢిల్లీ, ఇస్లామాబాద్‌ల మధ్య ద్వైపాక్షిక అంశమని భారతదేశం స్పష్టం చేసింది. కశ్మీర్ అంశంలో మధ్యవర్తిత్వం వహిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రతిపాదించిన నేపథ్యంలో మరోసారి నొక్కి చెప్పింది. ''భారత కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్మూ కశ్మీర్‌కు సంబంధించి ఎలాంటి అంశాలైనా భారత్, పాకిస్థాన్‌లు ద్వైపాక్షికంగానే తరువాయి 2లో

పాక్ దుష్ప్రచారానికి

# భారత్ కౌంటర్

- ఆపరేషన్ సిందూర్‌పై 70 దేశాల సైనిక దౌత్యవేత్తలకు డిజి.డిఐఎ వివరణ



**న్యూఢిల్లీ:** విజయవంతంగా నిర్వహించిన ''ఆపరేషన్ సిందూర్'' గురించి 70 దేశాల సైనిక దౌత్యవేత్తలకు భారతదేశం మంగళవారంనాడు వివరించింది. న్యూఢిల్లీ కంటోన్మెంట్‌లోని మనేక్షా సెంటర్‌లో భారత ఉన్నతస్థాయి సైన్యాధికారి, రక్షణ గూఢచారి సంస్థ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ డి.ఎస్.రాణా (డి.జి. డిఐఎ) దాదాపు 30 నిమిషాలసేపు ఆపరేషన్ సిందూర్ కార్యకలాపాల గురించి వివరించారు. పాకిస్థాన్ దుష్ప్రచారాన్ని ఖండించేందుకు తరువాయి 2లో





# ప్రపంచం
WORLD NEWS

## ఉక్రేన్‌పై రష్యా దాడులు

**కీవ్ :** ఒకవైపు శాంతిచర్చలకు ఏర్పాట్లు జరుగుతుండగా మరో వైపు ఉక్రేన్‌పై రష్యా సైనిక దాడులు చేసింది. మంగళవారం తెల్ల వారకముందు రాత్రికి రాత్రే ఉక్రేన్‌పై పది షాహెద్, డెకోయ్ డ్రోన్లను ప్రయోగించింది. ఉక్రేన్ వైమానికదళం ఈ విషయం చెప్పింది. ఐతే అతి మద్రస్థాయిలో చిన్న డ్రోన్లతో రష్యా దాడి చేయడం ఈ ఏడాదిలో ఇదే ప్రథమమని పేర్కొంది. ఐతే రష్యా దీనిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.

## ఇండోనేసియాలో పేలుళ్ళు: 13మంది మృతి

**జకర్తా :** ఇండోనేసియాలో జరిగిన పేలుళ్ళలో 13 మంది మరణించారు. కాలం చెల్లిన పేలుడు పదార్థాలను తీసి దూరంగా పారేస్తుండగా జరిగిన పేలుడులో 13 మంది మర ణించారు. మృతుల్లో తొమ్మిదిమంది సాధారణ పౌరులు,లుగురు జవానులు ఉన్నారు. ఇండోనేసియా సైనికులు ఈ కాలం చెల్లిన పేలుడు పదార్థాలను తీసుకువెళుతుండగా ఘటన జరిగింది. మిలిటరీ వేర్‌హౌస్ సెంటర్‌లో స్టోర్‌చేసిన ఈ పదార్థాలను తొలగిస్తుం డగా గరుత్ జిల్లాలోని సగర గ్రామంలో ఘటన జరిగింది. వరుసగా రెండు పేలుళ్ళు జరిగాయి.

# జైలుకెళ్ళినా హీరోగా అవతరించిన డ్యూటెర్టే

### ఫిలిప్పీన్స్ ఎన్నికల్లో రోడ్రిగో కుటుంబం విజయభేరీ





**మనీలా :** ఫిలిప్పీన్స్‌లో జరిగిన మధ్యంతర ఎన్ని కల్లో ఆ దేశ మాజీ అధ్యక్షుడు రోడ్రిగో డ్యూటెర్టే (79) మళ్ళీ హీరోగా మారారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు అరెస్టు వారెంటుతో జైలుకు వెళ్ళి నాగానీ ప్రజలు మధ్యంతర ఎన్నికల్లో ఆయన కుటుంబీకులకే పట్టం కట్టారు. రోడ్రిగో డ్యూటెర్టే తన సొంత నియోజకవర్గం దవాయో నగర మేయ ర్ పదవికి భారీ మెజారిటీతో ఎన్నికయ్యారు. 6.60 లక్షల ఓట్లతో ఆయన మేయర్‌గా గెలిచారు. తన సమీప ప్రత్యర్థిపై ఎనిమిదిరెట్లు ఓట్లు సంపా దించారు.ఆయన కుటుంబం మద్దతుతో పోటీ చేసి న ఐదుగురు అభ్యర్థులు దిగువసభకు జరిగిన మధ్యంతర ఎన్నికల్లో భారీ ఆధిక్యత సంపాదిం చారు. దీంతో రాబోయే దేశాధ్యక్ష ఎన్నికల్లో అధి కారపార్టీకి కష్టాలు ఎదురయ్యే పరిస్థితులు వచ్చా యి. 2028లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో రోడ్రిగో డ్యూటెర్టే కుమార్తె సారా డ్యూటెర్టే అధ్యక్ష అభ్య ర్థిగా అవతరించేందుకు మార్గం సుగమమైంది. ఐతే సెనేట్ ఆమెను కూడా అభిశంసన చేసింది. ఆమెపై ఆరోపణలు రుజువైతే ఎన్నికల్లో ఆమె అవ కాశం కోల్పోవచ్చు. అనుకున్నదానికంటే ఎన్నో రెట్లు ఎక్కువ ఓట్లు సంపాదించుకున్న రోడ్రిగో మేయర్‌గా గెలిచారు. పైగా ఆయన కుటుంబం నుండి ఆయన కొడుకులు, కుమార్తె, మనుమలు కూడా ఎన్నికల్లో గెలిచారు. ఫిలిప్పీన్స్ రాజకీయా ల్లో రెండు వంశపారంపర్య రాజకీయపార్టీలమధ్య జరుగుతున్న పోరాటం జరుగుతున్నది. రోడ్రిగో డ్యూటెర్టే పెద్ద కుమారుడు సెబాస్టియన్ ప్రస్తుతం మేయర్‌గా ఉండగా, ఆయనను డిప్యూటీ మేయర్ పదవి చేపడతారు. సెబాస్టియన్ పెద్ద కుమారుడు పావోలో హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌కు తిరిగి ఎన్ని కయ్యారు. రోడ్రిగో ఇద్దరు మనుమలు స్థానిక ఎ న్నికల్లో ఘనవిజయం సాధించారు. దీంతో ఆయ న కుటుంబం ప్రజల్లో తన పలుకుబడిని, రాబోయే అధ్యక్షటఎన్నికల్లో తన ఆధిపత్యాన్ని ఇప్పుడే నిరూపించుకున్నట్లయింది. అంతర్జాతీయ కోర్టు అరెస్టు వారెంటు నేపథ్యంలో ఈ ఏడాది మార్చినె లలో డ్యూటెర్టే జైలుకు వెళ్ళారు. 2016 నుండి 2022 వరకూ ఆయన దేశాధ్యక్షుడుగా ఉన్నకా లంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణ ముఠాలు, డ్రగ్స్ లార్డ్స్‌కు వ్యతిరేకంగా పెద్ద పోరాటం ప్రారంభించారు. హిట్లర్ తరహాలో వారిని ఊచ కోత కోయడానికి తాను సిద్ధంగా ఉన్నానని ప్రక టించారు. దీంతో ఆయన దేశంలో హీరోగా మారా రు. ఆ తర్వాత ఆయన హయాంలో దాదాపు 60,000మంది చట్టవిరుద్ధంగా డ్రగ్స్‌లార్డ్స్, ఏజంట్లు ఊచకోతలకు గురయ్యారన్న ఆ రోప ణలు ఎదుర్కొన్నారు. మానవవ్యవస్థకు విరుద్ధంగా ఉల్లంఘన చర్యలకు పాల్పడినందుకు అంతర్జా తీయ క్రిమినల్ కోర్టు ఆయనకు అరెస్టు వా రెంటు జారీ చేయడంతో ఆయన జైలుకు వెళ్ళారు. తాను జైలుకు వెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నాననీ, ఎవరినీ లెక్కచేయననీ ఆయన ప్రకటించారు కూడా. ఈ పరిస్థితుల్లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో రోడ్రిగో డ్యూటెర్టే కుటుంబం విజయఢంకా మోగించింది.

## అమెరికా నుండి ఎల్‌సాల్వడార్ టెర్రరిజం జైలుకు వలస ప్రజల తరలింపు

### ఐ.రా.స హక్కుల సంఘం ఆందోళన



**న్యూయార్క్ :** అమెరికా నుండి భారీఎత్తున కొన సాగుతున్న విజాయతీయుల తరలింపు చర్యల పట్ల ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సంఘం హైకమిషనర్ వోల్కర్ టర్క్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. భారీఎత్తున ఎల్‌సాల్వడార్ జైలుకు వంద లమంది వలస ప్రజలను తరలిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎంతమందకిని ఈ జైలుకు తరలిం చారన్న అధికారిక సమాచారాన్ని ఎల్‌సాల్వడార్ ప్రభుత్వ అధికారులుగానీ, అమెరికాగానీ ప్రకటిం చలేదన్నారు. అధ్యక్షుడు ట్రంప్ బాధ్యతలు చేప ట్టిన తర్వాత గడచిన నాలుగు నెలల్లో 1.42 లక్ష లమంది వలస ప్రజలను తరలించారని, ఎల్‌సా ల్వడార్ జైలుకు పంపుతున్నట్లు చెప్పకుండా పెద్ద సంఖ్యలో వలస ప్రజలను తరలిస్తూ ఉండటంతో వారు దిక్కుతోచనిస్థితిలో ఉండిపోతున్నారని, న్యాయపోరాటం చేయదానికి న్యాయవాదులు కూడా వారికి దొరకడంలేదని, ఏం చెయ్యాలో తెలి యక స్వదేశాలలో వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనతో ఉన్నాయని ఆయన అన్నారు. మార్చినె లలో ఏలియన్ ఎని మీస్ యాక్ట్ 1798ను ట్రంప్ రద్దు చేసిన తర్వాత వెనిజులా గ్యాంగులను ఎల్‌సాల్వడార్ జైలుకు పంపారనీ, అమెరికా సుప్రీంకోర్టుతోపాటు దిగువస్థాయి కోర్టులు కూడా సరైన ప్రక్రియ అనుసరించకపోవ డంవల్ల ఈ వలసల తరలింపులను తాత్కాలికంగా నిలిపివేశాయన్నారు. దాదాపు 100 మంది వెని జులా ప్రజలను టెర్రరిజం కన్‌ఫైన్‌మెంట్ సెంటర్ (సిఇసిఓటి)కి అక్రమంగా తరలించారని ఆందో ళన వ్యక్తం చేశారు. ఈ జైలుకు తరలిస్తున్న విషయం చాలామంది వలస ప్రజలకు తెలియదని ఆయన అన్నారు.

# రోహింగ్యాలను మా దేశంలోకి నెట్టేస్తారేంటి?

### తక్షణం ఆపాలని భారత్‌కు బంగ్లాదేశ్ హెచ్చరిక



**ఢాకా :** సరిహద్దుల్లో భారత్ ఉల్లంఘనకు పాల్ప డిందని బంగ్లాదేశ్ ఆరోపించింది. రోహింగ్యాలు మయన్మార్ దేశానికి చెందిన జాతీయులని, భార త్‌లోకి చొరబడినవారిని ఆ దేశ సరిహద్దుల్లోకి తరి మికొట్టాలితప్ప తమ దేశ సరిహద్దుల్లోకి ఎలా పంపుతారని ప్రశ్నించింది. రోహింగ్యాలు భారత సరిహద్దులు దాటి వెళితే మయన్మార్‌లోకి నెట్టా లని పేర్కొంది. భారత సరిహద్దు దళాలు (బిఎస్ ఎఫ్) బలవంతంగా రోహింగ్యాలను సరిహద్దులు దాటించి బంగ్లాదేశ్‌లోకి నెట్టేశాయనీ, ఈ విధమైన చర్యలను వెంటనే ఆపాలని ఆ దేశం హెచ్చరిం చింది. భారత్–బంగ్లాదేశ్ సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం సాధించాలంటే ఈ విధంగా బలవం తంగా తమదేశంలోకి రోహింగ్యాలను నెట్టడం సమ్మతంకాదని, దాన్ని ఆపాలని కోరింది. వారు బంగ్లాదేశ్ జాతీయులో కాదో నిర్ధారించకుండా తాము ఎవరినీ స్వీకరించడానికి సిద్ధంగా లేమని, దీనివల్ల శాంతి భద్రతల సమస్యలొస్తాయని పేర్కొంది. సరిహద్దుల్లో తమ కాపలాలేని ప్రాంతా లలోకి బలవంతంగా రోహింగ్యాలను తమదేశం లోకి నెట్టేశారని, ఇది భద్రతాపరమైన సమస్యలు సృష్టించడమేకాకుండా, దశాబ్దాలనాటి ఒప్పందా లను కూడా ఉల్లంఘించినట్లవుతుందని భారత్‌కు లిఖితపూర్వకంగా బంగ్లాదేశ్ విదేశాంగమంత్రిత్వ శాఖ కోరింది. మే ఏడు, ఎనిమిది తేదీలలో 300 మంది రోహింగ్యాలను సరిహద్దుల్లోంచి తమదేశం లోకి నెట్టేశారని, ఇది ఇరు దేశాల పరస్పర అవగా హనను ఉల్లంఘించినట్లవుతుందని, భద్రతా సమ స్యలు సృష్టించినట్లవుతుందని పేర్కొంది. ఖగ్రాచ్ఛ రాలోని పంచారీ, జెమినీపరల నుండి, కురిగ్రామ్‌లోని రౌమారి ఛార్‌నుండి, సుందర్బన్స్‌లోని మందర్బరియా ఐలాండ్స్‌నుండి తమ సరిహద్దు ల్లోకి రోహింగ్యాలను నెట్టేశారని, మరో 300 మంది రోహింగ్యాలను కూడా బలవంతంగా తమ దేశంలోకి నెట్టేందుకు బిఎస్ఎఫ్ సిద్ధమవుతోం దని, దీనిని వెంటనే ఆపాలని బంగ్లాదేశ్ బోర్డర్ గార్డ్ డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ మహ్మద్ అష్రాఫుజ్జామన్ సిద్ధిఖీ పత్రికాగోష్ఠిలో చెప్పారు. తమ సైనికుల గస్తీకి వీలులేని ప్రాంతాలలో ఈ విధంగా భారతదేశం సరిహద్దుల్లోంచి రోహింగ్యా లను తమదేశంలోకి నెట్టేస్తోందని, తమ సైనికుల గస్తీకి అవకాశంలేని ప్రాంతాలని భారత్ ఇందు కోసం ఉపయోగించుకుంటున్నదని, ఇది ఉల్లం ఘన చర్యకిందకు వస్తుందని విమర్శించారు. దీని వల్ల ఈ ప్రాంతాలలో తమ గస్తీని ఉద్ధృతం చేశా మని ఆయన చెప్పారు. 1975 నాటి ఉమ్మడి మార్గ దర్శకత్వాలను, 2011లో రెండు దేశాల సరిహద్దు బలగాల అధిపతులమధ్య కుదిరిన సమన్వయ నిర్వహణ ప్రణాళికను ఉల్లంఘించినట్లు కాగల దని ఆయన అన్నారు.

# చర్చలకు రష్యా సన్నాహాలు : ఇస్తాంబుల్‌లో ఏర్పాట్లు



**మాస్కో :** ముందుగా ప్రకటించిన విధంగానే ఉక్రే న్‌తో శాంతిచర్చలకు తమ ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేసిందని రష్యా ప్రభుత్వ ప్రధాన కార్యాలయం అధికార ప్రతినిధి ద్మీత్రీ పెస్కోవ్ మంగళవారం ప్రకటించారు. ఈనెల 15న ఉక్రే న్‌తో శాంతిచర్చలకు తాము సిద్ధంగా ఉన్నట్లు రష్యా అధ్యక్షుడు పుతిన్ రెండు రోజుల క్రితం ప్రక టించారు. ఐతే చర్చలకు ముందుగానే కాల్పుల విరమణ అమలులోకి తీసుకురావాలని, పుతిన్ తనతో స్వయంగా చర్చలకు రావాలని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సవాలు చేశారు. ఈ నేప థ్యంలో జెలెన్స్కీ సలహాదారు పోడోలయాక్ ఒక ప్రకటన చేస్తూ ఇస్తాంబుల్‌లో పుతిన్–జెలెన్స్కీ మధ్య మాత్రమే సంభాషణ జరుగుతుందన్నా రు. ఉక్రేన్ ప్రభుత్వం తమ దేశాన్ని సరిగ్గా అర్థం చేసు కోవాలని, శాంతి చర్చలంటే ముందుగా ఉక్రేన్‌లో యుద్ధం రావడానికిగల కారణాలను చర్చించాల్సి ఉందని రష్యా ఇప్పటికే ప్రకటించింది. ఈ నేప థ్యంలో ఏస్థాయిలో ఈచర్చలు జరుగుతాయి? ఎవరెవరి మధ్య చర్చలు జరుగుతాయన్న విష యంపై ఉత్కంఠ నెలకుంది. ఐతే ద్మీత్రీ పెస్కోవ్ మాత్రం, ప్రస్తుత పరిస్థితుల్లో ఇంతకంటే ఈ చర్చల గురించి తాను ఎక్కువ సమాచారాన్ని చెప్ప దలచుకోలేదని మీడియాతో అన్నారు. 2022 ఫిబ్ర వరిలో ప్రారంభమైన పూర్తిస్థాయి యుద్ధాన్ని నివారంచేందుకు ఎలాంటి ముందస్తు షరతులూ లేకుండా ఉక్రేన్‌తో ప్రత్యక్ష చర్చలకు తాను సిద్ధం గా ఉన్నానని పుతిన్ ఈనెల 12న పత్రికాగోష్ఠిలో ప్రకటించడంతో ఏదోవిధంగా చర్చలు మాత్రం ఖ రారుగా జరుగుతాయన్న ఆశాభావం నెలకుంది. మరోవైపు టర్కీదేశం కూడా ఇస్తాంబుల్‌లో ఉక్రే న్–రష్యామధ్య చర్చలకు పూర్తి సన్నాహాలలో నిమ గ్నమై ఉంది. యూరోపియన్ యూనియన్ దేశా లకు చెందిన ''ఇష్టపడేవారి కూటమి'' దేశాల నాయకులు కీవ్‌లో ఈనెల 12న సమావేశమై 30 రోజుల కాల్పుల విరమణకు రష్యా అంగీకరించా లని, లేకపోతే మరిన్ని ఆంక్షలకు సిద్ధంగా ఉండా లని హెచ్చరించాయి. అదేరోజు పుతిన్‌కూడా చర్చ లకు సంసిద్ధత వ్యక్తం చేశారు.

**మేం పట్టించుకోపోతే యూరప్‌కే నష్టం : విట్–కాఫ్...** మూడు సంవత్సరాలుగా జరుగుతున్న యుద్ధాన్ని నివారించేందుకు ఉక్రేన్–రష్యా అనివా ర్యంగా ఇస్తాంబుల్ వేదికగా శాంతి చర్చలు ప్రారంభించాల్సిందేనని డోనాల్డ్ ట్రంప్ అల్టిమే టమ్ ఇచ్చారు. ట్రంప్ ప్రత్యేకదూత, మధ్యప్రాచ్య అమెరికా ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్ ఈ విషయం చెప్పారు. మేం గనుక ఈ సమస్యను పట్టించుకోక పోతే యూరప్‌కే నష్టం కలుగుతుందన్నారు. ఈ రెండు దేశాలూ గనుక గురువారంనాడు చర్చలు ప్రారంభించకపోతే ఇక తాము ఈ విషయంలో జోక్యం చేసుకోకుండా దూరంగా వెళ్ళిపోతామని కూడా విట్‌కాఫ్ హెచ్చరించారు. ''ఇది మా యుద్ధం కాదు, ఈ యుద్ధాన్ని మేం ప్రారంభించ లేదు, కానీ ప్రపంచ శాంతికోసం మేం ప్రయత్నం చేస్తున్నామన్నారు.

# కెసిఆర్ నుండి రక్షణ కోసం బిజెపికి వెళ్లారు

### రియల్ ఎస్టేట్ ఏజెంట్ల కోసం హైడ్రాను విమర్శిస్తున్నారు
### ఈటల నకిలీ బిసి ఓట్ల కోసం బిసి కార్డ్
### టిపిసిసి అధికార ప్రతినిధి దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిజెపి ఎంపి ఈటల రాజేందర్‌కు మొదటి నుండి బిజెపి అంటే గిట్ట దని, ఆనాడు కెసిఆర్ ప్రభుత్వం లో కేసుల భారి నుండి తప్పించుకోవడానికి బిజెపికి వెళ్ళారని, ఓట్ల కోసం బిసి కార్డును, వ్యాపారం కోసం ఓసి కార్డు ఉపయోగిస్తారని, ఆయన నకిలీ బిసి అని టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. ఈటల రాజేందర్ బిజెపిలో అధ్యక్ష పదవి రాలేదని మానసిక క్షోభ ఉందని, సిఎం రేవంత్‌రెడ్డిని తిడితే రాజకీయ చర్చ కోసం నోరుజారని ఆయన పేర్కొన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో బిల్డర్స్, రియల్ ఎస్టేట్ ఏజెంట్లతో ఈటల రాజేందర్ కుమ్మక్కు అయి హైడ్రాపై విమర్శలు చేస్తున్నార న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జమున హేచరీస్ కేసు ఇంకా కోర్ట్‌లోనే ఉందని, స్టే మాత్రమే తెచ్చుకున్నారన్నారు. బిజెపిలో అధ్యక్ష పదవి రాకపోతే ఈటల రాజేందర్ బిఆర్ఎస్ పార్టీ నుండి పోటిచేస్తారన్నారు. ప్రభుత్వం మూసీ ప్రక్షాళన ప్రభుత్వం ఆలోచన చేస్తే, బాధితులలో ధర్నా చేస్తున్నారని, ఈటల 5 ఎకరాలలో నివాసం ఉంటూ స్వచ్ఛమైన ఆక్సిజన్ పీల్చుతూ నివసిస్తు న్నారని, పేదలు మాత్రం మురికి కంపులో ఉండాలా? అని ప్రశ్నించారు. ఈటల రాజేందర్ వేల కోట్లు దోచుకున్నారని, కోడి గుడ్డు తోనే వేల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు.

## మార్పు లేదు

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కరించుకుంటాయనే దీర్ఘకాలిక జాతీయ వైఖరి కలిగి ఉన్నామ''ని విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. ''ప్రకటించిన విధానంలో ఎలాంటి మార్పు లేదు. పాకిస్థాన్ ద్వారా చట్టవి రుద్ధంగా ఆక్రమించిన భారత భూభాగాన్ని ఖాళీ చేయడమే మిగిలి ఉన్నదనే విషయం అందరికీ అవగాహన ఉన్నదేనని చెప్పారు. ట్రంప్ ప్రతిపాద నపై అడిగిన ప్రశ్నకు జైస్వాల్ పై విధంగా స్పందించారు. అణుయుద్ధంపై ట్రంప్ ఊహాగా నంపై జైస్వాల్ స్పందిస్తూ సైనిక చర్య సంపూ ర్ణంగా సంప్రదాయ పరిధిలోనే ఉన్నదని చెప్పారు. ''పాకిస్థాన్ నేషనల్ కమాండ్ అథారిటీ మే 10న సమావేశమవుతుందని కొన్ని వార్తలు వచ్చాయి. తరువాత వారు దానిని తిరస్కరించారు. అణు కోణాన్ని స్వయంగా పాకిస్థాన్ విదేశాంగ మంత్రే అధికారికంగా తిరస్కరించారు'' అని జైస్వాల్ పేర్కొన్నారు. ''అణు బెదిరింపులకు లొంగదని లేదా దానిని సాకుగా చూపినా సీమాంతర ఉగ్ర వాదాన్ని అనుమతించబోమనే భారతదేశ దృఢ వైఖరి అందరికీ తెలిసిందే'' అని చెప్పారు. ''వివిధ దేశాలతో సంభాషణల సందర్భంగా ఇలాంటి పరి స్థితుల గురించి వారు వెలుబుచ్చే అభిప్రాయాలు వారి స్వంత ప్రాంతంలోనే వారిని బాధిస్తాయని'' కూడా చెప్పినట్లు ఆయన వివరించారు. సీమాం తర ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతును విశ్వసనీ యంగా వెనక్కి తీసుకునేంత వరకు సింధు నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసే ఉంచుతామని తెలి పారు. పారిశ్రామిక స్థాయిలో పాకిస్థాన్ ఉగ్రవా దాన్ని పెంచి పోషించిందని, ఆపరేషన్ సిందూర్ పేరుతో భారతదేశం ధ్వంసం చేసిన ఉగ్రవాద స్థావరాలు కేవలం భారతీయుల మరణాలకే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అనేక మంది అమా యకుల మరణాలకు కారణమయ్యాయని జైస్వాల్ తెలిపారు.

## నైరుతి రుతుపవనాలు

(మొదటి పేజీ తరువాయి)

కొమోరిన్ ప్రాంతంలోని మరిన్ని ప్రాంతాలకు; దక్షిణ బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు; మొత్తం అండమాన్, నికోబార్ దీవులు; అండ మాన్ సముద్రంలోని మిగిలిన ప్రాంతాలకు; రానున్న మూడు నుండి నాలుగు రోజుల్లో మధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలకు రుతుపవ నాలు విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ కార్యాలయం తెలిపింది. ఈ నేపథ్యంలో జూన్ 1వ తేదీ కంటే ముందుగానే మే 27న కేరళకు రుతుపవనాలు వచ్చే అవకాశ ముంది. సాధారణంగా జూన్ 1వ తేదీ నాటికి రుతుపవనాలు పలకరిస్తున్నాయి. ఈ సారి మాత్రం అంతకంటే ముందుగానే వచ్చేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయి. అలా జరిగితే 2009 తరువాత రుతుపవనాలు అంచనాల కంటే ముందుగా రావడం మళ్లీ ఇప్పుడే అవుతుంది. ఆ ఏడాది మే 23నే నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయి. జూన్ 1న రుతుపవనాలు కేరళకు వచ్చిన తరువాత జూలై 8 నాటికి మొత్తం దేశాన్ని కవర్ చేస్తాయి. ఇది సెప్టెంబర్ 17న వాయువ్య భారతదేశం నుండి తిరోగమనం ప్రారంభమవు తుంది. అక్టోబర్ 15 నాటికి పూర్తిగా ఉపసంహ రించుకుంటుంది. ఈ సారి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. భారత ఉప ఖండంలో సాధారణం కంటే తక్కువ వర్షపా తంతో ముడిపడి ఉన్న ఎల్ నినో పరిస్థితుల అవకా శాన్ని తోసిపుచ్చింది. భారతదేశ వ్యవసాయ రంగానికి రుతుపవనాలు చాలా కీలకమైనవి. జనాభాలో దాదాపు 42 శాతం మంది జీవనోపా ధికి వ్యవసాయమే జీవనాధారం. దేశ జిడిపికి 18 శాతం దోహదపడుతుంది. దేశవ్యాప్తంగా తాగు నీరు, విద్యుత్ ఉత్పత్తికి కీలకమైన జలాశయాలను తిరిగి నింపడానికి కూడా ఇది చాలా ముఖ్యమై నది.

## జవాబివ్వని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంటు ద్వారా ప్రజలకు జవాబుదారీ వహిం చాలి తప్ప మరోమార్గంలో (టీవీ లైవ్ ప్రసంగం) దీనిని తప్పించుకోవడం సాధ్యంకాదని గుర్తుచే సింది. సోమవారం రాత్రి జాతిని ఉద్దేశించిన మోదీ చేసిన ప్రసంగంలో కీలక ప్రశ్నలకు సమా ధానాలు దాటవేశారని పార్టీ విమర్శించింది. అందువల్ల తక్షణం జాతీయ భద్రత, దేశ ప్రయోజ నాలు, భారత సార్వభౌమాధికారం, విదేశాంగ విధానం వంటి అనేక కీలక విషయాలు కూలంక షంగా చర్చించేందుకు తక్షణం పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని సిపిఐ తన డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. ''టీవీ ద్వారా ఏకపక్ష అభిప్రాయాలు వ్యక్తం చేయడం కాదు, ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన మనదేశ అత్యు న్నత చట్టసభలో ఈ విషయాలన్నింటిపైనా అనివా ర్యంగా సమగ్ర చర్చ జరగాలి'' అని స్పష్టం చేసింది. భారత్–పాకిస్థాన్ మధ్య కాల్పుల విర మణ అవగాహనకు సంబంధించి అమెరికా పాత్ర, అందరికంటే ముందుగా ఆ దేశం స్వయంగా ప్రక టించుకున్న మధ్యవర్తిత్వ విజయం వంటి అనేక అంశాలను మోదీ ఉద్దేశపూర్వకంగా తన ప్రసం గంలో ప్రస్తావించలేదని పార్టీ జాతీయ కార్యదర్శి వర్గం విమర్శించింది. ''దక్షిణాసియా, భారత ఉప ఖండప్రాంతంలో శాశ్వతశాంతి సాధనకు అనుస రించే విశ్వసనీయమైన మార్గం ఏమిటో ప్రధాన మంత్రి చెప్పలేదు, భారతదేశం ఎట్టిపరిస్థితుల్లోనూ అణ్వాయుధ బెదిరింపులను సహించబోదని వాగ్దానం చేయలేదు, ఉగ్రవాదులు విసిరే ఎలాంటి సవాళ్ళనైనా దీటుగా ప్రతిఘటించేందుకు సంసి ద్ధంగా ఉన్నామని ప్రకటించలేదు, ఈ విషయాలు తప్ప ఆయన జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో అలంకారికశాస్త్రాన్ని ఉపయోగించి పూర్తిగా యుద్ధాభివర్ణనలు చేస్తూ తన ప్రసంగం కొనసాగిం చారు. ఆయన గంభీర ప్రకటనల్లో ఎక్కడా స్పష్టత లేదు, ప్రస్తుత తాజాపరిస్థితుల సంక్లిష్టత గురించి చెప్పడంలో ఆయన విఫలమయ్యారు, ప్రత్యేకించి భారత్–పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ అవగా హనలో అంతర్జాతీయ పాత్రధారుల గురించీ, జాతికి అత్యావశ్యకమైన జవాబుదారీతనం గురించి ఎక్కడా ప్రస్తావించలేదు.

తెరవెనుక అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పాత్ర ఏమిటో చెప్పకుండా దాటవేశారు. ఈ దాట వేతవల్ల ప్రధాని ప్రసంగంలో దాపరికాలేమైనా ఉన్నాయా? అనే ముఖ్యమైన ప్రశ్నలు తలెత్తాయి. కశ్మీరు సమస్య భారత్–పాకిస్థాన్‌లకు చెందిన ద్వైపాక్షిక సమస్యగానే చూడాలన్నది భారతదేశ స్థిరమైన, కఠినమైన వైఖరి, ఒకవేళ తెరవెనుక పని చేసిన బాహ్యశక్తులు మన రెండు దేశాలమధ్యా చర్చలను ప్రభావితం చేశాయా? అనే విషయాన్ని, వారి భాగస్వామ్యాన్ని గురించి ప్రజలు తెలుసుకో వాల్సిన అవసరం ఉంది. సత్యావిష్కరణ, దాపరి కంలేని బాహాటత్వం, సమన్యాయంవల్ల శాంతిసా ధన సాధ్యమవుతుందితప్ప కేవలం చర్చల ద్వారా మాత్రమే శాంతిసాధన సాధ్యంకాదు. ప్రభుత్వా నికి తన ఉద్దేశాలపట్ల చిత్తశుద్ధి ఉంటే, చేతలకు దాపరికంలేని మాటలు కూడా తోడవ్వాలి. ఈ క్రియాత్మక చర్యలకు అన్ని దౌత్యమార్గాలద్వారా స్పష్టమైన వివరణ ఉండాలి, దృఢమైన జవాబుదా రీతనానికి దేశీయంగా కట్టుబడి ఉండాలి.

ఆపరేషన్ సిందూర్‌లో చెప్పినట్టుగా సరిహద్దుల వెంట ఉన్న ఉగ్రవాద మౌలికస్థావరాలకు నష్టం జరిగింది. తర్వాత పాకిస్థాన్ నుండి ఎదురైన ప్రతీ కార చర్యలు భారత గడ్డపై పౌరులు, సైనికుల ప్రాణనష్టానికి దారితీశాయి. దిగ్భ్రాంతి కలిగించే విషయం ఏమిటంటే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతగడ్డపై మనకు జరిగిన నష్టం గురించి తన ప్రసంగంలో ఎక్కడా ప్రస్తావించలేదు.

కాల్పుల విరమణ అవగాహన ప్రకటన భారత్–పా కిస్థాన్ రెండు దేశాలకూ సమానంగా ఇబ్బంది తెచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న శాంతికాముకులైన ప్రజలు ఉద్రిక్తతలు సడలిపోవాలని డిమాండ్ చేశా రుతప్ప భారతదేశ నాయకత్వంగానీ, పాకిస్థాన్ నాయకత్వంగానీ ఆ డిమాండ్ చేయలేదు. కానీ ఈ కాల్పుల విరమణ అవగాహన గురించి డోనాల్ ట్రంప్ ముందుగా ప్రకటించుకున్నారు. ఆ గొప్పత నమంతా తన మధ్యవర్తిత్వం చలవేనని చెప్పుకు న్నారు. ఆ తర్వాత భవిష్యత్‌లో రెండు దేశాల తోనూ వాణిజ్యాన్ని గణనీయంగా పెంచుతానని కూడా ప్రకటించారు. ఈ ప్రకటన వల్ల భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి గురించి, మన సార్వ భౌమాధికారానికి కలిగిన నష్టం గురించి ఆందో ళన కలిగించే ప్రశ్నలు తలెత్తాయి. మూడోవ్యక్తి జోక్యం లేకుండా భారత్–పాకిస్థాన్ దేశాలు రెండూ సమస్యలను ద్వైపాక్షికంగా పరిష్కరించు కోవాలన్నది ప్రధానాంశం, సిమ్లా ఒప్పందం అదే. కానీ అసాధారణ పరిణామాలవల్ల సందేహాలు తలెత్తాయి.ఈ వ్యవహారంలో అమెరికా జోక్యం గురించి, ఈ పరిణామాల గురించి ప్రధానమంత్రి ప్రస్తావించకుండా ఎందుకు మౌనంగా ఉన్నారు? ట్రంప్ చేసినట్టు చెప్పుకుంటున్న మధ్యవర్తిత్వ నిబంధనలు ఏమిటి? ట్రంప్ ప్రతిపాదించిన వాణిజ్య విస్తరణకు సంబంధించిన నిబంధనలు ఏమిటి? భారత ఆర్థిక వ్యవస్థపై అది ఎలాంటి ప్రభావం చూపించబోతోంది? భారత విదేశాంగ విధానంపై ట్రంప్ చేసిన మధ్యవర్తిత్వ నిబంధనలు ఎలాంటి ప్రభావం చూపించబోతున్నాయి? ఈ ప్రశ్నలన్నింటికీ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగం ద్వారా సమాధానాలు చెప్పడంలో మోదీ విఫలమ య్యారు'' అని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం తన ప్రకటనలో విమర్శించింది.

## భారత్ కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

ఈ వాస్తవావిష్కరణ చేశారు. అనేక ఇస్లామిక్ దేశ ఋలతోపాటు ప్రధాన దేశాలకు చెందిన సైనిక దౌత్యవేత్తలు ఈ సమావేశానికి హాజరయ్యారు. స్వీడన్, నేపాల్, ఫిలిప్పీన్స్, ఈజిప్ట్ తదితర దేశాలు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నాయి. ఐడిఎస్ (ఇం టిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్) కేంద్ర కార్యాలయం ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ చేసింది. ''లెఫ్టి నెంట్ జనరల్ డి.ఎస్.రాణా 70 దేశాలకు చెందిన సైనిక దౌత్యవేత్తలకు ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. దేశ ప్రజలు చేసిన తీర్మానం ద్వారా, భారతదేశ సాయుధబలగాలు తన బలపరాక్రమా లను ఎలా ప్రదర్శించినదీ, కొత్తతరం యుద్ధతంత్రం ద్వారా భారత్ తన సైన్యం తన ఆధిపత్యాన్ని ఎలా ప్రదర్శించిందీ వివరించింది'' అని ఐడిఎస్ తన ఎక్స్ పోస్టింగ్‌లో పేర్కొంది. మే ఏడో తేదీ నుండి నాలుగు రోజులపాటు భారత్–పాకిస్థాన్ మధ్య జరిగిన అనధి కార సైనిక చర్యల గురించి ప్రపంచ దేశాలలో, ప్రపంచ మీడియాలో పాకిస్థాన్ పచి అబద్ధాలు ప్రచారం చేసింది. అసత్య ప్రకటనలతోపాటు వేరే చోట్ల దాడులకు సంబంధించిన పాత ఫొటోలను కూడా అప్‌లోడ్ చేసి తామే దాడుల్లో భారత ఆయుధ సంపత్తిని కూల్చివేశామని ప్రకటించుకుంది. ఈ నేప థ్యంలో కొత్త సాంకేతిక పరిజ్ఞానంద్వారా త్రివిధ దళాల సమన్వయంతో భారతదేశం సాధించిన యుద్ధ విజయాలను ప్రపంచదేశాలకు భారతదేశం గడచిన మూడు రోజులుగా వివరిస్తూ వాస్తవావిష్క రణ చేస్తున్నది. ఇందులో భాగంగా రక్షణ గూఢచారి సంస్థ డైరెక్టర్ జనరల్ ఢిల్లీలో పలుదేశాల సైనిక దౌత్యవేత్తలకు ఈ వివరాలు తెలియజేశారు. భూతలం,గగనతలం,సముద్రతలాలలపై పనిచేసే భారత సైనిక బలగాలు ఉమ్మడి వ్యూహంతో, సమన్వ యంతో ఏ విధంగా పాకిస్థాన్ సైనిక లక్ష్యాలను దెబ్బ తీసినదీ డి.జి. డిఐఏ వివరించారు. వక్రబుద్ధితో పాకి స్థాన్ సైన్యం చేస్తున్న దుష్ప్రచారాన్ని యావత్ భారత దేశం ఏకగ్రీవంగా ఖండించిందనీ, భారత రక్షణ దళం, సైనికబలగాలకు చెందిన అధికారులు గడచిన కొద్ది రోజులుగా జరిగిన పరిణామాలను, వాస్తవా లను ప్రత్యక్షంగా ప్రపంచానికి తెలియజేయడం భారత విశ్వసనీయతకు సంబంధించిన ఎంతో మంచి విషయమని ఈ సమావేశంలో పాల్గొన్న అధి కారులు చెప్పారు.

## ట్రంప్ వ్యాఖ్యలపై ప్రశ్నిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినప్పుడు అసలు విషయం ఏమిటి?, ఏం జరిగింది?, టెలిఫోన్‌లో జరిగిన సంభాషణలపై చర్చిస్తామన్నారు. ట్రంప్ మధ్యవర్తిత్వానికి ప్రధాని మోదీ లొంగిపోయారా అనే ప్రశ్నకు ఖర్గే బదులిస్తూ ఇప్పుడు ఈ విషయంపై మాట్లాడడం సరైంది కాదన్నారు. ప్రస్తుతం తాను పార్టీ సమావేశానికి వెళ్తు న్నానని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతానని, అప్పుడు వారు ఏం చేస్తారో చూద్దామని చెప్పారు. నాలుగు రోజుల పాటు జరిగిన తీవ్రమైన సరిహద్దు డ్రోన్, క్షిపణి దాడుల తర్వాత సైనిక సంఘర్షణను ముగించడానికి భారత్, పాకిస్తాన్ శనివారం ఒక అవగాహనకు వచ్చాయి. ఇరు దేశాల డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డిజిఎంలు) అన్ని కాల్పులు, సైనిక చర్యలను ఆపడానికి ఒక అవగాహనకు వచ్చాయని, మూడవ పక్షం ప్రమేయం లేదని భారత ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

## పాక్‌కు లక్ష్మణరేఖ

(మొదటి పేజీ తరువాయి)

పలకరించారు. ఈ సందర్భంగా ఆయన సైని కులతో సంభాషించారు. తరువాత ఎస్ 400 వ్యవస్థ ట్రేడ్ మార్క్ త్రిశూలాన్ని ఎంబ్రాయిడరీ చేసిన వెస్టర్న్ ఎయిర్ కమాండ్ టోపీని ప్రధాని మోదీ ధరించారు. అనంతరం ఎస్ 400 వ్యవస్థ కనిపించే విధంగా ఏర్పాటు చేసిన వేదిక పై నుంచి ఆయన సైనికులను ఉద్దేశించి ప్రసంగిం చారు. పొద్దున్నే మీ దర్శనం చేసుకునేందుకు తాను ఇక్కడికి వచ్చానని మోదీ అన్నారు. అనేక దశాబ్దాల పాటు భారత సాహసాల చరిత్రపై ఎలాంటి చర్చ సందర్భంలోనైనా మీకు ఒక స్థానం ఉంటుందని అన్నారు. మీరు వర్తమానా నికే కాకుండా భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి అని వైమానిక యోధులను ఉద్దేశించి ప్రశంసిం చారు. భారతీయ డ్రోన్‌లు, మిస్సైల్‌ళ్ళ కచ్చి తత్వం, వేగాన్ని చూసి కంగుతిన్న పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు గడుపుతుందని పేర్కొన్నారు. కేవలం పాకిస్థాన్‌లోని వైమానిక స్థావరాలనే కాకుండా అపవిత్రమైన ఉద్దేశ్యం, దుస్సాహ సాన్ని కూడా ఓడించామని మోదీ అన్నారు. ఆదంపూర్ వైమానిక స్థావరంపై పాకిస్థాన్ అనేక మార్లు దాడులు చేసేందుకు ప్రయత్నించినప్ప టికీ, మన బలమైన రక్షణ వ్యవస్థ విఫలం చేసిం దన్నారు. భారతదేశ సైనిక స్థావరాలకు నష్టం కలిగించడంలో పాకిస్థాన్ విఫలమైందని, వారి భూభాగం నుండి ఉగ్రవాదం కొనసాగినట్లయితే వారూ నిర్మూలించబడతారని ఆయన హెచ్చ రించారు. 'మన సాయుధ దళాలు అణు బెది రింపు గాలి తీసేసినప్పుడు, మన శత్రువులు 'భా రత్ మాతా కీ జై' ప్రాముఖ్యతను అర్థం చేసుకుం టారు' అని ఆయన అన్నారు. 'భారత్ మాతా కీ జై కేవలం నినాదం కాదు, దేశం కోసం తమ ప్రాణాలను అర్పించడానికి మన సైనికుల ప్రతిజ్ఞ. మన డ్రోన్లు క్షిపణులు మన శత్రువు లను తాకినప్పుడు, వారు 'భారత్ మాతా కీ జై' అనే నినాదాన్ని వింటారు' అని ఆయన అన్నారు.'మీ శౌర్య గాథలు చరిత్రలో శాశ్వ తంగా నిలబడతాయి. మన ఆర్మీ, ఎయిర్ ఫోర్స్,నేవీ సిబ్బందికి నేను వందనం చేస్తు న్నాను' అని ప్రధాని మోదీ అన్నా రు. భారతదే శంపై దుష్ట దృష్టిని సారించడం అంటే వారి నాశనానికి దారితీస్తుందనే విషయా న్ని ఉగ్రవా దాన్ని పోషించేవారు గ్రహించారని ప్రధాన మంత్రి అన్నారు. 'ఆపరేషన్ సిందూర్' అంటే మామూలు ప్రచారం కాదని, భారతదేశ విధానం, ఉద్దేశ్యం, నిర్ణయాత్మక సామర్థ్యంతో కూడిన త్రిసూత్రాలు అని, ఇది శాంతి సందేశ మిచ్చిన బుద్ధుడు, శత్రువులకు వ్యతిరేకంగా సిక్కుల ఆర్మీని తయారుచేసిన గురుగోవింద్ సింగ్‌ల భూమి అని దృఢంగా చాటుకున్నామని అన్నారు. మన సోదరీమణులు, కుమార్తెల సిందూరాన్ని తుడిచిపెట్టిన ఉగ్రవాదులను వారు దాక్కున్న ప్రదేశానికి వెళ్ళి అంతమొందించా మని మోదీ అన్నా రు. తమకు పాకిస్థాన్ సైనిక బలగాల రక్షణ ఉన్నదని ఉగ్రవాదులు భావిం చారని, కానీ, భారతీయ వైమానిక, నావిక, సైనిక దళాలు పాకిస్థానీ బలగాలను అణిచివేశా యన్నారు. ఉగ్రవాదులు భద్రం గా ఉన్నామని అనుకునేందుకు పాకిస్థాన్‌లో ఎ లాంటి ప్రదేశం లేదనే సందేశాన్ని ఇచ్చామని తెలిపారు. ఉగ్రవా దులను వాళ్ళు దాక్కున్న చోటుకు వెళ్ళి, తప్పిం చుకునే అవకాశం లేకుండా చంపేశామని ప్రధాని అన్నారు. పాకిస్థాన్ సరిహద్దుల్లో మోహ రించిన బిఎస్ఎఫ్ వంటి కేంద్ర సాయుధ పోలీస్ బలగాలను ఆయన అభినందించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## వ్యవసాయ, అటవీ శాఖలు పరస్పరం సహకారం : మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయ, అటవీ శాఖలు పరస్పరం సహకారంతో అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సచివాలయంలో మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ప్రధాన అటవీ సంచాలకులు, అటవీ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సువర్ణ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అటవీ శాఖ పరిధిలోని భూముల్లో రోడ్ల నిర్మాణం, అటవీ పార్కుల అభివృద్ధి తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో ఎల్‌డబ్ల్యు రోడ్ల అభివృద్ధి, అలాగే ఖమ్మం, సత్తుపల్లి, కొత్తగూడెంలో నియోజకవర్గాల్లో అటవీ పార్కుల అభివృద్ధి, ఇతర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అటవీ శాఖ అధికారులకు పలు కీలకసూచనలు చేశారు. ఇరు శాఖల మధ్య సమన్వయంతో పనిచేయడం ద్వారా అభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు, భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించి, అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

## బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికోసం
# పరితపించిన గురుప్రసాదరావు

పార్టీ విస్తరణకు ఆయన చేసిన కృషి మరువలేనిది

నేటి తరానికి గురుప్రసాదరావు ఆదర్శం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** పేద ప్రజల కష్టాలు గుర్తించి వారికి సేవలందించడం ద్వారా అల్లా గురుప్రసాదరావు జననేతగా ఖ్యాతిపొందారని, అయన అందించిన నిస్వార్ధ సేవల ఫలితంగానే కొత్తగూడెం, పరిసర ప్రాంతాల్లో కమ్యూనిస్టు పార్టీ బలమైన పునాదులు ఏర్పడ్డాయని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సిపిఐ కార్యవర్గ సభ్యులు, ప్రముఖ న్యాయవాది, కమ్యూనిస్టు నేత అళ్ల గురుప్రసాద రావు సంస్మరణ సభ మంగళవారం పట్టణంలోని కొత్తగూడెం క్లబ్బులో లాయర్స్ అసోయేషన్ రాష్ట్ర నాయకుడు వై.ఉదయ్‌భాస్కర్ అధ్యక్షతన జరిగింది. తొలుత సిపిఐ నాయకులు, వివిధ రాజకీయపక్షాల నాయకులు, న్యాయవాదులు గురుప్రసాద రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో కూనంనేని మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, న్యాయవాదిగా కొత్తగూడెం ప్రాంతంలో గురుప్రసాద్ యెనలేని సేవలందించారని, పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారంకోసం శ్రమించారన్నారు. అనునిత్యం పేదల అభ్యున్నతి, సంక్షేమం కోసం పరితపించేవాడని, ఆయనను ఆదర్శనంగా తీసుకొని అనేకమంది కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులై ప్రజాసేవకు అంకితమై నాయకులుగా ఎదిగారన్నారు. ప్రజలను చైతన్యవంతం చేసి ప్రశ్నించే తత్వం నేర్పించారని, కమ్యూనిస్టు పార్టీ ప్రతిష్టను పెంచారన్నారు. న్యాయవాదిగా పేదల పక్షం వహించాడని, మానవతా వాదిగా నిస్వార్ధంగా పేదలకు న్యాయ సేవలందించాడని, అయన మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరనిలోటని అన్నారు. సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మిరియాల రంగయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, ఎస్‌డి సలీం, కల్లూరి వెంకటేశ్వర్‌రావు, నరాటి ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రనరేంద్రకుమార్, కమటం వెంకటేశ్వరావు, సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఆదుసుమల్లి సాయిబాబా, కందుల భాస్కర్, కె.జమలయ్య, యూసుఫ్, పద్మజ, రత్నకుమారి, ధనలక్ష్మి, ఫహీంఖాన్, నాగుల్‌మీరా కాంగ్రెస్ నాయకులు నాగా సీతా రాములు, కంచర్ల చంద్రశేఖర్, కోనేరు చిన్ని, తూము చౌదరి, దయానంద్, మద్దెల శివకుమార్, సిపిఎం నాయకులు లిక్కి బాలరాజు, న్యూడెమోక్రసీ నాయకులు సురేందర్, కుటుంబసభ్యులు కుమార్తె అరుణ, పి.రాధా క్రిష్ణ మూర్తి, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రతీ జిల్లా కేంద్రంలోనూ..
# నైపుణ్య శిక్షణా కేంద్రం

తెలంగాణను నైపుణ్య హబ్‌గా మార్చాలన్నదే మా సంకల్పం

డిసెంబర్ 9న 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ' శాశ్వత క్యాంపస్ ప్రారంభం

రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణను నైపుణ్య హబ్‌గా తీర్చిదిద్దేందుకు 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' మార్గ నిర్దేశంలో రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో నైపుణ్య శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్‌లో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' నిర్మాణ పనుల పురోగతిని ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం గుత్తేదారు సంస్థ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి... పనులు సకాలంలో పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య ఏర్పడిన అంతరాన్ని తగ్గించి, తెలంగాణ యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతోనే అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ'ని ఏర్పాటు చేశామని వివరించారు. తెలంగాణ యువతలో ప్రతిభకు కొదవలేదని, కొంచెం సానబెడితే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ఓవైపు పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహిస్తూనే మరోవైపు తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తొలిదశలో భాగంగా మీర్ఖాన్ పేట్‌లోని స్కిల్స్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్‌లో అకడమిక్ బ్లాక్, ప్రయోగశాలలు, వసతి గృహాలు, వైస్ ఛాన్సలర్ కార్యాలయాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. వీటిని ఈ ఏడాది డిసెంబర్ 9న లాంఛనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం స్కిల్స్ యూనివర్సిటీలో సంబంధిత దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో ఫార్మా, రిటైల్, లాజిస్టిక్స్, ఏవియేషన్ అండ్ ఎయిర్పోర్ట్ మేనేజ్మెంట్ కోర్సులను అందిస్తున్నామన్నారు. ఈ కోర్సులకు మంచి డిమాండ్ ఉందని, విజయవంతంగా పూర్తి చేసిన 70 శాతం నుంచి 80 శాతం మందికి ఉద్యోగాలు లభిస్తున్నాయన్నారు. ఏడాది వ్యవధిలోనే 57 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత మా ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని స్పష్టం చేశారు. ఒకేసారి 100 అడుగులు వేయలేమని తెలిసినా... కొందరూ ప్రతిపక్ష నేతలు మాపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

**భావితరాల అవసరాల కోసం..**

సుస్థిరాభివృద్దే లక్ష్యంగా అంతర్జాతీయ ప్రమాణాలతో నాలుగో నగరంగా 'ఫ్యూచర్ సిటీ'ని అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలోనే ఫ్యూచర్ సిటీ అథారిటీ కార్యాలయాన్ని స్థానికంగా ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ విసి వివిఎస్ఎస్ సుబ్బారావు, ఓఎస్డీ కం రిజిస్ట్రార్ చమాన్ మెహతా, ఇతర ఉన్నతాధికారులు, గుత్తేదారు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సిఎంను మర్యాదపూర్వకంగా కలిసిన సమాచార కమిషనర్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్లుగా నియమితులైన బోరెడ్డి అయోధ్యరెడ్డి, పి.వి.శ్రీనివాసరావు, దేశాల భూపాల్, మొహిసినా పర్వీన్ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలోని సిఎం నివాసంలో మంగళవారం వారు కుటుంబ సమేతంగా రేవంత్‌రెడ్డిని కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. సమాచార కమిషనర్లుగా తమకు అవకాశం కల్పించినందుకు వారు సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## 31వరకు ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ గడువు పొడిగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లేఔట్ రెగ్యులరైజేషన్ సీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) ఫీజుపై ఇస్తున్న 25 శాతం రాయితీ గడువును ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ఈ నెల 3వ తేదీతో ముగిసిన గడువును మే 31 వరకు పొడిగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో వన్ టైమ్ సెటిల్‌మెంట్ ప్రకటించిన ప్రభుత్వం, ఎల్‌ఆర్‌ఎస్‌కు రాయితీ గడువును తొలుత మార్చి 31 వరకు గడువు ఇచ్చింది. అనంతరం దాన్ని ఏప్రిల్ 30 వరకు, ఆ తర్వాత మే 3 వరకు పొడిగించింది. తాజాగా మరోసారి మే 31వరకు పొడిగించింది. సాంకేతిక సమస్యలు తలెత్తడంతో మొదట దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ మందకొండిగా సాగింది. ఇతరత్రా కారణాలు పథకం అమలుకు అడ్డంకిగా మారాయి. ఈ నేపథ్యంలో రాయితీ గడువును పలు దఫాలుగా ప్రభుత్వం పొడిగించాల్సి వచ్చింది. 2020లో ప్రారంభమైన లేఔట్ క్రమబద్ధీకరణ పథకం కింద 25.67 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించిన వారిలో 40 శాతం మందికి అధికారులు ప్రొసీడింగ్స్ ఇచ్చారు.

అయితే 5.19 లక్షల మంది మాత్రమే ఏప్రిల్ 30 నాటికి చెల్లింపులు పూర్తి చేశారు. ఈ పథకం ద్వారా రూ.20,000 కోట్ల ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు రూ.1,863 కోట్లు మాత్రమే సమకూరింది. ఈ నేపథ్యంలో మరింతమంది దరఖాస్తుదారులకు అవకాశం కల్పించేందుకు గడువును పొడిగించారు.

## ధాన్యం సేకరణలో మేమే భేష్

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి


మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలకు మంత్రి కౌంటర్



**ప్రజాపక్షం/హైదారబాద్ :** ధాన్యం సేకరణకు సంబంధించి మాజీ హరీష్‌రావు చేసేవి అన్ని తప్పుడు ఆరోపణలేనని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ హాయంలో ఇదే రబి సీజన్‌లో ఈ సమయానికి కేవలం 19.62 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేస్తే తమ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యం 70.13 లక్షల మెట్రిక్ టన్నుల్లో ఇప్పటికే 43.10 లక్షల మెట్రిక్ టన్నులు (61.45 శాతం) ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేశామని చెప్పారు. ఇది గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హాయంతో పోల్చితే 120 శాతం అధికమని, ఇకనైనా అసత్య ప్రచారం మానుకోవాలని హరీష్ రావుకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హితువు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థికంగా రైతులకు పూర్తిగా వెన్నుదన్నుగా నిలిచేందుకు చర్యలు చేపట్టమే కాకుండా ధాన్యం కొనుగోళ్లలో ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 8245 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. ప్రతి గింజను కనీస మద్దతుకే వరి ధాన్యాని కొనుగోలు చేయడమే కాకుండా సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్‌ను సకాలంలో చెల్లిస్తున్నామని తెలిపారు. మీ హాయంలోనే కట్టి కాళేశ్వరం ప్రాజెక్టు మీ హాయంలోనే కూలిపోయిందని, అయినా రాష్ట్రంలో ఏడాది పంట కాలంలో మొత్తం 280 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కావడం దేశ చరిత్రలోనే ఓ రికార్డు అని తెలిపారు.

# చార్మినార్ వద్ద సుందరీమణుల హెరిటేజ్ వాక్

కట్టుదిట్టమైన భద్రతలో



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మిస్ వరల్డ్ అందగత్తెలు మంగళవారం హైదరాబాద్‌లోని చారిత్రాత్మక కట్టడం చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్ చేశారు. ప్రపంచ ప్రఖ్యాత చార్మినార్ వద్దకు 109 దేశాల మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్‌లు చేరుకోవడంతో పాతబస్తీకి వన్నెలు దిద్దారు. హెరిటేజ్ వాక్ వచ్చిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు సంప్రదాయ అరబ్బీ, మర్ఫా సంగీతంతో కళాకారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారంతా చార్మినార్ పరిసరాల్లో తిరుగుతూ సందడి చేశారు.

చార్మినార్ వద్ద ఫోటోలు, సెల్ఫీలతో హల్‌చల్ చేస్తూ మైమరచిపోయారు. చార్మినార్ చరిత్రను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఈ కట్టడం ముందు అందగత్తెలు గ్రూప్ ఫోటో దిగారు. చార్మినార్ సమీపంలోని చుడీ బజారులో ఎంపిక చేసిన తొమ్మిది దుకాణాల్లో వివిధ రకాల గాజులు, ముత్యాల హారాలు తదితర అలంకరణ వస్తువుల షాపింగ్ నిర్వహించారు. వీరంతా సుప్రసిద్ధ చౌహముల్లా ప్యాలెస్‌లో ఏర్పాటుచేసిన ప్రత్యేక విందుకు హాజరయ్యారు. కాగా అక్కడ మిస్ వరల్డ్ కంటెస్టర్లకు మెహేంది వేయడానికి ప్రత్యేక ఏర్పాటు చేశారు. చౌముల్లా ప్యాలెస్‌లో నిజాం హయాంలో ఉపయోగించిన యుద్ధ ఆయుధాలు, గృహోపకరణ సామాగ్రి, నిజాం నవాబులు ఉపయోగించిన వివిధ రకాల వస్తువులు, ఓల్డ్ సిటీ సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేసే ఫోటో ప్రదర్శనలు జరగనున్నాయి. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్త చర్యలో భాగంగా.. చార్మినార్ పరిసరాల్లోని చిల్లర వర్తక దుకాణాలు మూసివేయించారు.

**ఓరుగల్లుకు ప్రపంచ సుందరీమణులు**

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** ప్రపంచ సుందరీమణులు (మిస్ వరల్డ్ 2025 పోటీదారులు) బుధవారం వరంగల్ జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో వరంగల్‌లోని పలు దర్శనీయ ప్రాంతాలను సందర్శించనున్నారు. ఇందులో భాగంగానే వరంగల్ నగర వారసత్వాన్ని, సాంస్కృతిక సంపదను ప్రపంచానికి పరిచయం చేసే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. ఇందుకోసం పర్యాటక శాఖ విస్తృతంగా ఏర్పాట్లు చేస్తోంది. బుధవారం తొలుత 35 మందితో కూడిన అందాల భామల బృందం వేయిస్తంభాల ఆలయ నిర్మాణం, శిల్ప వైభవాన్ని, వరంగల్ కోటలో కాకతీయుల కీర్తి తోరణంతో పాటు శిల్పసంపదను పరిశీలిస్తుంది. కాగా, 22 మంది అందగత్తెలతో కూడిన మరో బృందం హైదరాబాద్ నుంచి నేరుగా ములుగు జిల్లాలోని రామప్ప ఆలయానికి చేరుకుని... అక్కడి శిల్ప సౌందర్యాన్ని పరిశీలిస్తారు. పేరిణి నృత్య ప్రదర్శనను తిలకిస్తారు. రాత్రి హరిత హోటల్‌లో డిన్నర్ పూర్తి చేసుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు. ఆయా జిల్లాల కలెక్టర్లు అందాల భామల పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టారు. వారికి ఎక్కడా ఎలాంటి ఇబ్బందిరాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భద్రత ఏర్పాట్లు చేపడుతున్నారు. ప్రభుత్వం వీరి పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నది. మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో ప్రతి అంశంలోనూ తెలంగాణ ఖ్యాతి ప్రతిబింబించేలా అధికారుల ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. 'తెలంగాణ జరూర్ ఆనా' అనే థీమ్‌తో ప్రభుత్వం అందాల భామలు ప్రాచీన ఆలయాలు.. పర్యాటక ప్రాంతాల అందాలు తిలకించేలా ప్రణాళిక రచించింది. తద్వారా వరంగల్ ఖ్యాతి ప్రపంచానికి పరిచయం చేయనున్నారు.

## కెటిఆర్‌కు పార్టీ బాధ్యతలు ఇస్తే స్వాగతిస్తా

కెసిఆర్ ఆదేశాలకు కట్టుబడి ఉంటా

ఎమ్మెల్యే హరీశ్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్‌లో ఎలాంటి విభేదాలు లేవని పార్టీ సీనియర్ నేత, సిద్ధిపేట ఎంఎల్‌ఎ టి. హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కెసిఆర్‌కు తాను క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను, కెసిఆర్ తర్వాత కెటిఆర్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే స్వాగతిస్తాను, సహకరిస్తాను అని స్పష్టం చేశారు. గతంలో చాలాసార్లు ఈ అంశంపై స్పష్టత ఇచ్చాను అని హరీశ్ రావు తెలిపారు. బిఆర్‌ఎస్ పార్టీలో తనకు, కెటిఆర్‌కు మధ్య విభేదాలున్నాయన్న ప్రచారాన్ని హరీశ్ రావు కొట్టిపారేశారు. పార్టీ అధినేత కెసిఆర్ తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తాను గౌరవిస్తానని, ఆయన ఆదేశాలను తప్పకుండా పాటిస్తానని చెప్పారు. కెసిఆర్‌కు తాను రాముడికి హనుమంతుడిలా క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను అన్నారు. కెసిఆర్ మాటే తన బాట అన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఆ గీత దాటే ప్రసక్తి లేదన్నారు. అందరం కెసిఆర్ నాయకత్వంలోనే కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. తనపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న దుష్ప్రచారాన్ని అప్పుడే ఖండించానన్నారు. తమ పార్టీ నేతలు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారని హరీశ్‌రావు తెలిపారు.

**ఇచ్చిన హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం..**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ చేతిలో మోసపోయామని ప్రజలు గ్రహించారని, తిరిగి కెసిఆర్ పాలన కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ప్రభుత్వాన్ని నడపడం అంటే ప్రతిపక్షాలపై దుమ్మెత్తిపోసినంత సులువు కాదన్యానరు.

ఇప్పటికైనా ముఖ్యమంత్రి పాలనపై దృష్టి సారించి, రైతుల కష్టాలను తీర్చాలని డిమాండ్ చేశారు. మంత్రులు, అధికారులు క్షేత్రస్థాయిలో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు నష్టం జరగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు.

## రేపటి నుంచి సరస్వతి పుష్కరాలు

ఏర్పాట్లపై ఆరా తీసిన మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని కాళేశ్వరం వద్ద ఈ నెల 15 నుంచి జరిగే సరస్వతి పుష్కరాలు ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వివిధ శాఖల అధికారు చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. పుష్కర ఏర్పాట్లపై సురేఖ ఆరా తీశారు. ఇప్పటికే ఏర్పాట్లకు సంబంధించి ఆయా శాఖలకు నిధులు విడుదలయ్యాయని సురేఖ తెలిపారు. తాజాగా మంగళవారం మరో రూ.8.2 కోట్లను విడుదల చేశారు. ఈ పుష్కరాలు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం త్రివేణీ సంగమంలో జరగనున్నాయి, ఇది గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంగమస్థలంగా ప్రసిద్ధి చెందింది. సరస్వతి పుష్కరాల సందర్భంగా భక్తుల సౌకర్యాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లుఅ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మంత్రి కొండా సురేఖకు వివరించారు. సరస్వతి పుష్కరాల నేపథ్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు చేయడంతోపాటు, అన్ని అవసరమైన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మంత్రికి వివరించారు. రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం రాత్రి కలెక్టర్ స్వయంగా తాత్కాలిక బస్టాండ్, సరస్వతి విగ్రహం, విఐపి ఘాట్, భక్తులు పుష్కర స్నానాలు చేసే త్రివేణి సంగమ ప్రాంతాలను పరిశీలించారు. మిగిలిన అన్ని పనులను బుధవారం వరకు పూర్తి స్థాయిలో ఎలాంటి పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. భక్తులు సురక్షితంగా స్నానాలు చేయగలిగేలా ఘాట్ వద్ద విద్యుత్ ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలని ఆయన అన్నారు. స్వచ్ఛ పుష్కరాలు కావాలని భక్తులు వినియోగించిన వ్యర్థాలను డస్ట్ ఎక్కడ పడితే అక్కడ వేయొద్దని గ్రామ పంచాయతీ సిబ్బందికి అప్పగించాలని సూచించారు. వివిధ పనులకు ఉపయోగించిన తదుపరి మిగిలిన పనికిరాని వస్తువులను గ్రామ పంచాయతీ నిర్దేశించిన ప్రాంతాల్లో వేసి పరిశుభ్రతకు సహకరించాలని సూచించారు. 15న ప్రారంభమయ్యే పుష్కరాలు ఈ నెల 26తో ముగుస్తుంది. పుష్కరాల సందర్భంగా 17 అడుగుల సరస్వతీ దేవి విగ్రహం, కాళేశ్వరం వద్ద ప్రతిష్ఠించారు. భక్తుల వసతి కోసం 100 పడకల టెంట్ సిటీ ఏర్పాటు చేశారు. స్నాన ఘాట్లు, మార్పిడి గదులు, తాగునీటి సౌకర్యాలు, శుభ్రమైన టాయిలెట్లు: భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. పిత్ర తర్పణాదుల కోసం ఏర్పాటు ప్రత్యేకంగా పిండప్రధాన మండపాలు సైతం ఏర్పాటు చేశారు.

# ఉద్యోగులతో సిఎం చర్చలు జరపాలి

తక్షణమే పిఆర్‌సి, ఐదు డిఎలు చెల్లించాలి

తెలంగాణ ఎంప్లాయిస్ కో-ఆర్డినేషన్ కమిటీ



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్‌సి ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న 5 డిఎలను చెల్లించాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరింది. ఉద్యోగ సంఘాల నేతలలో చర్చలు జరిపి, ఉద్యోగుల అన్ని రకాల సమస్యలను పరిష్కరించాలని, లేనట్లయితే సమరభేరి మోగిస్తామని కమిటీ ప్రకటించింది. తమ సమస్యలపై త్వరలో గవర్నర్‌ను, సిఎంను, సిఎస్‌ను కలుస్తామని తెలిపారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం తెలంగాణ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ప్రతినిధులు మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, శాసనమండలి మాజీ స్పీకర్ స్వామిగౌడ్, మాజీ ఎంఎల్‌సి పాతూరి సుధాకర్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల నేతలు విఠల్, దేవీప్రసాద్, రవీందర్‌రెడ్డి, సుమిత్ర మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వానికి నెలవారీగా రూ.18 వేల కోట్ల ఆదాయం మాత్రమే వస్తున్నదని, ఈ పరిస్థితుల్లో ఉద్యోగులు స్వీయ నియంత్రణ పాటించాలని సిఎం వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ చర్య ప్రభుత్వ ఉద్యోగులను ప్రజల ముందు దోషులుగా చిత్రీకరించడమేనని వారు పేర్కొన్నారు. ఒక్క పైసా కూడా ఖర్చు కానీ ఉద్యోగుల 34 డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని కోరారు. స్వామిగౌడ్ పాత పెన్షన్ పద్ధతి (ఒపిఎస్)ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.


**గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్, డివిజన్ - 14, జిహెచ్ఎంసి**

NIT NO. 07/ఇ.ఇ.14/జిహెచ్ఎంసి/2025–26 తేదీ: 13.05.2025; పని పేరు: డివిజన్ 14, కెజెడ్, జిహెచ్ఎంసి కింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు; అంచనా మొత్తం/రూపాయలలో: 10361568; బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేదీ/చివరి తేదీ మరియు సమయం: ఐటెం నెం.01 14.05.2025/ ఉదయం 11 గం.లకు, 17.05.2025/ ఉదయం 11.15 గం.లకు, ఐటెం నెం.02 నుండి 05 వరకు 14.05.2025/ ఉదయం 11 గం.లకు 21.05.2025/ ఉదయం 11.15 గం.లకు; పేరు మరియు అధికారి చిరునామా : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 14 జిహెచ్ఎంసి 5వ అంతస్తు అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్ కోసం మరిన్ని వివరాలను ఈ –ప్రొక్యూర్మెంట్ వెబ్‌సైట్ www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

Sd/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ 14, జిహెచ్ఎంసి

DIPR R.O. No: 1757-PP/CL/ADVT/1/2025-26 Date:13.05.2025

**తెలంగాణ రాష్ట్ర దక్షిణ విద్యుత్ పంపిణీ లిమిటెడ్**

టెండర్ ప్రకటన No: 02/25-26

(A)spec.T-106/24-25(G): 33/11 Kv వద్ద రోడ్ నెంబర్ 2వద్ద PTR-IIమెరుగుదల, SS (B) Spec. T-115/24-25(G): మీరాలం ఫిల్టర్ బెడ్స్ 33/11కెవి వద్ద PRT-II మెరుగుదల, SS (C) Spec.T-15(ఎస్‌సి రిజర్వ్‌డ్ ): 33/11 KV నిమ్స్ వద్ద PTR-I మెరుగుదల, SS, (D),Spec, T-16: 33/11 KV అల్విన్ SS వద్ద PTR-IIIమెరుగుదల, (E)Spec .T-17: 33/11 KV హెచ్.ఏ.ఎల్ వద్ద PTR-II మెరుగుదల, SS(F) Spec,T-18: 33/11KV మోతీమహల్ వద్ద PTR-I మెరుగుదల, SS(G)Spec.T-19: 33/11KV IICT వద్ద PTR-II మెరుగుదల, SS(H)Spec.T-20: 33/11KV బతుకమ్మకుంట వద్ద PROV.Additl PTR, SS(I)Spec, T-21: 33/11KV ఫీవర్ హాస్పిటల్ వద్ద Prov.of addtl PTR, SS(J) Spec.T-22(ఎస్‌సి రిజర్వ్‌డ్):33/11KV మలక్‌పేట్ B క్వార్టర్స్ వద్ద PTR-I మెరుగుదల, SS,(K) Spec,T-23: 33/11 KV టోలీచౌకి వద్ద PTR-I మెరుగుదల, SS,(L)Spec,T-24(ఎస్‌టి రిజర్వ్‌డ్): 33/11KV ఉస్మానియా హాస్పిటల్ SSవద్ద PTR-I మెరుగుదల కోసం పైన తెలియపర్చబడిన వాటికి రిజిస్టర్డ్ అర్హత కలిగిన కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లను ఆహ్వానించబడ్డాయి. మరిన్ని వివరాల కోసం ఈ వెబ్‌సైట్ https://tgsouthernpower.org)ను సందర్శించండి లేదా phone : 040-23431333/1112/1125లో సంప్రదించవచ్చు.

Sd/- సూపరింటెండింగ్ ఇంజనీర్ / SCADA TGSPDCL/Hyderabad.

DIPR R.O.No.1779-PP/CL/ADVT/1/2025-26, Date:13-05-2025

ప్రజాపక్షం
బుధవారం, మే 14

## ట్రంప్ అహాన్ని దెబ్బతీసిన చైనా

ప్రపంచ రాజకీయాన్ని కేవలం వాణిజ్యమే శాసిస్తుందనుకునే అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యాపారవేత్త మనస్తత్వాన్ని దెబ్బతీసింది కమ్యూనిస్టు చైనా ప్రజారిపబ్లిక్. జనవరి 20న ఒక టరం విరామంతో రెండవసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన విజయగర్వంతో కావచ్చు ట్రంప్ మహాశయుడు ప్రపంచంపై వాణిజ్య యుద్ధం ప్రారంభించటం తెలిసిందే. అమెరికాను మహత్తర దేశంగా తిరిగి నిలబెట్టాలంటే (మెగా) దాని వాణిజ్య లోటును తక్షణం కనీస స్థాయికి తగ్గించాలి. అంటే ఖర్చులు తగ్గించాలి, ఆదాయం పెంచుకోవాలి. అయితే ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్తగాని ఆర్థికవేత్త కాదు. ఆయన ప్రపంచకుబేరుడు ఎలాన్‌మస్క్ సారథ్యంలో నియమించిన పరిపాలనా సంస్కరణల కమిటీకి వ్యాపారం తప్ప రాజకీయం తెలియదు. ప్రభుత్వ వ్యయం తగ్గించుకునే చర్యల్లో భాగంగా అధ్యక్షుడు ట్రంప్ వాతావరణ రక్షణ పారిస్ ఒప్పందం నుంచి వైదొలగటం, ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి నిష్క్రమణ, అమెరికన్ ఎయిడ్ కార్యక్రమం రద్దు వగైరా ఏకపక్ష నిర్ణయాలు ప్రకటించాడు. అదే సమయంలో యూరప్ భద్రతకు హామీగా ఉన్న నాటో కూటమి నిర్వహణకు యూరప్ దేశాలు తమ కంట్రిబ్యూషన్ పెంచాలని లేనట్లయితే వాటి రక్షణ అవే చూచుకోవాలని కల్లోలం సృష్టించాడు. అదే సమయంలో యూరోపియన్ యూనియన్, బ్రిటన్‌ల నుంచి దిగుమతులపై సుంకాలు ఇబ్బెడుముబ్బెడు చేశాడు. యూరప్‌తో ఘర్షణ కొనసాగుతుండగానే తమతో వాణిజ్యం చేసే అనేక దేశాలపై వరుసబెట్టి దిగుమతి సుంకాలు భారీగా పెంచాడు. అక్రమవలస ప్రజలను వెనక్కు తరలించటం, కెనడాను 52వ రాష్ట్రంగా చేసుకుంటామని, ఐస్‌లాండ్‌ను కొనుగోలు చేస్తామని విస్తరణవాద హెచ్చరికలు చేశాడు. అమెరికాతో వాణిజ్యం చేస్తున్న 123దేశాలపై దిగుమతి సుంకాల పెంపుదలను వాటిని కొత్త వాణిజ్య ఒప్పందాలకై లొంగదీసుకునే అస్త్రంగా ట్రంప్ ప్రయోగించాడు. కొన్నిదేశాలపై పెంచిన సుంకాల అమలును వాయిదా వేశాడు. అనేక దేశాలు ట్రంప్ పెంచిన సుంకాలకు దీటుగా తాము అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలు పెంచాయి. కేవలం 23 దేశాలు మాత్రమే కొత్తగా వాణిజ్య చర్చలకు ముందుకు వచ్చాయి. రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అమెరికాను ఎదుర్కొంటున్న, అనేక ఉత్పత్తుల్లో అమెరికాను మించిపోయిన చైనా ఆర్థిక శక్తిని దెబ్బతీయటం ద్వారా ప్రపంచ వ్యవహారాల్లో దాని ప్రభావాన్ని, పాత్రను తగ్గించే యోచనతో అధ్యక్షుడు ట్రంప్ చైనా నుంచి దిగుమతులపై అంచెలంచెలుగా సుంకాలు పెంచుతూ 145శాతం వరకు పెంచారు. కొన్ని వస్తువులపై 250 శాతం సుంకం విధించారు. చైనా తొణకలేదు, బెదరలేదు. అదీ ఆచితూచి కొంతమేర దిగుమతి సుంకాలు పెంచింది. అదే సమయంలో తమ ఎగుమతులను ఇతర దేశాలకు మళ్లించే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. చైనా వాణిజ్య చర్చలకు వస్తుందని ఆశించిన ట్రంప్‌కు నిరాశే ఎదురైంది. చివరకు తనే చొరవ తీసుకుని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మాట్లాడారు. పర్యవసానంగా మంగళవారం జెనీవాలో ఇరుదేశాల వాణిజ్య ప్రతినిధుల మధ్య ఫలప్రదమైన చర్చలు జరిగాయి. 80 శాతం సమంజసమని కొద్దిరోజుల క్రితం అన్న ట్రంప్ నాలుక మరింత మడుచుకోవాల్సి వచ్చింది. చైనా నుంచి దిగుమతులపై తమ 145శాతం సుంకాన్ని 30శాతానికి తగ్గించుకోవటానికి అమెరికా ప్రతినిధులు అంగీకరించగా, అమెరికా వస్తువులపై తమ సుంకాలను చైనా 10శాతానికి తగ్గించింది. ఇరుపక్షాలూ సరుకులపై సుంకాల్లో 91శాతం రద్దు చేయటానికి, మరో 24శాతాన్ని 90 రోజుల పాటు నిలుపుదల చేయటానికి అంగీకరించినట్లు చైనా వాణిజ్యమంత్రి చెప్పారు. అంటే మొత్తం 115 శాతం తగ్గుదల అమలులోకి వచ్చింది. అమెరికా సుంకాలకు ప్రతిగా ఏప్రిల్ 2 నుంచి తాము తీసుకున్న ఇతర చర్యలు ఉపసంహరించుకోవటానికి చైనా అంగీకరించింది. ఈలోపు ఇరుదేశాలకు ప్రయోజనదాయకంగా వాణిజ్య చర్చలు జరుగుతాయి. ఇది ట్రంప్‌లో హృదయ పరివర్తన కాదు. పరిస్థితుల ఒత్తిడి. సుంకాల పెంపుదల వల్ల అనేక వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవటాన్ని నిరసిస్తూ అమెరికా నగరాల్లో వేలాదిమంది ప్రదర్శనలు, ఈ విధానాలతో సంవత్సరాంతానికి ఆర్థిక మాంద్యం సంభవించవచ్చన్న ఆర్థికవేత్తల అంచనాలు, పడిపోయిన ట్రంప్ రేటింగ్ ప్రభావం చూపాయి. అమెరికా అధ్యక్షుడి చిత్తచాంచల్యానికి ప్రపంచం బలికాకూడదు. పెద్దరికం నిలుపుకునే పద్ధతి ఇది కాదని ట్రంప్ ఇప్పటికైనా గుర్తిస్తే మేలు.

# సాంకేతికత పరదాలో ప్రపంచ గమనం



సుంకవల్లి సత్తిరాజు
9704903463

ఒకప్పుడు ప్రపంచం ఎంతో విశాలంగా కనిపించేది. దేశ విదేశాలకు పయనమంటే సముద్ర మార్గాలే ఏకైక దిక్కు. నెలల తరబడి చేసే ప్రయాణంలో కొంత మంది అనారోగ్యతో మార్గమధ్యంలోనే మరణించేవారు. వైద్య, ఆరోగ్య సదుపాయాలు అరకొరగా ఉండేవి. పల్లెల పరిస్థితులు మరీ అధ్వాన్నంగా ఉండేవి. కమ్యూనికేషన్ వ్యవస్థలు సరిగా లేకపోవడంతో ప్రపంచంలో జరిగే సంఘటనలు బాహ్య ప్రపంచానికి తెలియడానికి చాలా సమయం పట్టేది. ప్రజలకు మౌలిక సదుపాయాలు సరిగా ఉండేవి కావు. విద్య కేవలం కొంతమందికే పరిమితమై ఉండేది. విదేశీ విద్య గగనకుసుమంలా ఉండేది. అయితే నేడు ఆ పరిస్థితులు మారాయి. ప్రపంచం వేగంగా పరుగులు పెడుతున్నది. అన్నిరంగాలకు సాంకేతిక రంగం విస్తరించడం వలన కమ్యూనికేషన్ వ్యవస్థ ఆధునీకరణ సంతరించుకోవడం వలన నేడు ప్రపంచం 'గ్లోబల్ విలేజ్' గా మారిపోయింది. సాంకేతిక రంగం జన జీవన గమనాన్ని మార్చేసింది. సాంకేతిక పరిజ్ఞానం ఇంతగా ప్రపంచాన్ని పెను మార్పులకు గురి చేస్తుందని ఎవరూ ఊహించలేదు. రాబోయే కొద్ది సంవత్సరాల్లో ప్రపంచాన్ని ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ పూర్తిగా ఆవహించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వచ్చే ఏడాది నాటికి 50 శాతం కోడింగ్ ఎఐ చేస్తుందని మెటా ప్లాట్‌ఫామ్స్ సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ చెబుతుంటే, మైక్రోసాఫ్ట్‌లో ఇప్పటికే 30 శాతం కోడింగ్ ఎఐ చేతుల్లోకి వెళ్ళిందని ఆ సంస్థ సిఇఒ సత్య నాదెళ్ళ పేర్కొనగా, హేమా హామీల కందని కోడింగ్ ఎఐ స్వంతమని స్పేస్ ఎక్స్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ప్రకటించడాన్ని బట్టి చూస్తే భవిష్యత్తులో ఎఐ ప్రాధాన్యత ఎలా ఉండగలదో ఊహించగలం. భవిష్యత్తులో ఎఐ మీద పట్టు గల వారికే ఉద్యోగాలు దక్కుతాయి. సాఫ్ట్ వేర్ రంగం సాఫ్ట్ నెస్ కోల్పోయింది. కష్టించి పని చేసి, అప్పగించిన పనులు విజయవంతంగా పూర్తి చేయగలిగితేనే కొంత కాలం ఉద్యోగాల్లో కొనసాగగలరు. నేటి చదువులు, మార్కులు సాఫ్ట్ వేర్ రంగంలో రాణించడానికి ఉపకరించగలవా? అనే సంశయం కలగడం సహజం. మారుతున్న టెక్నాలజీని ఎప్పటికప్పుడు ఒడిసిపట్టుకుని, ఉద్యోగాలు సంపాదించాలి. ఉద్యోగార్థులు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో తక్కువ వేతనాలతో పని చేసే వారికే టెక్ కంపెనీలు ప్రాధాన్యత నిచ్చే అవకాశాలున్నాయి. ఇప్పటికే అర కొర జీతాలతో గొడ్డు చాకిరీ చేస్తున్నవారిని చూస్తున్నాం. మానసికంగా నలిగి పోతూ, ఉంటుందో, ఊడుతుందో తెలియని భద్రత లేని ఉద్యోగాల కోసం మనశ్శాంతి కోల్పోవడం కంటే ప్రత్యామ్నాయ ఉపాధిని అన్వేషించుకోవడం మంచిది.

మార్కులతో, బట్టీ చదువులతో తమ పిల్లల భవిష్యత్తు బాగుపడుతుందని భ్రమ పడే తల్లిదండ్రుల ధోరణి మారాలి. బోధనా పద్ధతులు కూడా మారాలి. అన్ని రంగాలు సాంకేతికతతో మేళవించిన కారణంగా ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరిగినా యావత్ ప్రపంచం స్తంభించిపోయే ప్రమాదముంది. సాఫ్ట్ వేర్ రంగానికి చెందిన నిపుణులు, ఉద్యోగులు, టెక్ కంపెనీలు సాంకేతిక వ్యవస్థలు దుర్వినియోగం కాకుండా ప్రపంచ జీవన గమనం సాఫీగా సాగడానికి నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరాలు పెరిగి పోతున్నాయి. వర్తమాన ప్రపంచంలో చోటుచేసుకుంటున్న నేరాల్లో అత్యంత ఆధునిక నేరంగా 'సైబర్ క్రైమ్' పేరుగాంచింది. ఈ మాట వింటుంటే ముచ్చెమటలు పట్టక మానవు. ఒకప్పటి సినిమాల్లో భయంకరమైన రౌడీ




వేషాల్లో వచ్చి, కిడ్నాపులు చేయడం, దోపిడీలకు పాల్పడడం వంటి సన్నివేశాలు కనిపించేవి. అయితే ఈఆధునిక సమాజంలో నిజంగా నిర్లజ్జగా క్షణాల్లో మోసాలు జరిగిపోతున్నాయి. కాలు బయటకు కదపకుండా, కోట్లు కూడబెట్టే విద్యలో కొంతమంది ఆరితేరిపోయారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం సైబర్ నేరగాళ్ళకు కాసుల పంటగా మారింది. కోట్లు దండుకునే ఘరానా మోసానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఎక్కడో విదేశాల్లో కూర్చుని, చెమట పట్టకుండా, విద్యాధికులకు సైతం ముచ్చెమటలు పట్టించే వికృతమైన క్రీడా విన్యాసానికి పర్యాయపదంగా 'సైబర్ క్రైమ్' పేరుగాంచింది. అశ్లీల దృశ్యాలను సాంఘిక మాధ్యమాల్లో పెడతామని బ్లాక్ మెయిల్ చేసి, సామాన్యుల నుండి సెలబ్రిటీలను సైతం మోసం చేసి, డబ్బులు గుంజుకోవడం చూస్తున్నాం. ప్రభుత్వ పథకాల పేరుతో, బ్యాంకు అధికారుల పేరుతో వివిధ రకాలుగా బెదిరింపులకు పాల్పడుతూ, ఎటిఎం పిన్ చెప్పమంటూ అజ్ఞాత వ్యక్తులు మాయమాటలు చెప్పడం, కెవైసి అప్ డేట్ కోసమంటూ ఒటిపి అడగడం, మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు పంపడం, వాట్సాప్‌లలో లింకులు పంపించి, క్లిక్ చేయమనడం ద్వారా డబ్బులు కాజేయడం వంటి సంఘటనలు పలుచోట్ల చోటుచేసుకుంటున్నాయి. అక్షరాస్యులు, నిరక్షరాస్యులు అనే తేడా లేకుండా నమ్మించి, బ్యాంకు ఖాతాలను ఖాళీ చేయించడంతో ఏం చేయాలో అర్థంకాక ఎంతో మంది ఆవేదన చెందుతున్నారు. కష్టించి, సంపాదించిన సొమ్మంతా క్షణాల్లో మాయం కావడంతో ఏం చేయాలో అర్థం గాక అమాయకులు తీవ్రమైన మనోవ్యధకు గురవుతున్నారు. మన మాటలను, వీడియోలను పరిశీలించి, ఎడిట్ చేసి, మోసం చేయడం, శీల హననం చేయడానికి యత్నించడం, బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడడం, తమ మాట వినకపోతే తీవ్రం గా నష్టపోతారంటూ, బెదిరింపులకు పాల్పడడం జరుగుతున్నది. ఇటీవలి కాలంలో డిజిటల్ అరెస్టుల పేరుతో తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్న ముఠాలు బయలు దేరాయి. సైబర్ క్రైమ్ నేరాలను నిరోధించడానికి టోల్ ఫ్రీ నెంబర్లు ఇవ్వబడ్డాయి. అనేక కేసులు నమోదవుతున్నాయి. అయితే కేసులు పెట్టడం వలన ఎంతమంది నేరస్థులు పట్టుబడుతున్నారో, ఎలాంటి శిక్షలు విధిస్తున్నారో అర్థం కావడం లేదు. భారతదేశంలో డిజిటల్ అరెస్టులకు చట్టబద్ధత లేకపోయినా, వీటి పేరుతో నేరస్థులు సాగిస్తున్న కార్యకలాపాలకు బెంబేలెత్తిపోతున్న అమాయకుల ఆక్రందనలకు అడ్డుకట్టవేయలేమా? సాంకేతిక రంగంలో పెను విప్లవం 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్'. కృత్రిమ మేథస్సుతో వివిధ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టి, ఆధునీకరించిన సాంకేతిక ప్రక్రియతో వేగవంతంగా పనులను పూర్తి చేసి, ప్రగతిని పరుగులు పెట్టించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

సాఫ్ట్ వేర్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను విస్తృతం చేసే ప్రయత్నాలు వేగం పుంజుకున్నాయి. భవిష్యత్తులో కృత్రిమ మేథ కీలక భూమిక పోషించే అవకాశముంది. అయితే ఇలాంటి కృత్రిమ మేథ సైబర్ నేరస్థులకు స్వర్గధామంలా మారడం దురదృష్టకరం. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ సహాయంతో మన మాటలను, మన వీడియోలను మార్ఫింగ్ చేసి, వాట్సాప్ ద్వారా పంపించి, డబ్బులు పంపించమంటూ కోరడం, ఆ వీడియో లు నిజమేనని నమ్మి డబ్బులు పంపించడం ద్వారా ఆర్థికంగా నష్టపోతున్న వారు ఎవరిని ఆశ్రయించాలో తెలియక తికమక పడుతున్నారు. కేసులు పెట్టినా ఫలితం ఉంటుందనే నమ్మకం లేక దిగాలు పడుతున్న వారికి న్యాయం జరుగుతుందా? టెక్నాలజీ దుర్వినియోగం విశృంఖలంగా కొనసాగుతున్నది. మన ప్రయోజనాల కోసం మనం నిర్మించుకున్న సాంకేతిక ప్రపంచం వక్రమార్గంలో పయనిస్తున్నది. విద్య, వైద్య, ఆర్థిక, రవాణా, కమ్యూనికేషన్, సాంస్కృతిక రంగాల్లో నిర్మాణాత్మకంగా వినియోగపడవలసిన టెక్నాలజీ అసాంఘిక శక్తుల చేతుల్లోకి పోయి, అడ్డదారుల్లో పయనిస్తున్నది. మొబైల్ ఫోన్ల వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. మొబైల్ ఫోన్ లేనిదే రోజు గడవని పరిస్థితులు ఏర్పడ్డాయి. యూట్యూబ్, వాట్సాప్ ఫేస్ బుక్, ఇన్‌స్టాలు, ట్విట్టర్, ఎక్స్ వంటి సాంకేతిక వేదికలు సమాజానికి ఉపకరించాలి. అయితే సోషల్ మీడియా అన్ని విలువలను అతిక్రమించి, అత్యంత ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యంలో కొత్తగా పుట్టుకొచ్చిన 'ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్' వలన ఎన్నో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇప్పటికే దీని ప్రభావం వలన అనేక మంది బాధితులైనారు. మొబైల్ ఫోన్లలో నిక్షిప్తమైన మన వ్యక్తిగత భద్రత ప్రశ్నార్థంగా మారుతున్నది. నిర్మాణాత్మకంగా ఉపయోగపడవలసిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను అసాంఘిక కార్యకలాపాలకు, ఆర్థిక నేరాలకు వినియోగించడం వలన వ్యక్తిగత గోప్యతకు, ఆర్థిక భద్రతకు, స్వేచ్ఛకు ముప్పుగా పరిణమించింది. డేటా చౌర్యం యథేచ్ఛగా సాగుతున్నట్టు పలు వార్తా కథనాలు సూచిస్తున్నాయి. ఇకనైనా సైబర్ నేరాల పట్ల పటిష్ఠమైన, వేగవంతమైన చర్యలు తీసుకోవాలి. సైబర్ నేరాలను అణచివేయడానికి ప్రపంచ దేశాలన్నీ ఏకం కావాలి. సమిష్ఠితత్వంతో పటిష్ఠమైన యంత్రాంగాన్ని రూపొందించుకోవాలి. సాంకేతిక రంగం లేనిదే పూట గడవని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో ఊహించడానికే భయంగా ఉంది. భువన గగనాల్లో ఆధిపత్యం కోసం పోరాటం జరుగుతున్నది. ఇందులో సాంకేతికత ప్రముఖ భూమిక పోషిస్తున్నది. యుద్ధాలు కూడా టెక్నాలజీ ఆధారంగా జరుగుతున్నాయి. అణ్వస్త్రాలు, ఇతర యుద్ధ పరికరాలు, యుద్ధ విమానాలు ఆధునికత సంతరించుకున్నాయి. అన్నింటా టెక్నాలజీ దే అగ్రస్థానం. ఇలాంటి పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానం విషయంలో తగు జాగరూకత వహించాలి. నిర్మాణాత్మకమైన కార్యక్రమాలకు మాత్రమే సాంకేతిక పరిజ్ఞానం వినియోగ పడేటట్లు తగిన యంత్రాంగం నెలకొల్పాలి. విధ్వంసానికి, విద్వేషాలకు సాంకేతికతను దుర్వినియోగపరచకూడదు. ఒకప్పుడు సాంకేతిక పరిజ్ఞానం అంటే అంతరిక్షానికో, అణురంగానికో, కమ్యూనికేషన్ వ్యవస్థల మెరుగుదల కోసమో వినియోగించేవారు. రాను రాను టెక్నాలజీ సరికొత్త రూపు రేఖలను సంతరించుకుని వివిధ రంగాలను శాసిస్తున్నది. సాంకేతిక పరిజ్ఞానమంటే యుద్ధాలకో, విధ్వంసానికో కాదు ఉద్యోగ కల్పన కోసం, మెరుగైన జీవన శైలి కోసమనే భావన ఏర్పడింది. టెక్నాలజీ ఉపాధి అవకాశాలను మెరుగు పరచి దేశాభివృద్ధికి ఉపకరిస్తున్న ది. వర్తమాన ప్రపంచంలో 'టెక్నాలజీ' మానవ జీవితాలను శాసిస్తున్నది. సాంకేతికత నిర్మాణాత్మకమైన ప్రయోజనాలతో పాటు అనేక విపరీత పరిణామాలకు కూడా దోహదం చేయడం బాధాకరం. ఇది కేవలం మానవ తప్పిదం. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంలో మంచి చెడుల విచక్షణ అవసరం. సాంకేతను విశ్వమానవ కళ్యాణానికి వినియోగ పడాలి.

# మధ్యలో ట్రంప్ ఎవరు?
# విపక్షాల మండిపాటు

కశ్మీర్ సమస్య పరిష్కారానికి ట్రంప్‌ను ఎవరు ఆహ్వానించారు? ఎవరూ పిలవనిదే 'భారత్, పాకిస్తాన్ దేశాలతో కలిసి పనిచే స్తామని' అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏలా అన గలిగా డు.? ఇరు దేశాల మధ్య సమస్యలను ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కారించు కోవాలసిన ఒప్పందంలో ఉంది. ప్రస్తుతం ఇరు దేశాలు యుద్ధంలో ఉండగా 'కాల్పుల విరమణకు సయోధ్య కుదిర్చామని' శనివారం ట్రంప్ ఏలా చెప్పగలిగాడు? దానికి తగ్గట్టు గానే అమెరికా తరువాత పాకిస్తాన్, వెను వెంటనే భారత్ యుద్ధానికి విరామం ప్రకటించారు. అంతటితో ఆగకుండా ఇప్పుడు 'కశ్మీర్ సమస్య పరిష్కారానికి ఇరు దేశాలతో కలిసి పనిచేస్తామని' ట్రంప్ అంటున్నారు. ఈ విషయాన్ని తన సొంత సో షల్ మీడియా వేదిక 'ట్రూత్' ద్వారా ఆయనే స్వయంగా వెల్లడించారు. ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే లక్షల మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయి ఉండేవారని ఈ 'మానవతా వాది' అంటున్నారు. ఇరు దేశాల నేతలు తెలివైన నిర్ణయం తీసుకున్నారని కూడా ట్రంప్ ప్రశంసించారు అంటే ఇరు దేశాలు తమ జుట్టును ట్రంప్‌కు స్వచ్ఛందంగా అప్పగించారనే తెలుస్తోంది. ట్రంప్ ప్రకటనను ఇటు భారత్ కానీ, అటు పాకిస్తాన్ కానీ ఖండించ లేదు. పాకిస్తాన్‌కు సంబంధించి అత్యున్నత నిర్ణయాలు తీసుకునే నేషనల్ కమాండ్ అథారిటీతో సమావేశానికి ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సిద్ధమైన నేపథ్యంలో ట్రంప్ ఈ ప్రకట న చేయడం



గమనార్హం. అయితే, పాక్ రక్షణ మంత్రి భావాజా ఆసిఫ్ మాత్రం ఇలాంటి సమావేశమేదీ జరగలేదని తేల్చి చెప్పా రు. భారత్, పాకిస్తాన్ దేశాల బలమైన, అచంచల నాయకత్వ పటిమకు తాను గర్విస్తున్నానని, ఎంతోమంది మరణానికి, విధ్వంసానికి దారితీసే ప్రస్తుత దూకుడుకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన సమయం ఇదేనని ఇరు దేశాలు గ్రహించాయని అన్నారు. 'మీధైర్యవంతమైన చర్యలతో మీ వారసత్వం ఎంతగానో పెరిగింది. చారిత్రక, వీరోచిత నిర్ణయానికి 'అమెరికా సాయం' చేసినందుకు గర్వంగా ఉంది' అని ట్రంప్ అంటున్నారు. పైగా కశ్మీర్ సమస్య పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహిస్తానన్న ట్రంప్ ప్రకటనను పాకిస్థాన్ స్వాగతించింది. అంతే కాదు దక్షిణాసియా, దాని ఆవల శాంతి భద్రతలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్న దీర్ఘకాల సమస్య అయిన జమ్ముకశ్మీర్ వివాద పరిష్కారానికి ట్రంప్ తన సంసిద్ధతను వ్యక్తం చేయడాన్ని తాము అభినందిస్తున్నట్టుగా కూడా పేర్కొంది. జమ్ముకశ్మీర్ వివాదానికి న్యాయమైన, శాశ్వత పరిష్కారం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానాలకు అనుగుణంగా ఉండాలని, కశ్మీరీ ప్రజల ప్రాథమిక హక్కులు, వారి స్వయం నిర్ణయాధి కారహక్కును కూడా సాధించేలా చూడాలని పాక్ నొక్కి చెప్పింది. ప్రపంచ శాంతికి ట్రంప్ మార్గదర్శక నాయకత్వం, నిబద్ధత, దక్షిణాసియాకు శాశ్వత శాంతిని తీసుకురావడంలో గొప్ప పాత్ర పోషించాలనే ట్రంప్ అత్యంత విలువైన ప్రతిపాదనకు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నట్టు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. 'దశాబ్దాలుగా పాక్, అమెరికా దేశాలు పరస్పర ప్రయోజనాలను రక్షించుకునేందుకు, ప్రపంచంలోని కీలక ప్రాంతాల్లో శాంతి, భద్రత కోసం భాగస్వాములుగా ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లో మా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పునరుద్ధరించగల, పాకిస్తాన్–యుఎస్ సంబంధాలను బలోపేతం చేయగల గొప్ప భాగస్వామిని పాక్ కనుగొంది. వాణిజ్యం, పెట్టుబడిలో మాత్రమే కాకుండా సహకారానికి సంబంధించి అన్ని రంగాల్లో కూడా' అని షెహబాజ్ ట్వీట్ చేశారు.

### మోదీ సర్కారుపై ప్రతిపక్షాల ఘాటైన విమర్శలు

భారత్ ఈ విషయంలో ట్రంప్ పోకడపై, పాకిస్తాన్ దాసోహ ప్రకటనపై ఇప్పటి వరకు ఏలాంటి ఖండనను మోదీ విడుదల చేయలేదు. ఇలా భారత్ విదేశాంగ విధానంలో ట్రంప్ జోక్యాన్ని ఎదిరించక పోతే మన దేశ సార్వభౌమాధికారాన్ని అమెరికా చేతికి అప్పగించినట్లు కాదా? అని విపక్షాలు మోదీని నిలదీస్తున్నాయి. భారత్, పాకిస్తాన్ మధ్య మధ్యవర్తిత్వం చేస్తామంటూ అమెరికా ప్రకటించడం పట్ల విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికార బిజెపిని నిలదీశాయి. పాకిస్తాన్‌తో యుద్ధంలో ఉండగా హఠాత్తుగా ఎవరితోనూ సంప్రదించకుండా పాకిస్తాన్‌తో యుద్ధానికి స్వస్తి పలికి కాల్పుల విరమణ ప్రకటించడానికి కారణమేమిటో ఈ దేశ ప్రజలకు చెప్పాలంటూ డిమాండ్ చేశాయి. ఇరు దేశాల సమస్యలపై ద్వైపాక్షికంగానే చర్చలు జరపాలంటూ గతంలో కుదుర్చుకున్న సిమ్లా ఒప్పం దాన్ని మోదీ ప్రభుత్వం ఎందుకు వదిలేసింది? మూడో దేశం జోక్యానికి ఎందుకు తలుపులు బార్లా తెరిచింది? అని ప్రశ్నించాయి. పహల్గాం ఘటన, ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి పూర్తి స్థాయిలో చర్చలు జరిపేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని తాము డిమాం డ్ చేస్తున్నట్టు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపా రు. కాల్పుల విరమణపై వాషింగ్టన్ తొలి ప్రకటన చేయడం, తర్వాతే భారత్, పాకిస్తాన్లు స్పందించడం తదితర విషయాలను కూలంకషంగా చర్చించాలన్నారు. కాగా, ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ విపక్ష నేతలు మల్లి ఖార్జున ఖర్గే (రాజ్యసభ), రాహుల్ గాంధీ (లోకసభ) ప్రధాని నరేంద్ర మోదీకి లేఖలు రాశారు. భారత్, పాక్ మధ్య చర్చలకు తటస్థ వేదిక అంశాన్ని యుఎస్ విదేశాంగ కార్యదర్శి ప్రస్తావించడాన్ని కాంగ్రెస్ గుర్తు చేస్తూ ఆయన చేసిన ప్రకటన పలు ప్రశ్నలు, అనుమానాలను రేకెత్తిస్తున్నదని పేర్కొంది.

### ఇది భారత దేశానికే అవమానం

మోదీ చర్య దేశానికే పెద్ద అవమానమని శివసేన యుటిబి నేత సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. మీకే కనుక ధైర్యం ఉంటే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, దానికి ప్రధాని మోదీ కచ్చితంగా హాజరు కావాలని ఆయన డిమాండ్ చేశారు. ట్రంప్ జోక్యం కారణంగా యుద్ధాన్ని ఆపేసినట్టు ప్రభుత్వం చెబుతున్నదని, అలాంటప్పుడు ఎన్నాళ్ల నుంచో జరుగుతున్న ఇజ్రాయెల్–గాజా యుద్ధాన్ని ట్రంప్ ఎందుకు ఆపలేదని ఆయన ప్రశ్నిం చారు. ట్రంప్ జోక్యం మన దేశ సార్వభౌమత్వంపై దాడేనని, ఇది మన ప్రభుత్వ బలహీనతను చూపుతున్నదని ఆయన అన్నారు. రెండు దేశాల మధ్య వివాదంలో మూడో దేశం జోక్యం సహించరానిదని ఆర్జేడీ ఎంపీ మనోజ్ కె ఝూ అన్నారు. ప్రాంతీయ వివాదంలో బాహ్యశక్తుల జోక్యాన్ని ఎంతమాత్రం సహించ కూడదని ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జీ దేవరాజన్ పేర్కొన్నారు.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496

# ఉగ్రవాదాన్ని ముస్లింలందరికీ
# ఆపాదించటం సరికాదు



నేడు భారతదేశంతో సహా ప్రపంచంలోని అనేక దేశాలను కలవరపరుస్తున్న సమస్యలలో ఉగ్రవాదం ఒకటి. ప్రపంచ దేశాల స్వాతంత్ర్యం సార్వభౌమత్వాలకు, అంతర్జాతీయ శాంతి భద్రతలకు ఉగ్రవాదం పెనుసవాలుగా పరిణమించింది. ఆయా దేశాల వనరులు శక్తి యుక్తులను నిర్వీర్యం చేయడానికి ఉగ్రవాదం ఒక సాధనమైంది. ఉగ్రవాదం అనేక రూపాలలో ప్రదర్శితమవుతుంది. అంతర్ సరిహద్దుల ఉగ్రవాదం, మతపరమైన ఉగ్రవాదం, తెగల పరమైన ఉగ్రవాదం వంటివి వాటిలో ఉన్నాయి. అవన్నీ అంతర్జాతీయ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నాయి. మతతత్వ వాదులు, తీవ్రవాదులు, హింస వాదుల చేతుల్లో ఉగ్రవాదం ప్రామాణిక ఆయుధంగా రూపొందింది. ఉగ్రవాదం ముసుగులో హత్యలు, కిడ్నాపులు, హైజాకింగ్, నరమేధాలు కొనసాగుతున్నాయి. రాజ్యాధికారాన్ని వినియోగించి శక్తులు రాజకీయపరమైన లేదా ఇతర తిరుగుబాటులను అణచడానికి ఉగ్రవాద భావనను వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఉగ్రవాదులు అనుసరిస్తున్న పద్ధతులనే ప్రభుత్వాలు అనుసరిస్తూ తమ చర్యలను సమర్థించుకోవడం గమనార్హం. ప్రపంచంలోని వివిధ దేశాలలో పలు ఉగ్రవాద శక్తులు తమ ఆశయాల సాధన కోసం అనేక సంస్థలను స్థాపించి నిర్వహించడం సర్వసాధారణమైంది. అంతర్జాతీయ ఉగ్రవాదం అనేది 1950 దశకం నుంచి ఆరంభమైంది. పాలస్తీనా విభజన తర్వాత ఇజ్రాయిల్ రాజ్యం ఏర్పాటు అనే అంశం అంతర్జాతీయ ఉగ్రవాదానికి నాందిగా కొందరు భావించారు. ఇజ్రాయిల్ ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి పాలస్తీనా భూభాగంలో కొన్ని సంస్థలు అంతర్జాతీయ ఉగ్రవాదానికి ఊతమిచ్చాయి. స్వతంత్ర్య పాలస్తీనా ఏర్పాటే ఆ సంస్థలు ప్రధాన ఆశయంగా ప్రకటించుకున్నాయి. అప్పటి నుంచి అంతర్జాతీయ ఉగ్రవాదం అనే భావన అధిక ప్రాధాన్యతను పొందుతూ వచ్చింది. 1960, 1970 దశకంలో అగ్రరాజ్యాల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం అలముకున్న సమయంలో అనేక ఉగ్రవాద సంస్థలు తమ కార్యకలాపాలను ఉధృతం చేస్తూవచ్చాయి. అగ్రరాజ్యాలైన సోవియట్ యూనియన్, అమెరికాలు ఒక దానికొకటి ప్రచ్ఛన్నయుద్ధంలో ఆరితేరాయి. దాంతో ఆ రెండు రాజ్యాలు స్వీయ అధిక్యతను పొందడానికి లేదా కాపాడుకోవడానికి అనేక సాయుధ ఉగ్రవాద సంస్థలకు అన్ని రకాలుగా చేయూతనిచ్చాయి. 1980 దశకం చివరి నాటికి ఉగ్రవాదం అనేది సంఘటితమై అంతర్జాతీయ సంబంధాలలో విషాదకర సంఘటనగా పరిణమించింది. 1990 దశకంలో కజిగిస్తాన్, రష్యా, చైనా, ఇండియా, పాకిస్తాన్, సౌదీ అరేబియావంటి దేశాల్లోనూ ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లోనూ ఉగ్రవాదం పడగవిప్పింది. మతం ముసుగులో అనేక ఉగ్రవాద సంస్థలు ఏర్పడి సంఘటిత హింసాత్మక ఘటనలకు పాల్పడ్డాయి. అయితే ఇక్కడ ఒక విషయం గమనించాలి. ఉగ్రవాదం అంటే ఒక మతానికి సంబంధించి మాత్రమే కాదు. ఉగ్రవాదం అనేది వివిధ రూపాల్లో వివిధ రకాలుగా వివిధ కోణాల్లో ఉంటుంది. ఉదాహరణకు పౌర ఉగ్రవాదం, రాజకీయ ఉగ్రవాదం, పాక్షిక ఉగ్రవాదం, పరిమిత రాజకీయ ఉగ్రవాదం, అధీకృత లేదా రాజ్య ఉగ్రవాదం, సీమాంతర ఉగ్రవాదం, మతపరమైన ఉగ్రవాదం. ఈ ఉగ్రవాద సంస్థలు కొన్ని సిద్ధాంతాలను ఆశయాలుగా చేసుకొని విముక్తి దళాలుగా, విప్లవాత్మక సంఘాలుగా, సైనికశక్తులుగా, గెరిల్లాలు, తిరుగుబాటుదారులు, స్వాతంత్ర్య యోధులుగా, పారామిలిటరి దళాలుగా అనేక పేర్లతో చలామణి అవుతున్నాయి. భారత్ లాంటి దేశాల్లో అనేక ఉగ్రవాద దాడులు జరిగాయి. ఎంతో మంది అమాయకులు ఈ దాడులకు బలైపోయారు. కానీ నేడు భారత్‌లో కొంతమంది ఉగ్రవాదం అంటే ఒక మతానికి చెందినదని, వారే ఈ హింసాత్మక కార్యాకలాపాలకు పాల్పడుతున్నారు అని రాజకీయ లబ్ధి కొరకు ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారు. అలాగైతే భారత ప్రధాని ఇందిరాగాంధీని తన అంగరక్షకులే హతమార్చారు. ఆమె పుత్రుడు రాజీవ్ గాంధీ సైతం టైగర్ ఈలం చేతుల్లో బలైపోయాడు. నేడు దేశంలో జరుగుతున్న అనేక దాడులు సైతం ఒకరకంగా ఉగ్రవాద చర్యలు కిందికి వస్తాయి. కానీ ప్రజలను మభ్యపెట్టడానికి ఉగ్రవాదం అంటే ఒక మతానికి చెందిన సభ్యులకి సంబంధించింది, వేరే మతానికి సభ్యులకు వర్తించదు అనే విధంగా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇక్కడ ప్రజలు గమనించాల్సింది ఉగ్రవాదం అంటే ఒక మతానికి ఒక వర్గానికి చెందినది కాదు. కొన్ని ఉగ్రవాద సంస్థలు తమ ప్రభావాన్ని తమ ఉనికిని చాటుకోవడానికి హింసకు పాల్పడుతూ ఉంటాయి.



వారికి మన, గణ, జన అనే భేదం ఉండదు.

నేడు ప్రపంచంలో ఉగ్రదాడులు జరుగుతున్న దేశాలను పరిశీలించినట్లయితే ఆవి ముస్లింలు అధికంగా నివసించే దేశాల్లోనే ఎక్కువ జరుగుతున్నాయి. ఆ దాడుల్లో చనిపోయే వారి సంఖ్యకూడా యుస్లిం తెగకు చెందిన వారే ఎక్కువగా ఉంటున్నారు. మనదేశంలో సంవత్సరానికి ఐదో పదో ఉగ్రవాద దాడులు జరుగుతే అదే ముస్లిం దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ లాంటి దేశాల్లో నెలకు నాలుగైదు ఉగ్రవాద దాడులు జరుగుతున్నాయి. వందల సంఖ్యలో జనాభా చనిపోతున్నారు అంటే వాళ్ళు ముస్లింలు కాదా..? ఈ దేశం ఒక వర్గానికే చెందినదైతే భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన ముస్లింలు ఎంతమంది లేరు..? పోరాడిన నాయకులు ఎంతమంది లేరు..? అంతెందుకు మొన్న పహల్గంలో జరిగిన ఉగ్రవాద దాడిలో ఉగ్రవాదులతో పోరాడుతూ చనిపోయిన వారిలో ముస్లిం యువకుడు లేడంటారా.? అలాగే దాడిలో గాయపడిన మన పర్యాటకులకు బాసటగా నిలిచిన వారు ముస్లింలు కదా..? నేడు ఇండియా పాకిస్థాన్ కి మధ్య యుద్ధం జరుగుతుంటే ఉగ్రవాద శిబిరాలపై విరుచుకుపడుతున్న భారత ఆర్మీకి ఆధిపత్యం వహిస్తున్న కల్నల్ సోఫీ యా ఖురేషి ఎవ్వరు.? పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలను ఫాక్ట్ చెక్ ద్వారా ఇండియా తరుపున దీటుగా బదులు చెప్తున్న వింగ్ కీ కమాండర్ జుబేర్ ఎవ్వరు.? అలాగే నేడు వాయు సేనలో రఫేల్ యుద్ధ విమానంతో శత్రువులపై విరుచుకు పడుతున్న మార్షల్ హిలాల్ అహ్మద్ ఎవ్వరు..? ముస్లిం కదా..? ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో విషయా లు ఉన్నాయి. ఈ దేశానికి ఏదైనా ఆపద వస్తే ముందు వ రుసలో నిల్చునే వారిలో కచ్చితంగా ముస్లింలు ఉన్నారు, ఉంటారు కూడా. ఈ దేశ ప్రతి ముస్లింకి ముందు దేశం, తర్వాతే మతం. అలాగే ముస్లిం వర్గానికి చెందిన వ్యక్తులు ఒక మన దాయది దేశం అయిన పాకిస్తాన్ లోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని దేశాల్లో ఉన్నారు. మొత్తం ప్రపంచ జనాభాలో 30% నికి పైగా నివసిస్తున్నారు. వీరంతా ఉగ్రవాదులే అంటామా.? ఉగ్రవాదం అనేది కొంతమంది వ్యక్తులు వారి స్వలాభం కోసం. తమ ఉనికిని ప్రదర్శించడానికి సంఘవిద్రోహ కార్యక్రమాలు చేస్తే వారినే అనాలి కానీ, మొత్తం ఆ జాతినే అవమానించడం సబబు కాదు. భారతదేశం లౌకిక దేశం. అలాగే భిన్నత్వంలో ఏకత్వ దేశం. ఇక్కడ చట్టం ముందు అందరూ సమానులే అంటారు. కానీ ఇప్పుడున్న ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న ధోరణులులను గమనిస్తే అది అవాస్తవం అనిపించేలా ఉందనే అనుమానాలు రేగుతున్నాయి. ఎందుకంటే ఈ దేశంలో ప్రతి ముస్లిం ప్రతి క్షణం తన దేశభక్తిని నిరూపించుకోవాల్సి వస్తుంది. లేదంటే ఎన్నో అనుమానాలు అవమానాలు ఛీత్కారాలు ఎదుర్కోక తప్పడం లేదు. ఉగ్రవాదం అంటే కొంతమంది వ్యక్తులకు సంబంధించింది. దానిని ఒక మతానికి అంటగట్టి మొత్తం ఆ వర్గాన్నే దూషించడం ఎంతవరకు సమంజసం.? ప్రపంచంలోనే గొప్ప ప్రజాస్వామ్యంగా చెప్పుకునే మన దేశంలో ఇలాంటి వివక్షతతో కూడిన ధోరణి ఎంతవరకు ఆమోదయోగ్యం? కాబట్టి మన ప్రభుత్వాలు రాజ్యాంగం ప్రజలకు అందించాలనుకున్న స్ఫూర్తిని అందించడానికి కృషి చేయాలని కోరుకుందాం....!

– అమ్‌జద్ మియా
9000517186

# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## భారత్ దాడుల్లో 11 మంది సైనికులు మృతి: పాకిస్థాన్

**ఇస్లామాబాద్ :** పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్‌ల మధ్య వరుసగా నాలుగు రోజుల పాటు దాడులు జరిగాయి. ఈ దాడుల్లో 11 మంది సైనికులు మరణించారని పాకిస్థాన్ సైన్యం వెల్లడించింది. మరో 78 మంది తీవ్రంగా గాయపడ్డారని తెలిపింది. వీరిలో సైనికులతో పాటు ఎయిర్ ఫోర్స్ సిబ్బంది సైతం ఉన్నారని పాకిస్థాన్ ఆర్మీ వివరించింది. గాయపడిన వారు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెప్పింది. ఈ మేరకు పాకిస్థాన్ ఆర్మీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా సైనిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో దాదపు 100 మందికిపైగా ఉగ్రవాదులు హతమయ్యారు. అలాగే ఆ ప్రాంతంలో ఉగ్రవాదులకు సంబంధించిన మౌలిక సదుపాయాలను సైతం ధ్వంసం చేసింది. ఈ నేపథ్యంలో భారత్‌లోని పాకిస్థాన్ సరిహద్దునున్న రాష్ట్రాలకు చెందిన జిల్లాలపై పాకిస్థాన్ డ్రోనులు, క్షిపణులతో దాడులకు దిగింది. ఈ దాడులను భారత్ తిప్పికొట్టింది.

# కల్తీ మద్యం సేవించి... 21 మంది మృత్యువాత

### మరో పది మంది ఆసుపత్రి పాలు

### పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో విషాదం

**చండీగఢ్/అమృత్‌సర్ :** పంజాబ్‌లో ఘోరం జరిగింది. అమృత్‌సర్ జిల్లాలో కల్తీ మద్యం సేవించి 21 మంది మృత్యువాతపడ్డారు. మరో పదిమంది కల్తీ మద్యం కారణంగా ఏర్పడిన సమస్యలతో ఆసుపత్రి పాలయ్యారని పోలీసులు తెలిపారు. భాంగలి, పాతల్‌పురి, మరారి కలాన్, థెరెవాల్ గ్రామాల్లో సోమవారం రాత్రి ఈ మరణాలు సంభవించాయని అధికారులు తెలిపారు. కల్తీ మద్యం తయారు చేయడానికి ఆన్‌లైన్‌లో మిథనాల్‌ను పెద్దమొత్తంలో సేకరించినట్లు పోలీసు దర్యాప్తులో వెల్లడైంది. మజితలోని గ్రామాల్లో అమాయక ప్రజల మరణాలకు కారణమైన వారిని వదిలిపెట్టబోమని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ అన్నారు. 'ఇవి మరణాలు కావు, ఇవి హత్యలు' అని ఆయన ఎక్స్ పోస్ట్ చేశారు. పంజాబ్‌లోని ప్రతిపక్ష పార్టీలు ఆప్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించాయి. మద్యం మాఫియాను నియంత్రించడంలో మాన్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించాయి. సిఎం మాన్, ఎక్సైజ్‌శాఖ మంత్రి హర్పాల్ సింగ్ చీమా రాజీనామా రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. కాగా, బాధిత గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కల్తీ మద్యం సేవించి ఉండవచ్చని భావించే వ్యక్తులను తనిఖీ చేయడానికి వైద్య బృందాలను అమృత్‌సర్ జిల్లా యంత్రాంగం నియమించింది. మద్యం సేవించి 17 మంది మరణించారని, బాధితుల్లో ఎక్కువ మంది రోజువారీ





కూలీలేనని అమృత్‌సర్ డిప్యూటీ కమిషనర్ సాక్షి సాహ్ని వెల్లడించారు. రాష్ట్రంలో కేవలం ఒక సంవత్సర కాలంలోనే కల్తీ మద్యం సేవించి భారీ ఎత్తున ప్రాణాలు కోల్పోయిన ఘటనలు జరగడం ఇది రెండవసారి. మార్చి 2024లో, సంగ్రూర్ జిల్లాలో కల్తీ మద్యం సేవించి 20 మంది ప్రాణాలు కోల్పోయారు. 2020లో, తర్న్ తరణ్, అమృత్‌సర్, బటాలాలో కల్తీ మద్యం కారణంగా మొత్తం 120 మంది మరణించారు. నిర్లక్ష్యంగా ఉన్నందున మజితలోని డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డిఎస్‌పి), స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)ను సస్పెంట్ చేసినట్లు డిజిపి గౌరవ్ యాదవ్ తెలిపారు. మజితలో కల్తీ మద్యం కారణంగా ప్రాణాలు కోల్పోయిన విషాదకరమైన ఘటన తర్వాత పంజాబ్ పోలీసులు వేగంగా చర్యలు తీసుకున్నారని, అక్రమ మద్యం వ్యాపారంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తితో సహా తొమ్మిది మంది స్థానిక పంపిణీదారులను అరెస్టు చేసినట్లు డిజిపి ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో సేకరించిన తర్వాత మిథనాల్‌ను కల్తీ మద్యం తయారీకి ఉపయోగించారని, మొత్తం విధానాన్ని వెలికితీసేందుకు, ఇందులో పాల్గొన్న వారందరినీ న్యాయం ముందు నిలబెట్టేందుకు దర్యాప్తు జరుగుతోందని యాదవ్ ఒక ఎక్స్ పోస్ట్‌లో తెలిపారు. భారతీయ న్యాయ సంహిత, ఎక్సైజ్ చట్టంలోని సంబంధిత విభాగాల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, నేరస్థులపై శాఖాపరమైన విచారణలు ప్రారంభమయ్యాయన్నారు. అరెస్టు అయిన వారిలో ప్రధాన నిందితుడు ప్రభ్జిత్ సింగ్, అలాగే కుల్బీర్ సింగ్, సాహిబ్ సింగ్, గుర్జంత్ సింగ్, నిందర్ కౌర్ ఉన్నారని పోలీసులు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ సాక్షి సాహ్ని, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (బోర్డర్ రేంజ్) సతీందర్ సింగ్, జలంధర్ రూరల్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్‌పి) మణీందర్ సింగ్‌లతో కలిసి బాధిత గ్రామాలను సందర్శించారు. బాధితుల కుటుంబాలను కలిసి వారిని ఓదార్చారు.

## జమ్ముకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

### ముగ్గురు ఉగ్రవాదులు హతం



**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్‌లో ఎదురుకాల్పులు జరిగాయి. షోపియన్ జిల్లాలో మంగళవారం భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హ హతమయ్యారు. మృతుల్లో లష్కరే తోయిబా (ఎల్ఇటి) టాప్ కమాండర్ షాహిద్ కుట్టాయ్ కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. దక్షి ణ కశ్మీర్ జిల్లాలోని షుక్రూ కెల్లర్ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారన్న నిర్దిష్ట సమాచారం ఆధారంగా, భద్రతా దళాలు అక్కడ కార్డన్, సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులు భద్రతా బలగాలపై కాల్పులు జరపగా బలగాలు తిరిగి కాల్పులు జరిపాయన్నారు. ఉగ్రవాదులు ఎల్ఇటికి చెందిన వారని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ముగ్గురిని మట్టుబెట్టగా, వారిని షాహిద్ కుట్టాయ్, అద్నాన్ షఫీ గుర్తించారు. మరొకరిని గుర్తించాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. షోపియన్‌లోని చోటిపోరా హీర్‌పోరా ప్రాంతంలో నివసించే కుట్టాయ్ మార్చి 2023లో ఉగ్రవాద సంస్థలో చేరాడు. 'ఎ' కేటగిరీ ఉగ్రవాది కాగా, ఉగ్రసంస్థకు టాప్ కమాండర్ వ్యవహరిస్తున్నాడని అధికారి తెలిపారు. అదే విధంగా కుట్టాయ్‌కి అనేక ఉగ్ర ఘటనలు, దేశ వ్యతిరేక కార్యకలాపాలతో సంబంధాలున్నాయని, వాటిలో మే 18, 2024న హీర్పోరాలో జరిగిన బిజెపి సర్పంచ్ హత్య కూడా ఉందని ఆయన అ న్నారు. పహల్గామ్ దాడి జరిగిన కొన్ని రోజుల తర్వాత, గత నెల ఏప్రిల్ 26న, అధికారులు కుట్టాయ్ నివాసిత ఇంటిని ధ్వంసం చేశారు. గత మూడు నుండి నాలుగు సంవత్సరాలుగా చురుకు గా ఉన్న కుట్టాయ్ అనేక దేశ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్నాడని అధికారులు తెలిపారు. షోపియన్ లోని వందునా మెల్హోరా ప్రాంతంలో నివసించే షఫీ, అక్టోబర్ 2024లో ఉగ్ర సంస్థలో చేరాడు. అతను 'సి' కేటగిరీ ఉగ్రవాది. అక్టోబర్ 18, 2024న షోపియన్‌లోని వాచి వద్ద స్థానికేతర కార్మికుడిని హత్యలో పాల్గొన్నాడని అధికారి తెలిపారు.

## కల్నల్ సోఫియాపై బిజెపి మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** కల్నల్ సోషియా ఖురేషి పేరు ఇటీవల బహుళ ప్రచారంలోకి వచ్చింది. ఇటీవల 'ఆపరేషన్ సిందూర్' వివరాలను ఎప్పటికప్పుడు మీడియాకు ముందు వచ్చి వివరించడంతో సోషిపా ఖురేషి అందరి దృష్టిలో పడ్డారు. 1999లో ఇండియన్ ఆర్మీ కారప్స్ ఆఫ్ సిగ్నల్‌లో చేరి క్రమంగా 2016లో మల్టీనేషనల్ మిలటరీ విన్యాసాలకు సారథ్యం వహించిన తొలి మహిళా అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా ఆమెపై మధ్యప్రదేశ్ మంత్రి, బిజెపి నేత విజయ్ షా చేసిన వ్యాఖ్యలు సంచలనమయ్యాయి. కల్నల్ ఖురేషిని 'టెర్రరిస్టుల సోదరి'గా పేర్కొంటూ ఆమెను కించపరచేలా విజయ్ షా మాట్లాడారంటూ కాంగ్రెస్ పార్టీ తప్పుపట్టింది. మహులోని (ఇండోర్ జిల్లా) రాయ్‌కుంద గ్రామంలో జరిగిన హల్మా ఈవెంట్‌లో విజయ్ షా చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో క్లిప్‌ను బీహార్ కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది. 'వాళ్లు (ఉగ్రవాదులు) మన సోదరీమణులు, ఆడకూతుళ్ల సిందూరం తుడిచేసి పారిపోయారు. వారి సొంత సోదరినే వాళ్లకు గట్టి సమాధానం చెప్పమని మనం పంపాం'' అని విజయ్ షా మాట్లాడినట్టు ఆ వీడియోలో ఉంది. దీనిపై కాంగ్రెస్ మండిపడింది. కల్నల్ సోఫియా ఖురేషిని టెర్రరిస్టుల సోదరిగా ఆయన సంబోధించడం ఏమిటని నిలదీసింది. సోఫియా ఖురేషిని చూసి ప్రతి భారతీయుడు గర్విస్తున్నాడని, అయినా కొందరు ఆమె గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని పేర్కొంది. ఇది మన వీరజవాన్లను అమానించడమేనని ఆక్షేపించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సన్నిహితుడుగా చెప్పుకునే విజయ్ షాను తక్షణం రాజీనామా చేయాల్సిందిగా బిజెపి కోరాలని డిమాండ్ చేసింది.

## నకిలీ ఓటర్ కార్డుల సమస్యను పరిష్కరించాం: ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ :** ఒకే నంబరు కలిగిన ఓటరు కార్డుల సమస్యను భారత ఎన్నికల సంఘం పరిష్కరించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇటువంటి కేసులు తక్కువేనని, అలాంటివి ఉన్నవారికి కొత్త నంబర్లుతో కొత్త కార్డులు జారీ చేసినట్లు మంగళవారం పేర్కొన్నాయి. వేర్వేరు రాష్ట్రాల్లో ఒకే నంబరు కలిగిన ఓటరు కార్డుల సంఖ్య చాలా తక్కువగా ఉందని ఎన్నికల సంఘం వర్గాలు చెప్పాయి. సగటున నాలుగు పోలింగ్ స్టేషన్‌ల్లో ఒకటి ఉన్నట్లు తెలిపాయి. ఒకేలాంటి నంబర్లు కలిగిన ఓటర్లు వేర్వేరు అసెంబ్లీ నియోజకవర్గాలు, పోలింగ్ కేంద్రాల్లో నమోదైనట్లు తేలిందని పేర్కొన్నాయి. ఇప్పుడు ఆ సమస్యను ఈసీ పరిష్కరించిందని, వారికి కొత్త నంబర్లతో ఓటర్లు కార్డులను జారీ చేసినట్లు ఎన్నికల సంఘం సీనియర్ అధికారి తెలిపారు. ఈ సమస్య 2000 ప్రారంభంలో ఓటర్లు కార్డుల నంబర్లను డిజిటలైజేషన్ చేస్తున్నప్పుడు ప్రారంభమైందని అన్నారు. మాన్యువల్ డేటా ఎంట్రీ, పరిమిత సాంకేతికత కారణంగా ముఖ్యంగా జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ సమస్య వచ్చినట్లు ఆ అధికారి తెలిపారు. దేశంలోని ప్రతిపక్ష పార్టీలు ఓటర్ల జాబితాను తప్పుదారి పట్టించారనే ఆరోపణల నేపథ్యంలో దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్యను పరిష్కరిస్తామని మార్చి నెలలోనే ఈసీ తెలిపింది. అది కూడా మూడు నెలలోనే చేస్తామని తెలిపింది. అందుకోసం దేశంలో మొత్తం 99కోట్లకు పైగా ఓటర్ల కార్డులను పరిశోధించినట్లు ఈసీ వర్గాలు తెలపాయి. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులు, 4,123 అసెంబ్లీ నియోజకవర్గాలు,10.5 లక్షల పోలింగ్ కేంద్రాల ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు ఓటర్ల జాబితాను వెరిఫై చేశారు. సగటున ప్రతి పోలింగ్ స్టేషన్‌కు దాదాపు 1000 మంది ఓటర్లు ఉంటారు. అయితే ఈ సమస్య ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేంత విస్తృతంగా లేదని ఇసి పునరుద్ఘాటించింది. కానీ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడానికి అన్ని సమస్యలను తొలగించాల్సిన అవసరాన్ని గుర్తించింది. అందుకే ప్రతి ఓటరకు ఒక ప్రత్యేకమైన ఓటర్ ఐడి నంబర్‌ను జారీ చేసేలా చర్యలు తీసుకుంది. ఇది భవిష్యత్‌లో ఇలాంటి సమస్య రాకుండా ఈ వ్యవస్థను తీసుకొచ్చినట్లు ఇసి తెలిపింది.

## సిబిఎస్ఇ ఫలితాలు విడుదల

### 12లో 88.39, 10లో 93.66 శాతం పాస్



**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్కంఠతో ఎదురు చూస్తున్న సిబిఎస్ఇ 10, 12 తరగతి ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. 12వ తరగతి ఫలితాలను ఉదయం సిబిఎస్ఇ బోర్డు విడుదల చేయగా, పదో తరగతి ఫలితాలను మధ్యాహ్నం వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది. 12వ తరగతిలో 88.39 శాతం, 10వ తరగతిలో 93 శాతం కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 12వ తరగతి బోర్డు పరీక్షల్లో బాలుర కంటే బాలికలు ఐదు శాతం పాయింట్లకు పైగా మెరుగ్గా రాణించగా, 90 శాతం కంటే ఎక్కువ స్కోర్ చేసిన విద్యార్థుల సంఖ్య గత సంవత్సరం కంటే స్వల్పంగా తగ్గిందని బోర్డు పరీక్షా కంట్రోలర్ సంయమ్ భరద్వాజ్ మంగళవారం తెలిపారు. ఈ సంవత్సరం 88.39 శాతం మంది అభ్యర్థులు పరీక్షలను ఉత్తీర్ణులయ్యారన్నారు. గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం 87.98 శాతంతో పోలిస్తే ఇది స్వల్ప పెరుగుదలని చెప్పారు. 91.64 శాతం మంది బాలికలు, 85.70 శాతం మంది బాలురు పాసయ్యారు. అయితే లింగమార్పిడి అభ్యర్థులు ఈసారి పరిపూర్ణ ఉత్తీర్ణత శాతం సాధించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఇది 50 శాతం రెట్టింపు. మొత్తం 1,11,544 మంది అభ్యర్థులు 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించగా, 24,867 మంది అభ్యర్థులు 95 శాతం కంటేపైగా మార్కులు సాధించారు. గత సంవత్సరం 12వ తరగతిలో 1.16 లక్షల మంది విద్యార్థులు 90 శాతం కంటే ఎక్కువ, 24,068 మంది 95 శాతం కంటే ఎక్కువ స్కోర్ చేశారు. 90 శాతం కంటే ఎక్కువ స్కోర్ చేసిన విద్యార్థులలో 290 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉన్నారు. వీరిలో 55 మంది విద్యార్థులు 95 శాతం కంటే ఎక్కువ స్కోర్ సాధించారు. ఈ సంవత్సరం పరీక్షకు హాజరైన 16,92,794 మంది అభ్యర్థులలో 1.29 లక్షలకు పైగా కంపార్ట్‌మెంటల్ పరీక్షకు ఎంపికయ్యారు. గత సంవత్సరం 1.22 లక్షల మంది అభ్యర్థులతో పోలిస్తే ఈ సంఖ్య స్వల్పంగా పెరిగింది. విజయవాడ రీజియన్ అత్యధికంగా 99.60 శాతం ఉత్తీర్ణత శాతం నమోదు చేయగా, త్రివేండ్రం 99.32 శాతంతో రెండవ స్థానంలో ఉంది. ప్రయాగ్‌రాజ్ రీజియన్ 79.53 శాతంతో అత్యల్ప ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేసింది. పాఠశాలల వారీగా చూస్తే జవహర్ నవోదయ విద్యాలయాలు అత్యధికంగా 99.9 శాతం ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేయగా, అత్యల్పంగా ప్రైవేట్ లేదా స్వతంత్ర పాఠశాలలు 87.94 శాతం ఉత్తీర్ణత సాధించాయి. విదేశీ పాఠశాలల్లో అభ్యర్థుల ఉత్తీర్ణత శాతం గత సంవత్సరం 95.84 శాతం నుండి ఈసారి 95.01 శాతానికి స్వల్పంగా తగ్గింది.

### పదో తరగతి ఫలితాలు

సిబిఎస్ఇ పదో తరగతి ఫలితాలను బోర్డు విడుదల చేసింది. ఫలితాల్లో 93.66 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, బాలికలదే పైచేయి సాధించారు. గతేడాదితో పోలిస్తే 0.06 శాతం అధిక ఉత్తీర్ణత పొందారని అధికారులు వెల్లడించారు. గత సంవత్సరం మొత్తం ఉత్తీర్ణత శాతం 93.60 శాతంతో పోలిస్తే ఈ సారి స్వల్పంగా పెరిగింది. 95 శాతం మంది బాలికలు పరీక్షలో ఉత్తీర్ణులు కాగా, బాలుర ఇది 92.63 శాతం మంది పాస్ అయ్యారు. ట్రాన్స్‌జెండర్ అభ్యర్థుల విషయంలో గత సంవత్సరం 91.30 శాతంతో పోలిస్తే ఈ సారి 95 శాతం ఉత్తీర్ణులయ్యారు. 1.99 లక్షల మంది అభ్యర్థులు 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించగా, 45,516 మంది అభ్యర్థులు 95 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారు. కంపార్ట్‌మెంట్ పరీక్షలకు 1.41 లక్షల మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. సిబిఎస్ఇ 10వ తరగతి బోర్డు పరీక్షలకు మొత్తం 23,71,939 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

## రిటైర్మెంట్ తర్వాత ఎలాంటి పదవులు తీసుకోను

### సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా



**న్యూఢిల్లీ :** సిజెఐగా పదవీ విరమణ అనంతరం ఎలాంటి అధికారిక పదవులను స్వీకరించబోనని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా వెల్లడించారు. కానీ, న్యాయ వృత్తిలో కొనసాగుతానని స్పష్టం చేశారు. మంగళవారం పదవీ విరమణ బెంచ్ కార్యక్రమాలు ముగిసిన అనంతరం కోర్టు ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. 2019 జనవరి 18న సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా నియమాకమైన ఆయన, 2024 నవంబర్ 11న చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. సుమారు ఆరు నెలల పాటు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించి మంగళవారం పదవీ విరమణ చేశారు. ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నగదు దొరికిన ఘటనపైనా జస్టిస్ ఖన్నా స్పందించారు. సరైన తీర్పు కోసం ప్రతీ కేసులోని ప్లస్, మైనస్ పాయింట్లతో పాటు అనేక కోణాల్లో హేతుబద్ధంగా పరిశీలిస్తామని తెలిపారు. యశ్వంత్ వర్మ వ్యవహారంలో సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పలు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రాథమిక దర్యాప్తుకు ఆదేశించడంతో పాటు ఢిల్లీ హైకోర్టు నుంచి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు. అంతర్గత దర్యాప్తు నివేదిక అనంతరం వర్మను రాజీనామా చేయాలంటూ ఆదేశించారు. అందుకు వర్మ అంగీకరించకపోవడంతో ఈ విషయంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు ఢిల్లీలోని ప్రముఖ కుటుంబానికి చెందిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, దివంగత మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నాకు సమీప బంధువు. 1960 మే 14న జన్మించిన సంజీవ్ ఖన్నా ఢిల్లీ విశ్వవిద్యాలయంలో న్యాయ విద్యను చదివారు. 2005లో ఢిల్లీ హైకోర్టు అదనపు జడ్జీగా నియమితులై, ఆ మరుసటి ఏడాది శాశ్వత న్యాయమూర్తిగా ఉన్నతి పొందారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి సాధించిన ఆయన, 2024 నవంబర్ 11న దేశ సర్వోన్నత న్యాయస్థానం 51వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. మరోవైపు తదుపరి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బిఆర్ గవాయ్ బాధ్యతలు చేపట్టనున్నారు. బుధవారం ఆయన 52వ సిజెఐగా ప్రమాణం చేయనున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల మీడియాతో మాట్లాడిన ఆయన, సీజేఐగా పదవీ విరమణ అనంతరం ఎలాంటి కొలువునూ చేపట్టబోనని చెప్పారు. తనకు ఎలాంటి రాజకీయ ఆకాంక్షలు లేవని స్పష్టం చేశారు.

### 17నుండి భారత్–అమెరికా

## ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు ప్రారంభం

**న్యూఢిల్లీ:** భారత్–అమెరికా మధ్య మే 17వ తేదీ నుండీ వాషింగ్టన్‌లో వాణిజ్య చర్చలు ప్రారంభం అవుతాయి. భారత వాణిజ్య,పరిశ్రమలమంత్రి పీయూశ్ గోయల్ నాయకత్వంలో ఒక బృందం ఈ చర్చల్లో పాల్గొంటుంది. ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ)పై ఈ చర్చలు జరుగుతాయని నాలుగు రోజులపాటు మే 20వ తేదీ వరకూ జరుగుతాయని అధికారి ఒకరు మంగళవారంనాడు ఢిల్లీలో చెప్పారు. అమెరికా వాణిజ్య ప్రతినిధి జమైసన్ గ్రీర్, అమెరికా వాణిజ్యమంత్రి హోవార్డ్ లుత్నిక్‌లతో ఈ ఒప్పందంపై పీయూశ్ గోయల్ చర్చలు జరుపుతారు. మే 19 నుండి 22 వరకూ ఇరు దేశాల ప్రధాన సంప్రదింపులకర్తలూ చర్చలు కొనసాగిస్తారు. మే 16 నాటికి గోయల్ వాషింగ్టన్‌కు చేరుకుంటారు. రెండు దేశాలమధ్యా సుంకాలను 90 రోజులపాటు వాయిదా వేయడంతో ఈ మధ్య ఉన్న విరామకాలాన్ని భారత దేశం సద్వినియోగం చేసుకుని ఈ ఒప్పంద చర్చలు జరుపుతోందని అధికారులు చెప్పారు.

## 9 మందికి జీవిత ఖైదు

### మహిళల వీడియోలు తీసి


### లైంగిక వేధింపుల కేసులో మహిళా కోర్టు తీర్పు

**కోయంబత్తూర్ :** తమిళనాడులో సంచలనం సృష్టి ంచిన 2019 నాటి పొల్లాచ్చి లైంగిక వేధింపుల కేసులో మహిళ కోర్టు కీలక తీ ర్పు వెలువరించిం ది. ఈ కేసులో నిందితులుగా ఉన్న 9 మందిని దో షులుగా తేలుస్తూ కోయబంత్తూర్‌లోని సెషన్స్ కో ర్టు జీవిత ఖైదును విధించింది. అంతేకాకుండా ఒక్కొక్కరికి రూ.1.5 లక్ష లు జరిమానాను విధించింది. ఈ కేసులో బాధితులకు రూ.85 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ఎ1 శబరిరాజన్, ఎ2 తిరునావుక్కరసు, ఎ3 సతీశ్, ఎ4 వసంతకుమార్, ఎ5 మణివన్నన్, ఎ6 బాబు, ఎ 7 హరనిమాస్పాల్ , ఎ8 అరులానందం, ఎ9 అ రుణ్‌కుమార్ నిందితులుగా ఉన్నారు. ఈ తొమ్మిది మంది 2019 నుంచి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నా రు. వారిని మంగళవారం కట్టుదిట్టమైన భద్రతతో సెషన్స్ కోర్టుకు తీసుకొచ్చారు. ఇప్పటికే వారిపై ఆగ్రహంతో ఉన్న ప్రజలు వారిపై దాడి చేస్తారనే భ యంతో కోర్టు దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. ఈ కేసు విచారణలో భాగంగా న్యాయస్థా నం వీరందరినీ దోషులుగా తేల్చుతూ మధ్యాహ్నం వీరికి జీవితఖైదు శిక్షను ఖరారు చేసింది. ఇక ఈ తీ ర్పుపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ స్పంది స్తూ నేరస్థుల దురాగతాలను న్యాయం జరిగిందని అన్నారు.

### ఇదీ కేసు?

2016–2018 మధ్య కాలంలో ఓ కళాశాల విద్యార్థిని సహా పలువురి మహిళలను దోషులు లైంగికంగా వేధించి, మొబైల్లో వీడియోలు చిత్రీకరించారు. ఆ వీడియోలను ఉపయోగించి డబ్బుల కోసం బాధితులను బ్లాక్‌మెయిల్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో తమిళనాడు వ్యాప్తంగా ఇది పెద్ద సంచలనం సృష్టించింది. రాజకీయంగానూ తీవ్ర దుమారం రేపింది. తొలుత ఈ కేసును దర్యాప్తు చేసిన పొల్లాచ్చి పోలీసులు 9 మందిని అరెస్ట్ చేశారు. ఆ తర్వాత ఈ కేసును తమిళనాడు సిబి సిఐడికి బదిలీ చేశారు. 2019లో ఈ కేసు విచారణను సిబిఐకి అప్పగించారు. కేసు దర్యాప్తు సమయంలో సిబిఐ, బాధితుల తరపున 200కు పైగా పత్రాలను, 400 ఎలక్ట్రానిక్ పరికరాలను ఆధారాలుగా చూపించింది. సుదీర్ఘ విచారణ తర్వాత మహిళ కోర్టు నిందితులకు జీవిత ఖైదు విధించింది.

## శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్‌లో విమానాలు సర్వీస్‌లు ప్రారంభం



**శ్రీనగర్ :** జమ్ము కశ్మీర్‌లోని శ్రీనగర్ ఎయిర్ పోర్ట్‌లో విమాన సర్వీసులు తిరిగి ప్రారంభమయ్యాయి. భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలతో ఉత్తర, వాయువ్య ప్రాంతాల్లో దాదాపు 32 విమానాశ్రయాలను అధికారులు మూసివేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో సోమవారం ఆయా విమానాశ్రయాలు తిరిగి తెరుచుకున్నాయి. శ్రీనగర్ ఎయిర్ పోర్ట్‌ను కూడా అధికారులు నిన్ననే తెరిచినప్పటికీ విమాన కార్యకలాపాలు మాత్రం మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. మంగళవారం తొలి విమానం ఎయిర్ ఇండియాకు చెందిన ఎఐ 827 విమానం ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. దాదాపు ఆరు రోజుల తర్వాత ఈ ఎయిర్‌పోర్ట్‌లో విమాన కార్యకలాపాలు మొదలు కావడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

**జమ్ముకశ్మీర్‌లో తెరుచుకున్న స్కూళ్లు**

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన సమరం దేశ ప్రజానీకం ఆశించినవేవీ సాధించకుండానే అర్థాంతరంగా ముగిసింది. ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందంతో వారం రోజులుగా ఉత్తర భారతదేశంలోని సరిహద్దు ప్రాంతాల్లో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులు సోమవారం చల్లబడ్డాయి. డ్రోన్లు, బాంబుల మోత లేకపోవడంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం సరిహద్దు రాష్ట్రాల్లో పరిస్థితి సాధారణ స్థితికి చేరింది. దీంతో జమ్ము కశ్మీర్‌లో స్కూళ్లు, కళాశాలలు, యూనివర్సిటీలు ఇవాళ తెరుచుకున్నాయి. సరిహద్దు ప్రాంతాలు మినహా జమ్ముకశ్మీర్ లోని ఇతర ప్రాంతాల్లోని పాఠశాలలు మంగళవారం తిరిగి తెరచుకున్నాయి.

### 32 ఎయిర్‌పోర్టులు రీఓపెన్

భారత్–పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలతో ఉత్తర, వాయువ్య ప్రాంతాలలో మూసివేసిన 32 ఎయిర్‌పోర్టులను తిరిగి తెరిచినట్టు భారత విమానయాన నియంత్రణ సంస్థ సోమవారం ప్రకటించింది. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ కుదరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. శ్రీనగర్, ఛండీగఢ్, అమృత్‌సర్‌లో విమానాల రాకపోకలు ప్రారంభమైనట్టు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఎఐ) స్పష్టం చేసింది. ప్రయాణికులు విమానాల స్టేటస్ కోసం ఆయా సంస్థల ఎయిర్‌లైన్స్‌లను నేరుగా లేదా వారి వెబ్‌సైట్‌ల ద్వారా వివరాలను తెలుసుకోవాలని ఏఏఐ సూచించింది.

### బాంబు బెదిరింపు కాల్..

## కోల్‌కతా ఎయిర్‌పోర్టులో హై అలర్ట్



**కోల్‌కతా :** విమానంలో బాంబు ఉందంటూ బెదిరింపు కాల్ రావడంతో కోల్‌కతాలోని నేతాజీ శుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో నేడు హైఅలర్ట్ ప్రకటించారు. ముంబైకి వెళ్లనున్న ఇండిగో విమానంలో బాంబు ఉన్నట్టు గుర్తు తెలియని వ్యక్తి కాల్ చేయడంతో భద్రతా దళాలు వెంటనే అప్రమత్తమయ్యాయి. ప్రయాణికులను విమానం నుంచి దింపేసి తనిఖీలు నిర్వహించాయి. ప్రయాణికులందరూ విమానంలో కూర్చున్న తరువాత ఈ కాల్ వచ్చిందని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు విమానం అవ్వాల్సి ఉందని వివరించారు. ఈలోపు బెదిరింపు కాల్ రావడంతో ఎమర్జెన్సీ ప్రొటోకాల్ ప్రకారం మొత్తం 195 మంది ప్రయాణికులను కిందకు దింపి విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించినట్టు వివరించారు. 'లగేజీలను కిందకు దించాము. బాంబ్ స్క్వాడ్ సిబ్బంది విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సిఐఎస్ఎఫ్ సిబ్బంది ఎయిర్‌పోర్టు అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు'' అని అధికారులు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ తరువాత ఎయిర్ పోర్టులకు ఇలాంటి బెదిరింపు కాల్ రావడం ఇది రెండోసారి. అంతకుమునుపు మే 6న ముంబై ఎయిర్‌పోర్టుకు కూడా ఇలాంటి బెదిరింపు కాల్ వచ్చింది. చండీగఢ్ నుంచి రానున్న ఇండిగో విమానంలో బాంబు ఉన్నట్టు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి చెప్పారు. ఆ తరువాత తనిఖీల సందర్భంగా అది నకిలీ కాల్ అని తేలింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## పాకిస్థాన్‌కు అసదుద్దీన్ మరోసారి చురకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ దాయాది పాకిస్థాన్‌పై విరుచుకుపడుతున్న విషయం తెలిసిందే. తాజాగా పాక్‌కు ఆయన మరోసారి చురకలంటించారు. ప్రధాని షెహబాజ్ షరీఫ్, సైనిక చీఫ్ హసిమ్ మునీర్లను ఉద్దేశించి 'ఎక్స్' వేదికగా ఒవైసీ చేసిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'చైనా నుంచి అద్దెకు తెచ్చుకున్న విమానాన్ని పాకిస్థాన్ ప్రధానమంత్రి షరీఫ్, ఆర్మీ చీఫ్ మునీర్ తమ రహీమ్ యార్ ఖాన్ వాయుస్థావరంలో ల్యాండ్ చేయగలరా?' అని ప్రశ్నించారు. ఎందుకంటే ఆ ఎయిర్‌బేస్ ఇటీవల భారత్ చేసిన దాడుల్లో తీవ్రంగా ధ్వంసమైంది. ఈ నేపథ్యంలోనే పాక్‌ను ఎద్దేవా చేస్తూ ఆయన ఈ ట్వీట్ చేశారు.

## ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్ కుమార్ సుల్తానియా

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు ఉత్తర్వులు జారీ



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** పరిపాలనాపరమైన వ్యవహారాలకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఎఎస్ అధికారి సందీప్ కుమార్ సుల్తానియా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. 1998 బ్యాచ్‌కు చెందిన సందీప్ కుమార్ సుల్తానియా బిహార్ రాష్ట్రానికి చెందిన వారు. చార్టర్డ్ అకౌంటెంట్‌గా అకౌంటెన్సీ విభాగంలో ఆయన పట్టభద్రులయ్యారు. తొలుత ఆయన తెలంగాణ ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలో ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేశారు. అనంతరం ముఖ్యమంత్రి కార్యదర్శిగా కూడా విధులు నిర్వర్తించారు. ఆర్థిక, రవాణా, సహకార సంస్థలు, పర్యాటక రంగాల్లో కీలక పదవుల్లో కొనసాగారు. గ్రామీణాభివృద్ధి, భూ రెవెన్యూ నిర్వహణ, పట్టణాభివృద్ధిలో ఆయనకు అపార అనుభవం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వ ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన తాజాగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమతులయ్యారు.

**డిప్యూటీ సిఎంను కలిసిన సందీప్ కుమార్ సుల్తానియా**

తెలంగాణ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమితులైన సందీప్ కుమార్ సుల్తానియా మంగళవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్ సుల్తానీయాకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు.

## గూడులేని చెంచులకు 10వేల ఇందిరమ్మ ఇళ్లు

గవర్నర్, సిఎం ఆలోచనలకు అనుగుణంగా నిర్ణయం

జిహెచ్ఎంసి పరిధిలో పేదలగుడిసె స్థానాల్లో మూడంతస్తుల భవనాలు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తరతరాలుగా సొంత ఇళ్లకు నోచుకోని ఆదిమ గిరిజన తెగలలోకి అతి బలహీన వర్గమైన చెంచుల సొంతింటి కలను ఇందిరమ్మ ప్రభుత్వం సాకారం చేయనుందని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్ట్రంలోని ఉట్నూరు, భద్రాచలం, మున్ననూర్, ఏటూరు నాగారం నాలుగు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ( ఐటిడిఎ)ల పరిధిలో సచ్యురేషన్ పద్ధతిలో దాదాపు 10 వేల చెంచు కుటుంబాలను గుర్తించడం జరిగిందని, వీరందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని వెల్లడించారు.

మంగళవారం సచివాలయంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో శాశ్వత గృహాలను నిర్మించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిల సూచనలు సలహాల మేరకు గిరిజన ప్రాంతాల్లో చెంచులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. అడవులను నమ్ముకొని జీవించే గిరిజనులలో చెంచులు ఒక జాతి అని. వీరు అడవుల్లో వేటాడటం, అటవీ ఫలసాయం సేకరించి అమ్ముకొని జీవనం సాగిస్తున్నారని, చిన్నచిన్న గుడిసెలు తప్ప వీరికి పక్కా ఇల్లు ఎలా ఉంటుందో ఊహకు అందని విషయమని, అలా అని ఆ అడవి ప్రాంతాల్ని వదలి వారు బతక లేరన్నారు.

అందుకే వీరు జీవించే ప్రదేశంలోనే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన కూడా చేయలేదని తెలిపారు. ఉట్నూరు ఐటిడిఎ పరిధిలో ఆసిఫాబాద్ 3551, బోథ్ 695, ఖానాపూర్ 1802, సిర్పూర్ 311, అదిలాబాద్ 1430, బెల్లంపల్లి 326, భద్రాచలం ఐటిడిఎ పరిధిలో అశ్వరావుపేట 105, మున్ననూర్ చెంచు స్పెషల్ ప్రాజెక్ట్‌లో అచ్చంపేట్ 518, మహబూబ్‌నగర్ 153, పరిగి 138, తాండూర్ 184 మొత్తం 9,395 ఇండ్లను మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. ఈ ఏడాది రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్ల చొప్పున మంజూరు చేయగా, ఐటిడిఎ పరిధిలోని గిరిజన నియోజక వర్గాలకు అదనంగా 500 నుంచి 700 ఇండ్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు.

**జిహెచ్ఎంసిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రత్యేక దృష్టి**

పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా జిహెచ్ఎంసి పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పట్టణంలోని ముఖ్య ప్రాంతాలలోని మురికి వాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడుతున్నారని,, హైదరాబాద్ కు దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. గత ప్రభుత్వం కొల్లూరులో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి హైదరాబాద్లో ఉన్నపేదలకు కేటాయిస్తే వాటిని తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టకొని పేదలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్న ప్రాంతంలోనే జీ ప్లస్ త్రీ పద్దతిలో అపార్ట్‌మెంట్లు నిర్మించాలని భావిస్తున్నట్లు తెలిపారు.

## రాష్ట్రంలో సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలి : మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** తెలంగాణా రాష్ట్రంలో సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని, దీని కోసం కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలు చొరవ తీసుకోవాలని రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. మంగళవారం క్రాంతి కీస్ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కల్సి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబులను కల్సారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం విద్యార్థులను అభినందించారు. పలు రాష్ట్రాల్లో సైనిక్ స్కూళ్లు ఉన్నప్పటికి తెలంగాణా రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటినా ఇక్కడ ఏర్పాటు చేయకపోవటం శోచనీయమన్నారు. తెలంగాణాకు ప్రత్యేకంగా సైనిక్ స్కూల్ లేకపోవటం వల్ల ఇక్కడి విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. నూతనంగా తెలంగాణాలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసే వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సైనిక్ స్కూల్‌లో ప్రవేశాలకు గాను తెలంగాణా విద్యార్థులకు స్థానిక హోదా కల్పించాలని పొన్నం డిమాండ్ చేసారు. ఈ విషయంలో రాష్ట్రం నుండి ప్రాధాన్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలు బాధ్యత తీసుకోవాలని తెలంగాణా రాష్ట్ర విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. క్రాంతి కీస్ ఫౌండేషన్ ప్రతినిధులు పి.ఎస్ఆర్ఎం. లావణ్య, కె.కళ్యాణి, మనోజ్, సంతోష్, జాకబ్ తదితరులు మంత్రులను కల్సిన వారిలో ఉన్నారు.

## అభ్యంతరాలు ఎఫ్‌టిఎల్ నోటిఫికేషన్ జారీకి అడ్డు కాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎవరైనా అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ ఏదైనా చెరువు, కుంటలు మొదలైన వాటి ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయవచ్చునని హైకోర్టు స్పష్టం చేసింది. ఇదే సమయంలో నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఎవరైనా భూయజమానులు లేదా బాధితులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తే వాటిని సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించి చట్ట ప్రకారం పరిష్కరించాలంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న వారికి అధికారులు నోటీసులు జారీ చేసి వాళ్ల అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించాలని కూడా ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం బాచుపల్లిలో అంబీర్ చెరువు ఎఫ్‌టిఎల్ నిర్ధారణకు వెలువరించే నోటిఫికేషన్ జారీకి అభ్యంతరాలు ఏవిధంగానూ అడ్డంకి కాబోదని వెల్లడించింది. అభ్యంతరాలు ఉన్నాయని చెప్పి అధికారులు నోటిఫికేషన్ జారీ చేయకుండా ఉండేందుకు వీల్లేదని, అభ్యంతరాలు నోటిఫికేషన్ జారీకి అడ్డంకి కాబోదని స్పష్టం చేసింది. శ్రీసాయి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సమర్పించిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని నీటిపారుదల శాఖకు ఆదేశాలిచ్చింది. ఒకవేళ పట్టా భూములు ముంపునకు గురైతే పరిహారం పొందవచ్చునని స్పష్టం చేసింది. అంబీర్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి నుంచి తమ భూమిని తొలగించాలని కోరుతూ ఈనెల ఏప్రిల్ 4న ఇచ్చిన వినతి పత్రాన్ని పరిశీలించేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ శ్రీసాయి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి ఇటీవల విచారణ పూర్తి చేసి పైవిధంగా ఉత్తర్వులు జారీ చేశారు.బాచుపల్లి సర్వే నెం.171లోని భూమి 2018నాటి సర్వే ప్రకారం ఇది ఎఫ్‌టీఎల్ పరిధిలోకి రాదని పిటిషనర్ వాదన. 1981లో ఏర్పాటైన సొసైటీ సభ్యుల ఇంటి స్థలాల కోసం భూమిని కొనుగోలు జరిగిందన్నారు. సొసైటీకి నోటీసు ఇవ్వకుండా ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు ప్రాథమిక నోటిఫికేషన్‌ను ఆఫీసర్లు ఇచ్చారని తప్పుపట్టారు. ఈ వాదనను ప్రభుత్వ న్యాయవాది తప్పపట్టారు ఎఫ్‌టీఎల్ ప్రాథమిక నోటిఫికేషన్ జారీకి ముందు సొసైటీ నుంచి ఏవిధమైన అభ్యంతరాలు వ్యక్తం కాలేదన్నారు. వాదనల తర్వాత న్యాయమూర్తి, చట్టంలోని సెక్షన్ 47 ప్రకారం చెరువులు, కుంటలు, బఫర్‌జోన్, శిఖం భూములకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చే అధికారం లేదని గుర్తు చేశారు. అలాంటి వాటిని క్రమబద్ధీకరించే అధికారం కూడా లేదని తెలిపారు. అయితే, ఎఫ్‌టీఎల్ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసేప్పుడు నోటీసులు జారీ చేయాలని, బాధితుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి చట్ట ప్రకారం పరిష్కరించాలని చెప్పారు. పిటిషన్‌పై విచారణ మూసేసినట్లు తెలిపారు.

## షరతులుంటేనే గిఫ్ట్ డీడ్ రద్దు : హైకోర్టు తీర్పు

**హైదరాబాద్ :** ప్రేమ, వాత్సల్యంతో ఏవిధమైన షరతులు లేకుండా పెద్దలు గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేస్తే దానిని సీనియర్ సిటిజన్స్ యాక్ట్ కింద రద్దు చేయడం చెల్లదని హైకోర్టు తీర్పు చెప్పింది. ఎలాంటి షరతులు లేకుండా మనుమళ్లకు ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌ను రద్దుకు వీలుండదని పేర్కొంది. సీనియర్ సిటిజన్స్ చట్టంలోని సెక్షన్ 23 (1) కింద ఒప్పందంలోని షరతులను ఉల్లంఘించినపుడే గిఫ్ట్ డీడ్ రద్దు చేసేందుకు వీలుంటుందని స్పష్టం చేసింది. గిఫ్ట్ డీడ్‌లో మౌలిక వసతులు, మందులు, నిత్యావసరాలు వంటివి అందజేయాలనే షరతు ఉన్నప్పుడు వాటిని గిఫ్ట్ పొందేవాళ్లు అమలు చేయనపుడు మాత్రమే సదరు గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసేందుకు సీనియర్ సిటిజన్స్ యాక్ట్ కింద తల్లిదండ్రులు, వృద్ధులకు హక్కు ఉంటుందని వివరించింది. సీనియర్ సిటిజన్స్ హక్కులను కాపాడే గొప్పచట్టమని, ఆ చట్ట నిబంధనలను తెలుసుకుని గిఫ్ట్ డీడ్ చేస్తే వృద్ధులు, తల్లిదండ్రులు నష్టపోకుండా ఉంటారని చెప్పింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లోని భవనంలోని 5, 6 అంతస్తులను 2019లో ఇచ్చిన గిఫ్ట్‌డీడ్‌ను అమ్మ, నాన్న, తాత ఫిర్యాదు ఆధారంగా ఆర్డీవో రద్దు చేశారు. ఈ నిర్ణయాన్ని అమెరికాలో ఉండే రోహిత్ శౌర్య హైకోర్టులో సవాల్ చేశారు. ఆ బిల్డింగ్‌లోని 3, 4 అంతస్తులను పిటిషనర్‌కు, 5, 6 అంతస్తులను పిటిషనర్ సోదరుడికి తాత సుబ్బారావు గిఫ్ట్ డీడ్ చేశారని అడ్వొకేట్ వాదించారు. తాత ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీనియర్ సిటిజన్స్ చట్టం కింద గిఫ్ట్‌డీడ్‌ను ఆర్డీవో రద్దు చేయడం చెల్లదన్నారు. అమెరికాలో ఉండే పిటిషర్‌కు నోటీసు కూడా ఇవ్వలేదన్నారు. దీనిపై సుబ్బారావు కొడుకు దాఖలు చేసిన కౌంటర్‌లో తన తండ్రి చనిపోయారని, తండ్రికి నలుగురు పిల్లలున్నారని, ఆస్తి నలుగురు పిల్లలకు చెందుతుందని చెప్పారు. తండ్రిని, ఆమె కుమార్తెను చూడలేదన్న కారణంగా తండ్రి గిఫ్ట్‌డీడ్‌ను రద్దు చేశారని చెప్పారు. ఇవన్నీ తెలిసి కూడా పిటిషనర్ కావాలని ఆస్తికి వారసులను ప్రతివాదులుగా చేయలేదన్నారు. వాదనల తర్వాత హైకోర్టు.. సీనియర్ సిటిజన్స్ చట్టంలోని సెక్షన్ 23(1) కింద గిఫ్ట్‌డీడ్‌ను రద్దు చేయాలనుకుంటే అందులో షరతులను ఉల్లంఘించి ఉండాలి. ప్రస్తుత కేసులో తాత కూతురు కొడుకులైన ఇద్దరు మనుమలకు ప్రేమ, వాత్సల్యంతో ఫ్లాట్‌లను గిఫ్ట్‌డీడ్ రిజిస్టర్ అయ్యింది.

వ్యక్తిగత అవసరాలను చూడాలని గిఫ్ట్ డీడ్‌లో ఏవిధమైన షరతులు ల్లేవు. అల్లుడితో విభేదాల కారణంగా సీనియర్ సిటిజన్స్ చట్టం కింద ఆర్డీవో వద్ద ఫిర్యాదు దాఖలు చేశారు. షరతుల్లేని గిఫ్ట్‌ను సీనియర్ సిటిజన్స్ చట్టం కింద రద్దు చేసే అధికారం ఆర్డీవోకు లేదు.ఆర్డీవో 2023 జనవరి 12న ఉత్తర్వులిచ్చారు. అదే ఏడాది అక్టోబర్ 20న గిఫ్ట్ ఇచ్చిన తాత (సుబ్బారావు) మరణించారు. కాబట్టి గిఫ్ట్‌డీడ్‌పై తండ్రి తరఫున వారసులైన కొడుకులు వివాదం కొనసాగించే హక్కు లేదు. తండ్రి ఇచ్చిన గిఫ్ట్‌డీడ్‌పై వారసులకు ఏవైనా వివాదాలుంటే వాటిని సివిల్ కోర్టులో తేల్చుకోవాలి. కుమార్తె పిల్లలకు తాత షరతుల్లేకుండా చేసి ఇచ్చిన షరతుల్లేని గిఫ్ట్‌డీడ్‌ను రద్దు చేసే అధికారం ఆర్డీవోకు లేదు.. అని తీర్పు చెప్పింది.

రోడ్డు ప్రమాద బాధితులకు 'నగదు రహిత చికిత్స పథకాన్ని'

## చిత్తశుద్ధితో అమలు చేయండి

కేంద్రానికి 'సుప్రీం' ఆదేశం

**న్యూఢిల్లీ :** రూ.1.5 లక్షల గరిష్ట మొత్తాన్ని పొందేందుకు అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులు ఎవరైతే ఉన్నారో వారికి 'నిజమైన చిత్తశుద్ధితో' నగదు రహిత చికిత్స పథకాన్ని అమలుచేయాలని మంగళవారం సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం 2025 ఆగస్టు చివరినాటికి ఈ పథకం కింద లబ్ధిదారులు ఎంతమంది నగదురహిత చికిత్స తీసుకున్నారో దానికి సంబంధించిన లబ్ధిదారుల సంఖ్య సహా ఈ పథకం అమలుకు సంబంధించిన వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. స్పందించిన కేంద్రం రూపొందించిన ఈ నగదు రహిత పథకం మే 5 నుంచి అమలులోకి వచ్చిందని అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేసింది. రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ జారీ చేసిన గెజిటెడ్ నోటిఫికేషన్ ప్రకారం..'ఏదైనా రహదారిపై మోటారు వాహనం ఉపయోగించడం వల్ల సంభవించే రోడ్డు ప్రమాదానికి గురైన ఏ వ్యక్తి అయినా ఈ పథకంలోని నిబంధనలకు అనుగుణంగా నగదు రహిత చికిత్స పొందేందుకు అర్హులు' అని తెలిపింది. మోటారు ప్రమాద బాధితుల చికిత్సకు నగదు రహిత పథకాన్ని రూపొందించడంపై సుప్రీం కోర్టు ఏప్రిల్ 28న కేంద్రాన్ని తప్పుపట్టింది.జనవరి 8న ఉత్తర్వులు ఉన్నప్పటికీ కేంద్రం కేంద్రం దీనికి తగిన ఆదేశాలు జారీచేయలేదు. గడువు పొడిగించాలని కూడా కోరలేదు. సుప్రీంకోర్టు ద్విసభ్యధర్మాసనందీనిపై స్పందిస్తూ 202, ఏప్రిల్ 1న మోటార్ వాహనాల చట్టం సెక్షన్ 164A అమలులోకి వచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల కాలంలో కూడా పథకాన్ని రూపొందించి అమలుచేయకపోవడాన్ని తప్పుపట్టింది. మీరు కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారు. సమయాన్ని పొడిగించాలని కోరే విషయంలో మీకు ఏమాత్రం పట్టింపే లేదు? మీరు పథకాన్ని ఎప్పుడు రూపొందించదలచుకున్నారో మాకైనా చెబుతారా? మీరు మీ సొంత చట్టాలను ఏ మాత్రం పట్టించుకోరు ఎందుకు? ఇది సంక్షేమపథకాలలో ఒకటి. ఈ నిబంధన మూడు సంవత్సరాలుగా ఉంటున్నది. మీరు నిజంగా సామాన్యమానవుడి సంక్షేమం కోసం పనిచేస్తున్నారా? అని ధర్మాసనం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.2024 జులై 31నుంచి హిట్అండ్‌రన్ నష్టపరిహారం పథకం కింద అత్యున్నత న్యాయస్థానం డాక్యుమెంట్ల కొరత కారణంగా 921క్లెయిమ్స్‌ను గుర్తించింది. క్లెమెంట్స్‌ను సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించాలని సుప్రీంకోర్టు జిఐసికి సూచించింది.

## అడవుల్లో అగ్నిప్రమాదాలపై దృష్టి సారించాలి

మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వేసవి కాలంలో అడవుల్లో అగ్ని ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. అటవీ శాఖకు సంబంధించిన వివిధ జోన్‌ల సిసిఎఫ్‌లు, అన్ని జిల్లాల డిఎఫ్ఒలతో మంత్రి కొండా సురేఖ మంగళవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అడవుల్లో అగ్ని ప్రమాదాలు, నివారణ, వన్యప్రాణి సంరక్షణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ఏం పరికరాలు వాడుతున్నారని అధికారులను నుంచి మంతి ఆరా తీశారు.ఒకేసారి పెద్ద అగ్ని ప్రమాదాలు జరిగితే వాటిని నివారించేందుకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయా అని తెలుసుకున్నారు. ఏ జిల్లాలో ఎక్కువ అగ్నిప్రమాదాలున్నాయి... వాటి వల్ల వన్యప్రాణులు ఇబ్బందులు పడకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారని అని అధికారులను అడిగి తెలుసుకునానరు. వేసవి దృష్ట్యా అడవుల్లో, జూ లలో వన్యప్రాణుల, ఇతర జంతవులకు తగిన తాగునీటి సదుపాయాల కల్పన ఉందా అడిగిన అధికారులను మంత్రి అడిగారు. అయితే, ఈ వేసవిలో జంతువుల కోసం 2,168 నీటి గుంతలు ఏర్పాటు చేసినట్టు మంత్రికి వైల్ లైఫ్ బోర్డు ఉన్నతాధికారులు వివరించారు.నీటి గుంతల్లోకి నీటిని ప్రతి రోజూ ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా ఎప్పటికప్పుడు తీసుకువస్తున్నట్టు వివరించారు.

నెహ్రూ జూ పార్కు, వరంగల్ జూ పార్కులలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వన్యప్రాణులకు నీటి విషయంలో, ఆహారం విషయంలో ఎటువంటి అశ్రద్ధ వహించద్దని అధికారులకు మంత్రి సురేఖ ఆదేశించారు. ప్రత్యేకంగా నీటి లభ్యత ఉన్న ఆహార పదార్థాలు, పండ్లను(దోసకాయ, పుచ్చకాయ వంటి) వాటికి ఆహారం అందజేయాలని సూచించారు., ఈ వీడియో కాన్ఫరెన్సు సమావేశంలో పిసిసిఎఫ్ (హెఒఎఫ్ఎఫ్) డాక్టర్.సువర్ణ, పిసిసిఎఫ్ (వైల్ లైఫ్) ఈలుసింగ్ మేరు, పిసిసిఎఫ్( స్కీమ్స్) జవహర్, వైల్ లైఫ్ ఒఎస్‌డి శంకరన్, నెహ్రూ జూ పార్క్ డైరెక్టర్ సునీల్ హీరామత్ తదితరులు పాల్గొన్నారు.



## శాతవాహన వర్శిటీలో 'లా కాలేజీ'కి బార్ కౌన్సిల్ ఆమోదం

ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు షురూ

ఫలించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని లా కాలేజీ (న్యాయ కళాశాల) మంజూరు కోసం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన కృషి ఫలించింది. లా కళాశాల అనుమతికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. ఈ విద్యాసంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. 120 మంది విధ్యార్థులతో (రెండు సెక్షన్లు) ఎల్ఎల్‌బి కోర్సు ప్రారంభం కానుంది. శాతవాహన వర్సిటీలో లా కళాశాల మంజూరు చేయాలని కోరుతూ వర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ గతంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజ్ కుమార్‌ను కోరారు. ఈ నేపధ్యంలో గత నెల మొదటి వారంలో ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్, మాజీ మేయర్ సునీల్‌రావును వెంటబెట్టుకుని బండి సంజయ్ న్యూఢిల్లీలోని కేంద్ర న్యాయశాఖ మంత్రిత్వ కార్యాలయానికి వెళ్లారు. సంబంధిత శాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్‌ను కలిసి లా కాలేజీని మంజూరు చేయడంతో పాటు ఈ ఏడాది నుంచే అడ్మిషన్లు ప్రారంభమయ్యేలా చూడాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. మొత్తం 120 మందితో రెండు సెక్షన్లతో కలిసి లా కాలేజీని నడిపేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈ విషయంపై వర్చువల్‌గా శాతవాహన వర్శిటీని వర్చువల్‌ఘా తనిఖీ చేయడంతో పాటు వివరణలతో కూడిన నివేదిక కోరిన విషయాన్ని ఈ సంధర్బంగా బండి సంజయ్ గుర్తు చేశారు. బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు వివరణాత్మక నివేదికను పంపినట్లు తెలిపారు. బండి సంజయ్ వినతికి సానుకూలంగా స్పందించిన అర్జున్ మేఘ్వాల్ అతి త్వరలోనే శాతవాహన వర్సిటీకి అనుబంధంగా తొందరలో లా కాలేజీకి అనుమతి ఇవ్వడంతో పాటు వచ్చే విద్యాసంవత్సరం (2005 06) హామీ ఇచ్చారు. న్యాయశాఖ మంత్రి ఇచ్చిన మాట ప్రకారం లా కాలేజీ అనుమతికి ఆమోదం తెలపడంతో పాటు వచ్చే విద్యాసంవత్సరం నుంచే ఎల్ఎల్‌బి కోర్సును ప్రారంభానికి అనుమతి ఇవ్వడం గమనార్హం. ఈ సంధర్బంగా కేంద్ర మంత్రి అర్జున్ మేఘ్వాల్‌తో పాటు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు కృతజ్ఞతలు తెలిపారు.

## పచ్చిరొట్ట సాగుతో భూసారం వృద్ధి

రైతు నేస్తంలో శాస్త్రవేతలు పలు సూచనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పొలాల్లో పచ్చిరొట్ట పంటలసాగు వల్ల అనేక లాభాలు ఉంటాయని పలువురు శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం కేంద్రంగా మంగళవారంజరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో వ్యవసాయ, అనుబంధ శాఖల కార్యకలాపాలపై పలువురు శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జనుము, జీలుగ, పిల్లి పెసర, జిల్లేడు, గ్లైరిసీడియా, పెసర మొదలగు పప్పు జాతి పంటలను పెంచుకొని, పూత దశలో భూమిలో కలియదున్నడం వలన మొక్కలకు కావలసిన అన్ని పోషకాలను అందించడమే కాకుండా, భూమిలో మేలు చేసే సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయని శాస్త్రవేతడాక్టర్ జె.ఎస్.సుధారాణి రైతులకు వివరించారు. తద్వారా భూమిలో సేంద్రియ పదార్థం అభివృద్ధి చెంది, నాణ్యమైన పంట వస్తుందని తెలిపారు. సీనియర్ శాస్త్రవేత డాక్టర్ సిహెచ్. రాజా గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిమ్మ , బత్తాయి పండించే రైతులు ఈ ఉష్ణోగ్రతలో తీసుకొనవలసిన జాగ్రత్తలు, సమగ్ర నీటి యాజమాన్యం ఎరువులు వాడే విధానాన్ని వివరించారు. అలాగే రైతులు రసాయన ఎరువులు కాకుండా సేంద్రియ ఎరువులు అయినటువంటి వర్మి కంపోస్ట్ లాభసాటిగా ఉంటుందని పివి నరసింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం శాస్త్రవేతడాక్టర్ జి శ్రీనివాస్, మాట్లాడుతూ కోళ్ల పరిశ్రమ వల్ల రైతులకు కలిగే లాభాలు అందులో ముఖ్యంగా రైతు సోదరులు ప్రతి ఇంట్లో కోళ్లను ఏ విధంగా పెంచాలి, వాటి వల్లే కలిగే లాభాలు, అలాగే కోడికి వచ్చిన వ్యాధి కంటే ముందుగానే నివారించుకోవడం చాలా మంచిదని సూచించారు.. వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వై. సుచరిత మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిగానే ఈ సంవత్సరం కూడా పచ్చి రొట్ట విత్తనాలు సబ్సిడీ రూపంలో రైతులకు ప్రతి జిల్లాలో మండలంలో అందుబాటులో ఉంటాయని రైతు సోదరులు వాటిని ఉపయోగించుకోవాలని వివరించారు ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని 566 రైతు వేదికల నుంచి జిల్లా వ్యవసాయ అధికారులతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం

43.10 లక్షల మెట్రిక్ టన్నులు (61.45 శాతం) ధాన్యం కొనుగోలు పూర్తి

6.58 లక్షల మంది రైతుల నుంచి రూ.10 వేల కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ప్రభుత్వం మరింత వేగవంతం చేసింది. యాసంగీ (రబీ)సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు 43.10 లక్షల మెట్రిక్ టన్నులు (61.45 శాతం) ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. 6.58లక్షల మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 27.75 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 15.35 లక్షల మెట్రిక్ టన్నులు సన్న రకం ఉన్నాయి. దాదాపు రూ.10 వేల కోట్ల (రూ.9999.36 కోట్ల) విలువైన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయగా, ఇప్పటి వరకు పౌరసరఫరాల శాఖ రైతుల ఖాతాల్లో రూ.6671 కోట్లను జమా చేసింది. సన్న రకం ధాన్యానికి సంబంధించి క్వింటాలుకు రూ.500 చొప్పున రూ.767 కోట్లను బోనస్‌ను సైతం రైతుల ఖాతాలో జమ చేయనున్నారు.

**కొనుగోలు కేంద్రాల్లో మరిన్ని ఏర్పాట్లు :** రాష్ట్ర వ్యాప్తంగా దాదాపుగా వరి కోతలు పూర్తి కావడంతో మార్కెట్ యార్డులకు ధాన్యం వెల్లువెత్తుతోంది. దీంతో వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేసేందుకు 8245 కేంద్రాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లను చేశారు. రైతులు వడ్లను ఆరబోసుకుకోవడం మొదలు ఖాటా వేసేంత వరకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించారు. తద్వారా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా నిబంధనల ప్రకారం తేమ శాతం ఉన్న ధాన్యాన్ని వెంట వెంటనే కాటా వేసి అక్కడి నుంచి రైస్ మిల్లులకు అధికారులు తరలిస్తున్నారు.

**రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి :** ఈ ఏడాది యాసంగిలో రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 60.14 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, మొత్తం1.29 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. దిగుబడి అంచన ప్రకారం 1.29 లక్షల మెట్రిక్ టన్నుల్లో దాదాపుగా 59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బహిరంగ మార్కెట్‌కు తరలి వెళ్లే అవకాశం ఉన్నట్లు అంచనా వేసి అధికారులు మిగిలిన 70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ ద్వారా సేకరించేందుకు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందులో భాగంగా ఇప్పటీ వరకు ఎప్పుడు లేని విధంగా కొనుగోలు ప్రారంభమైన 2 నెలల లోపే రాష్ట్రవ్యాప్తంగా 43.10 లక్షల మెట్రిక్ టన్నులు (61.45 శాతం) ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వంపూర్తి చేసింది. గత ఏడాది ఇదే సమయానికి 29.88 లక్షల టన్నుల ధాన్యంకొనుగోలు చేయగా, 2022–23లో 19.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు మాత్రమే జరిగాయి.

## రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు

**ప్రజాపక్షం/డిండి :** డిండి మండలంలోని కామేపల్లి, చెరుకుపల్లిలోని ధాన్యపు కొనుగోలు కేంద్రాలను మంగళవారం దేవరకొండ ఎంఎల్‌ఏ బాలునాయక్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ బాలునాయక్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిలు మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు పడకుండా మిల్లర్లు ప్రతి రోజు వారికి నిర్దేశించిన ప్రకారం ధాన్యాన్ని దించుకోవాలన్నారు. మిల్లర్లకు రెండు రోజుల సమయం ఇచ్చి వేచి చూస్తామని తెలిపారు. 15 రోజుల్లో దేవరకొండ ప్రాంతంలో మొత్తం ధాన్యం కొనుగోలును పూర్తి చేయాలని, ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరు సహకరించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ హరిష్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, తహాశీల్దార్ ఆంజనేయులు, డిటిసిఎస్ శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాజేష్‌రెడ్డి, గోవర్ధన్‌రావు, ఏవో రెహానా, సీఈవో బాల్‌రెడ్డి, అంతిరెడ్డి, ఏఈవోలు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల మున్సిపాలిటీ ఉద్యోగి బాల్ నగర్ చెన్నకేశవులు మరణించారు. మృతుని కుటుంబాన్ని పురపాలక చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి పరామర్శించి తమ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. మృతుని కుటుంబ సభ్యులకు మున్సిపాలిటీ తరపున 30,000/ రూపాయలు చైర్ పర్సన్ కోనేటి పుష్పలత అందజేశారు. కౌన్సిలర్ ఆలూరీ శశికిరణ్, నాయకులు కోనేటి నరసింహులు, శివ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ రోడ్డెక్కిన రైతన్నలు

### రాస్తారోకోలో చిక్కుకున్న తహసీల్దార్



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ఐకెపి సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, తూముకుంట సోసైటీ వారు కూడా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని వీపనగండ్ల రైతులు మంగళవారం రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోలో చిక్కుకున్న వీపనగండ్ల తహసీల్దార్ వరలక్ష్మీ తో రైతులు సమస్యలను మొర పెట్టుకున్నారు. ఆరుకాలం కష్టపడి పండించిన పంటను విక్రయించుడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుందని, కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని విక్రయించడానికి తరలించి రెండు నెలలు కావస్తున్న ఐకెపి సిబ్బంది నిర్లక్ష్యంతో ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని, ధాన్యాన్ని కొనుగోలు చేస్తారా లేదా చావమంటారా రైతులు వాపోయారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో తేమశాతం మరింత కోల్పోయి నష్టపోవాల్సి వస్తుందని రైతుల ఆవేదన చెందుతున్నారు. గతంలో 40 కేజీల సంచికి ఒక కేజీ వడ్లు తరుగు తీస్తుండగా ఈమారు అందుకు విరుద్ధంగా రైస్ మిల్లర్లు వడ్లలో తాలు ఎక్కువగా ఉందంటూ 40 కేజీల సంచికి మూడు నుంచి నాలుగు కేజీల వరకు తరుగు తీస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. పండించిన దానాన్ని విక్రయించటానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన కొనుగోలు చేయటం లేదని, కొందరి రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసిన లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లోనే నిలువ ఉంచుతున్నారని వాపోయారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లర్లకు, గోదాములకు తరలిస్తే రైతులకు కూడా ఇబ్బందులు తప్పుతాయని, రైతులు పండించిన ధాన్యంలో ఇప్పటి వరకు 20 శతాతం కూడా కొనుగోలు చేయలేదని రైతులు వాపోయారు. గతంలో ఐకెపి కొనుగోలు కేంద్రంతో పాటు తూముకుంట సోసైటీ వారు కూడా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా జరిగేదన్నారు. వర్షాలు కురుస్తుండటంతో ధాన్యాన్ని భద్రపర్చడానికి కావాల్సినన్ని టార్పాలిన్ కవర్ లేక పోవడంతో ధాన్యం తడిచిపోతుందని, తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

**తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన రైతులు...**

ఐకెపి కొనుగోలు కేంద్రంతో పాటు, తూముకుంట సోసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు వేగవంతం చేయాలని, తరుగు పేరుతో రైతులను ఇబ్బందుల పాలు చేయవద్దని, ధాన్యానికి సరిపడా గన్ని బ్యాగులో రైతులకు అందుబాటులో ఉంచాలంటూ తహసీల్దార్ వరలక్ష్మి కి రైతులు వినతి పత్రం అందజేశారు. తహసీల్దార్ వరలక్ష్మి మాట్లాడుతూ సమస్యను పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్లి రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ వరలక్ష్మి తెలిపారు.

**తాలు ఎక్కువగా లేకుండా శుభ్రం చేసి ఇయ్యాలి....**

రైతులు కొనుగోలు కేంద్రాలకు విక్రయిచడానికి తెచ్చిన ధాన్యంలో తాలు మట్టి లేకుండా చేయాలని, తాలు ఎక్కువగా ఉండటం వల్ల కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు దించుకోకుండా వెనుకకు పంపుతున్నారని మహిళా సమైక్య బుక్ కీపర్ రవి అన్నారు. విక్రయించడానికి ఇచ్చిన ధాన్యంలో తాలు లేకుండా చేసే బాధ్యత రైతుల దేనని అధికారులు కూడా రైతులకు తెలిపినట్లు తెలిపారు.

## బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** బహిరంగప్రదేశాల్లో చెత్త ఇతర మురుగువ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తప్పవని మండల ఇంచార్జీ పంచాయతీ కార్యదర్శి పాల్త్యావత్‌మహేష్ మంగళవారం అన్నారు. ఈసందర్భంగా మండలకేంద్రంలోని వివిధ దుకాణాలను, ఫుడ్‌స్టాళ్లను, హోటళ్లను, ఫాస్టుఫుడ్‌సెంటర్లను, రెస్టారెంట్లను గ్రామపంచాయతీ శానిటేషన్ అధికారులు తనిఖీలు చేశారు. తనిఖీల్లో భాగంగా టీగ్లాసులు, ప్లేట్లు, కూరగాయలు, కుళ్లిపోయినమాంసం వాటి వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో రోడ్డుపక్కన, కాల్వల్లో వేయకూడదని గ్రామపంచాయతీ చెత్తసేకరించే వాహనాలలో వేయాలని అవగాహన నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాల యజమానులపై పంచాయతీరాజ్‌చట్టం2018 చట్టరీత్యా తగుచర్యలు తీసుకోబడునని నోటీసులు జారీచేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ శానిటేషన్ అధికారులు శ్రీశైలం, జశ్వంత్, రవి పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో బోధించాలి



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికపరిజ్ఞానంతో పాటు విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తరగతిగదిలో బోధన సాగించేలా, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి రఘునాథ్‌శర్మ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఇంగ్లీష్ బోధన ఉపాధ్యాయులకు రెండు విడతలుగా, ఉర్దూమీడియం ఎస్‌జిటి ఉపాధ్యాయులకు వృత్యాంతర ఐదురోజుల శిక్షణ చేపట్టినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల నైపుణ్యాలను మెరుగుపర్చడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడుతుందన్నారు. మొదటి విడత శిక్షణ 13నుంచి 17వతేదీ వరకు వివిధ అంశాలపై శిక్షణ కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్, డిఆర్‌పిలు సురేందర్, రాములు, శ్రీను, నర్సింహ్మా, సిఆర్పిలు మల్లేష్, శేఖర్, సాంబశివుడు, మురళి, బాలయ్య, తిరుపతి పాల్గొన్నారు.

## వట్టెం నవోదయ విద్యార్థుల ప్రతిభ







**ప్రజాపక్షం/బిజినేపల్లి :** సెంట్రల్‌బోర్డుఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ మంగళవారం సాయంత్రం 10, 12తరగతిపరీక్ష ఫలితాలను విడుదల చేశారని ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్ తెలిపారు. విడుదల చేసిన 10, 12తరగతుల ఫలితాల్లో వట్టెం జవహర్ నవోదయ విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో తమ ప్రతిభను చాటారని తెలిపారు. 10, 12 తరగతులలో వందశాతం ఉత్తీర్ణతతోపాటు, 10వతరగతిలో 90శాతం విద్యార్థులు, 12వతరగతిలో 68 శాతం విద్యార్థులు డిస్టింక్షన్ సాధించారు. 12వతరగతిలో మొదటి ర్యాంకు సహస్ర 462/500, రెండో ర్యాంకు శ్రీకర్ 461/500 సాధించారు. పదోతరగతిలో మొదటిర్యాంకు మణిదీప్ 476/500, రెండో ర్యాంకు తనీష్, భాను ప్రకాష్, దీపక్‌లు 475/500 సాధించారు. పలువురు విద్యార్థులు వివిధ సబ్జెక్టులలో వందశాతం మార్కులు సాధించారు. నాణ్యమైన ఫలితాలను అందించేందుకు కృషి చేసిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, సిబ్బందిని ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ జానకిరాములు అభినందించారు.

## ఘనంగా రథోత్సవం



**ప్రజాపక్షం/వెల్దండ :** మండల పరిధిలోని బైరాపూర్ గ్రామంలో మంగళవారం ఉదయం స్వయంభూ శ్రీలక్ష్మి నర్సింహ్మాస్వామి రథోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులు, పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా రథోత్సవంపై శ్రీలక్ష్మి నర్సింహ్మాస్వాముల ఉత్సవ విగ్రహాలనుఉంచి దేవాలయం నుంచి పాఠశాలవరకు, ఉత్సాహభరితంగా రథోత్సవాన్ని లాగుతూ ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు రథోత్సవంతో పాటు శ్రీలక్ష్మి నర్సింహ్మాస్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో గట్టిబందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ శేఖర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, బాలస్వామి, నిర్వాహకులు జగన్‌మోహన్‌రెడ్డి, అయోధ్యరాంరెడ్డి, అరుణమ్మ, రమేష్‌గౌడ్, యాదయ్య, రవీందర్‌రెడ్డి, జగదీశ్వర్, రాజయాదవ్, నిరంజన్, వెంకటయ్యరావు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ వేగవంతం

### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ఇందిరమ్మ ఇండ్లు గ్రౌండింగ్ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరం నుండి ఇందిరమ్మ ఇండ్లు రాజీవ్ యువ వికాసం పథకంపై ఎంఎస్‌ఓలు ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లతో ఏర్పాటు చేసిన వెబెక్స్ సమావేశంలో మాట్లాడుతూ మొదటి విడత ఇందిరమ్మ ఇండ్లు శాంక్షన్ అయినవి ఎన్ని బేస్మెంట్ లెవెల్ నిర్మాణం పూర్తి చేశారు, ఎన్ని నిర్మాణంలో ఉన్నవి స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు ఎంపిడిఓలను అడిగి తెలుసుకున్నారు. అప్లికేషన్ లెవెల్‌లో ఉన్నవి క్షుణంగా పరిశీలించారు. రేషన్ కార్డులు లేనివి, ఒక కుటుంబానికి ఒకటికంటే ఎక్కువ శాంక్షన్ అయిన వాటిని పరిశీలించి తీసివేయాలని రెండవ విడత అప్లికేషన్లను జిల్లా ఇన్చార్జి మంత్రి అప్రూవ్ చేసిన వాటిని ప్రొసిడీంగ్స్ ఇచ్చి శాంక్షన్ చేస్తామని వర్షాకాలం రాకముందే ఇంటి నిర్మాణం చేపట్టేలా చూడాలని గ్రౌండింగ్ త్వరగా పూర్తిచే యాలని అన్నారు. శుక్రవారం వరకు రెడ్ ఫ్లాగ్ ఉన్న అప్లికేషన్లను శుక్రవారంలోపు మళ్ళీ పరిశీలించి అప్రూవల్ కోసం పంపించాలని ఇందిరమ్మ ఇల్లు కట్టుకొనుటకు డబ్బు సమస్యలు ఉంటే అలాంటి వారికి ఐకెపి లేదా శ్రీనిధి ద్వారా లోన్స్ వచ్చేలా చేయాలని. ఒకవేళ అర్హులైన వారు ఇల్లు కట్టుకునేందుకు నిరాకరిస్తే వారి నుండి లెటర్‌ను రాయించి తీసుకుని రద్దు చేయాలని మెటీరియల్ చార్జెస్ మేస్త్రికి ఇవ్వవలసిన డబ్బులను కూడా సంబంధిత తహసీల్దారులు సంప్రదించాలని జిల్లా కలెక్టర్ స్పెషల్ ఆఫీసర్లు మున్సిపల్ కమిషనర్లు ఎంపిడిఓలను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం కింద వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అసలైన లబ్ధిదారులు ఎవరనేది సెగ్రిగేట్ చేసి గుర్తించాలని, అప్లికేషన్ సరిగా ఉంటే సిబిల్ స్కోరు వివరాలను పరిశీలించేందుకు బ్యాంక్ మేనేజర్లకు ఎన్ని అప్లికేషన్లను పంపించారని అడిగి తెలుసుకున్నారు. సిబిల్ స్కోరు కోసం పంపించిన వాటిని బ్యాంకర్లతో ఎప్పటికప్పుడు వివరాలు అడిగి తెలుసుకోవాలని అసలైన లబ్ధిదారులు ఎంపిక చేసేందుకు ప్రజా ప్రతినిధులకు అప్లికేషన్ల వివరాలను వారితో కలిసి వారిపై చేయాలని, లబ్ధిదారులకు లోన్ శాంక్షన్ కొరకు నాన్ ఆపరేటివ్ బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయించాలని వచ్చాయని వాటిని పరిశీలించి, గ్రౌండింగ్ చేసి అప్రూవల్ కోసం పంపించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా పరిషత్ సీఈవో వెంకటరెడ్డి, డి ఆర్ డి ఓ నరసింహులు, హౌసింగ్ పిడి భాస్కర్, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి శంకరా చారి, జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీనివాస్, మండల స్పెషల్ అధికారులు మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓ లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పంటకు ప్రాణం జీవన ఎరువులు



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** రైతన్నలు సాగు చేసిన పంటలకు ఎక్కువగా జీవన ఎరువులు వాడి రసాయన ఎరువులను తగ్గించినప్పుడే నాణ్యమైన అధిక దిగుబడిని పొందవచ్చునని డాక్టర్ ఎస్.సుమలత అన్నారు. రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలెం బిఎస్సి కళాశాల శాస్త్రవేత్తలు తాడూరు మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయంలో రైతులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో సలహాలు సూచనలు తెలిపారు. దీనిలో భాగంగా ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులు వాడకుండా జీవన ఎరువులతో పాటు పచ్చరొట్ట ఎరువులైన జీలుగాపిల్లి పెసర జనుములాంటి వాటినిసాగు చేసి నీళ్లల్లో బాగా కలియ దున్నాలని, ప్రస్తుత వ్యవసాయరంగంలో వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పంట యాజమాన్య పద్ధతులు రైతన్నలుతూచతప్పకుండా పాటించాలని కోరారు. అనంతరం భూసారశాస్త్రవేత్త డాక్టర్ పరమేష్ మాట్లాడుతూ డీలర్‌దగ్గర విత్తనాలు కొన్నప్పుడు రశీదులను తప్పకుండా భద్రపర్చుకోవాలని రైతన్నలకు సూచించారు. కార్యక్రమంలో ఏవో సందీప్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు శోభారాణి, పవన్ కుమార్, పంచాయతీసెక్రటరీ వెంకటేష్, వ్యవసాయ మార్కెట్‌కమిటిడైరెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆదర్శరైతులు పాల్గొన్నారు.

# గిరిజన అభ్యున్నతికి నూతన అడుగు




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలంలోని మాచారం గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 18న ప్రారంభించనున్న ఇందిరా సౌరగిరి జలవికాసపథకంనకు సంబంధించిన పనులను జిల్లాఅటవీశాఖ అధికారి రోహిత్ గోపిడి, జిల్లా అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌లతో పాటు రాష్ట్రగిరిజన సంక్షేమశాఖ సెక్రటరీశరత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సంబంధిత శాఖ అధికారులతో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్ సమీక్ష నిర్వహిస్తూ ఉద్యానవన శాఖ అధికారులతో మాట్లాడుతూ నాణ్యమైన పండ్ల మొక్కలను రైతుల పొలాల్లో నాటాలని దానికి కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఆర్‌అండ్‌బి అధికారులు హెలీప్యాడ్, సభాస్థలిని , రహదారిని సిద్ధం చేయాలని, విద్యుత్ అధికారులు ఎలాంటి విద్యుత్ సౌకర్యం రాకుండా చూసుకోవాలని, రెడ్కో అధికారులు వెంటనే సౌరఫలకాలను ఏర్పాటు చేసి బోరుపంపులను ఏర్పాటు చేయాలని ఈనెల 15లోపు సంబంధితశాఖ పనులన్నింటిని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రప్రభుత్వం చెంచుల అభివృద్ధికై ఎన్నో కార్యక్రమాలను చేపడుతుందని అందులోభాగంగా ఇందిరాసౌరగిరి జలవికాసపథకం రూ.12,600కోట్ల రూపాయలతో ఆరు లక్షల ఎకరాలలో 2.10లక్షలమంది రైతులకు లబ్ధి చేకూర్చనున్నట్లు వివరించారు. ఇందిరాసౌర గిరిజలవికాస పథకం ప్రథమంగా మాచారం గ్రామంలో ప్రారంభించనున్నట్లు, గ్రామంలోని 50 ఎకరాలలో 27మంది చెంచు రైతులకు ప్రభుత్వమే బోరువేయించి, సౌరపంపుసెట్ ఏర్పాటు చేసి పండ్లమొక్కలను నాటి రైతులకు అప్పగించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా భూగర్భజలశాఖ అధికారులు సర్వే చేసి సూచించిన ప్రాంతాల్లో బోరుబావులు తవ్వించడం జరిగిందని, అన్నింట్లోను పుష్కలంగా నీరు లభించిందని అన్నారు. అంతకుముందు మాచారం గ్రామంలో చెంచురైతుల భూములలో కొనసాగుతున్న ఇందిరా సౌర గిరి జలవికాస పథకం ఏర్పాట్లను, బోరు బావులను, సభావేదిక, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఈసమీక్ష సమావేశంలో ఉద్యానవనశాఖ జెడిబాబు, డిడి వెంకటేశం, డిటిడిఓ అధికారి ఫిరంగి, డిఆర్‌డిఓపిడి చిన్నఓబులేసు, డిపిఓ రాంమోహన్‌రావు, భూగర్భజలశాఖ ఏడి దివ్యజ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిణి హేమలత, ఆర్‌అండ్‌బి అధికారులు జలంధర్, మిషన్ భగీరథ ఈఈ సుధాకర్, రెడ్కో, విద్యుత్, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి సన్మానం




**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ఎంసెట్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి మంచి ర్యాంకుతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినికి జర్నలిస్టులు ఉద్యోగులు నాయకులు ఘనంగా సన్మానం చేశారు. మండల పరిధిలోని బొల్లారం గ్రామానికి చెందిన బింగి పెద్ద స్వామి మాధవి కూతురైన బి.వనిత ఎంసెట్ ఫలితాలలో 7250 ర్యాంకు సాధించినందున శాలువా కప్పి ఘనంగా సన్మానం చేసి అభినందించారు. ఉన్నత చదువులు చదివి గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులతో పాటు సీనియర్ జర్నలిస్టు కొంత ప్రశాంత్, టీచర్ ముంతా నర్సింహ యాదవ్ , ఆర్టీసీ ఉద్యోగి కొమ్మ బాలేశ్వరయ్య యాదవ్, ఇటికాల పరశురాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ బిజెపి నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/కొత్తకోట :**కొత్తకోట మున్సిపాల్టీ భారతీయ జనతా పార్టీ నూతన పట్టణ కమిటీని కొత్తకోట పట్టణ అధ్యక్షుడు వనపర్తి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నియమించడం జరిగింది. పట్టణ ఉపాధ్యక్షులు, 8 మంది ప్రధాన కార్యదర్శులను ఎంపిక చేయడం జరిగింది. కొండ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా నిర్మించబడ్డ కమిటీ సభ్యులు అందరూ కార్యకర్తలతో కలిసి ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలి. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేని హామీలను అమలు చేయాలని ప్రజల తరపున నిరసన చేయాలని నాయకులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలన్నిటిపైన ప్రజలకు అవగాహన కల్పించాలి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా దేవరకద్ర నియోజకవర్గం బీజేపీ ఇంచార్జీ కొండ ప్రశాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజవర్ధన్ రెడ్డి, వనపర్తి జిల్లా అధ్యక్షుడు కొత్తకోట పట్టణ అధ్యక్షుడు , వనపర్తి శ్రీనివాస్ రెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ భరత్, భూషణ్, సీనియర్ నాయకులు దాబా శ్రీనివాస్ రెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, రాఘవేందర్ రెడ్డి, టీజీ మహేష్, వెంకటేష్, ఉదయ్ కుమార్ రెడ్డి, సిటికేబుల్ బాలు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రెస్ వితరణ



**ప్రజాపక్షం/మాగనూర్ :** మాగనూర్ మండల కేంద్రం జడ్పీ హై స్కూల్‌లో వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడల క్యాంప్ విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంగళవారం స్పోర్ట్స్ డ్రెస్ వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన దేశం తరపున క్రీడలు ఆడుతున్న క్రీడాకారులందరూ పల్లెటూర్ల నుండి వచ్చిన వారేనని అన్నారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులు కూడా దేశస్థాయిలో నైపుణ్యం చాటి మాగనూర్ మండలానికి గుర్తింపు తీసుకురావాలని కోరారు. డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ బాల్యం విద్యాభ్యాసం చేసిన తన పాఠశాలలోనే సొంత నిధులతో వేసవి క్రీడ శిబిరాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందన్నారు. క్రీడ దుస్తులు స్పాన్సర్ చేసిన వైష్ణవి జూనియర్, బాలికల కళాశాల యాజమాన్యానికి, క్రీడ శిబిరంలో సహకరిస్తున్న గ్రామ పెద్దలకు, యువతకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆనంద్ గౌడ్, శివరాం రెడ్డి, వెంకటేష్ గౌడ్, సంజీవ్ కుమార్, కమాండో అంబికాబాలు, పిటి రాకేష్ గ్రామ యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్‌లో ఆరేళ్ళ కనిష్ఠస్థాయికి చేరిన వినియోగ ధరల ద్రవ్యోల్బణం

**న్యూఢిల్లీ :** వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం (రిటైల్ ఇన్‌ఫ్లేషన్) ఆరు సంవత్సరాలక్రితంనాటి కనిష్ఠస్థాయికి చేరింది. ప్రధానంగా కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, ఇతర ప్రోటీన్ అత్యధికంగా ఉండే ఆహార వస్తువుల ధరలు తగ్గిపోవడం వల్ల వినియోగ ధరల సూచీ (సిపిఐ) గణనీయంగా తగ్గుముఖం పట్టింది. సిపిఐ ఏప్రిల్ నెలలో 3.16 శాతం నాటికి చేరిందని, అంతకుముందు 2024 మార్చినెలలో 3.34 శాతంగా, అదే ఏడాది ఏప్రిల్‌లో 4.83 శాతంగావినియోగ ధరల ద్రవ్యోల్బణం నమోదు కాగా, 2019 జులైలో 3.15 శాతంగా నమోదైంది. కాగా జాతీయ గణాంకాల కార్యాలయం సమాచారం ప్రకారం, 2025 మార్చి నెలతో పోల్చి చూస్తే, ఆహార ద్రవ్యోల్బణం అదే సంవత్సరం ఏప్రిల్ నెలలో 91 బేసిస్ పాయింట్లు మేరకు గణనీయంగా క్షీణించింది. 2021 అక్టోబరు నెల నుండీ గమనిస్తే ఇదే అత్యంత కనిష్ఠం. కాగా గతనెల అంటే ఏప్రిల్‌లో ఆహార ద్రవ్యోల్బణం 1.78 శాతంగా నమోదైంది. అంతకుమునుపు నెలలో ఇదే ద్రవ్యోల్బణం 2.69గా ఉండేది. కానీ ఏడాదిక్రితం ఏప్రిల్ నెలలో మాత్రం ఆహార ద్రవ్యోల్బం 8.7 శాతంగా నమోదైందని జాతీయ గణాంకాల కార్యాలయం వెల్లడించింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో వినియోగ ధరల సూచీని రిజర్వు బ్యాంకు మొదటి త్రైమాసికంలో 4 శాతంగా ఉంటుందని, రెండో త్రైమాసికంలో 3.9 శాతంగా ఉంటుందనీ, మూడో త్రైమాసికంలో 3.8 శాతంగా, నాలుగో త్రైమాసికంలో 4.4 శాతంగా ఉంటుందని అంచనా వేసింది.

## గత ఏడాది దేశంలో 50.40 లక్షల మంది నిరాశ్రయం

### ఐడిఎంసి నివేదిక

**న్యూఢిల్లీ :** గత ఏడాది దేశంలో ప్రకృతి వైపరీత్యాలవల్ల 50.40 లక్షలమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. గడచిన 12 సంవత్సరాలలో ఎన్నడూలేని విధంగా అత్యధికస్థాయిలో ఈ విధంగా ప్రజలు ప్రకృతి వైపరీత్యాలవల్ల నిరాశ్రయులైనట్లు జెనీవా కేంద్రంగా పనిచేసే ఐడిఎంసి (ఇంటర్నల్ డిస్‌ప్లేస్‌మెంట్ మోనిటరింగ్ సెంటర్) నివేదిక మంగళవారంనాడు వెల్లడించింది. మణిపూర్‌లో జాతిపరమైన హింస ప్రజ్వరిల్లడంతో 2023 కంటే తక్కువగా 2024లో ప్రజలు నిరాశ్రయులయ్యారు. 2023లో 1000, 2024లో 1700 స్థానభ్రంశాలు జరిగాయి. ప్రపంచవ్యాప్తంగా చూస్తే వరదలవల్ల మూడింట రెండు వంతుల మంది నిరాశ్రయులయ్యారు. అసోంలో 20.50 లక్షలమంది 2024 లో నిరాశ్రయులుకాగా, భారీ తుఫానులువల్ల 10.60 లక్షలమంది నిరాశ్రయులయ్యారు. తుఫాను 'దన'వల్ల పదిలక్షలకంటే ఎక్కువమంది నిరాశ్రయులయ్యారు. గత ఏడాది అక్టోబరులో బంగాళాఖాతంలో ఈ తుఫాను ఏర్పడింది. దీనివల్ల ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో ప్రజలు భారీగా నిరాశ్రయులయ్యారు.

## ఆటో డ్రైవర్ల హామీలు అమలు చేయాలి

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** కాంగ్రెస్ 2023 ఎన్నికల్లో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రవికుమార్ అన్నారు. రాష్ట్రవ్యాప్త ఆటో రథయాత్ర ఏప్రిల్ 25న మెదక్‌లో ప్రారంభమై మంగళవారం భువనగిరి జిల్లా కేంద్రానికి చేరుకుంది. తెలంగాణ రాష్ట్ర ఆటో జేఏసీ జిల్లా అధ్యక్షులు కొమ్ము జగదీష్ బాబు అధ్యక్షతన వారి ఆటో ర్యాలీ తీసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరానికి కాకుండా నెల నెలకి రూ.12 వేలు ఆటోలకు ఇవ్వాలని కోరారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చెయ్యాలని తెలిపారు. 1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలని, 8000 ఉన్న ఇన్సూరెన్స్ వెయ్యి రూపాయలకు తగ్గించాలి చెప్పారు. ఆటో డ్రైవర్‌కు రూ.5 లక్షల ఇన్సూరెన్స్ వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మంద రవికుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జై భీమ్ ఆటో వెల్ఫేర్ సొసైటీ యూనియన్ గౌరవ అధ్యక్షులు కర్నాల శ్రీనివాస్, జేఏసీ జిల్లా అధ్యక్షులు కొమ్ము జగదీష్ బాబు, ఉపాధ్యక్షులు ఎస్కే నిజాం, జిల్లా ప్రధాన కార్యదర్శి బింగి సురేష్, సహాయ కార్యదర్శి నాగరాజు ఉన్నారు.

## ప్రశాంతంగా 'పాలిసెట్' పరీక్షలు

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** జిల్లా కేంద్రంలో పాలిసెట్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయని పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ కె.సుజాత అన్నారు. ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల, ఎ, బి సెంటర్లు, ఎస్వీ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆర్‌కెఎల్‌కె డిగ్రీ కళాశాల, శ్రీమేధ జూనియర్ కళాశాల, శ్రీనిధి జూనియర్ కళాశాలలో జరిగే 8 సెంటర్లలో పరీక్షలు నిర్వహించినట్లు, పరీక్ష కేంద్రాలలో ఏలాంటి ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 2798 మంది



విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 2950 మంది హాజరైనట్లు, 208 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.



## ప్రతి విద్యార్థి ఉన్నత స్థానం పొందేలా బోధన

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

**ప్రజాపక్షం/చివ్వెంల:** ప్రతి విద్యార్థి ఉన్నత స్థానం పొందేలా భోధన చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం చివ్వెంల మండలంలోని దురాజ్‌పల్లి గ్రామంలో గల స్వామి నారాయణ గురుకుల ఇంటర్నేషనల్ స్కూల్ నందు క్వాలిటీ ఎడ్యుకేషన్‌పై ఉపాధ్యాయులకు జరుగుతున్న ఐదురోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయుడు నిబద్ధతతో పనిచేసి ప్రతి పేద విద్యార్థి ఉన్నత స్థానం చేరుకునేలా చూడాలని, సమాజంలో అసమానతలు తొలగాలంటే విద్య ముఖ్యపాత్ర పోషిస్తుందని, విద్యను అందించే ఉపాధ్యాయులపై గురుతరమైన బాధ్యత ఉందని కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 15లోగా ప్రతి విద్యార్థికి చదవడం,రాయడం గణితంలో చతుర్విధ ప్రక్రీయలు వచ్చేలా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమానికి మండల రిసోర్స్ పర్సన్స్, ఆంగ్లము, గణితము, సాంఘిక శాస్త్రము సంబంధించిన పాఠశాలల సహోపాధ్యాయులు కోదాడ, తుంగతుర్తి, నియోజకవర్గ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, కోఆర్డినేటర్లు జనార్ధన్, పూలమ్మ, స్వామి నారాయణ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఆర్‌పి రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

## పేదలకు అండ సిపిఐ జెండా



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పేదలకు అండ సిపిఐ జెండా అని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలోగల ఇందిరమ్మ కాలనీలో శాఖ సమావేశం చింతమల్ల రాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బంటు వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ సిపిఐ పార్టీ పేద ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి అనునిత్యం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇండ్లను పార్టీలకతీతంగా నిరుపేదలను ఎంపిక చేసి అందించాలని అన్నారు. వేసవికాలంలో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని అదేవిధంగా పశువుల దాహార్తిని తీర్చేందుకు పశువుల తొట్లను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా లింగంపల్లి సైదమ్మ, సహాయ కార్యదర్శిగా చింతమళ్ల సుశీలలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పార్టీ మండల సమితి సభ్యులు గోగుల యాదగిరి, లింగంపల్లి సైదమ్మ, వెంకటయ్య, మచ్చ శైలజ, చింతమల్ల సుశీల, సలికంటి సైదమ్మ, మల్లమ్మ, మంద లింగయ్య, ఎం.సైదులు తదితరులు పాల్గొన్నారు.

## త్వరగా ధాన్యం కొనుగోలు పూర్తి



**ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్:** ధాన్యం కొనుగోలు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు నిర్వాహకులకు సూచించారు. మంగళవారం సూర్యాపేట మండలంలోని బాలెంల 2 ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రాంబాబు సందర్శించారు. బాలెంల కొనుగోలు కేంద్రం నుండి ఇప్పటి వరకు 12626.40 క్వింటాళ్ల ధాన్యం తరలించడం జరిగిందని తెలిపారు. రైతులు తాలు లేకుండా శుభ్రమైన ధాన్యంను కొనుగోలు కేంద్రానికి తీసుకరావాలని, 17 శాతం తేమరాగానే సీరియల్ ప్రకారం కాంటావేసి మిల్లులకు తరలించాలని కోరారు. ఆకస్మిక వర్షాలు పడుతున్నందున తడవకుండా టార్పలిన్ పట్టాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. బాలెంలలోని రైస్‌మిల్లును సందర్శించారు. ధాన్యం పెండింగ్ పెట్టకుండా వెంటనే దిగుమతి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి పుష్పలత, రైతులు పాల్గొన్నారు.

## బిసి ఐక్య ఉద్యమాలు నిర్మించడమే లక్ష్యం

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు




**ప్రజాపక్షం/కోదాడ:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో ఉన్న బిసి ఉద్యమాలను ఐక్యం చేసి బిసి జెఎసి నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతామని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు తెలిపారు. మంగళవారం కోదాడ మున్సిపల్ పరిధిలోని బాలాజీనగర్ ఎల్ఐసి ఏజెంట్ల బిల్డింగ్‌లో జరిగిన బిసి హక్కుల సాధన సమితి మూడవ జిల్లా మహాసభకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నెన్నో దారులలో ఎన్నెన్నో రూపాలలో సాగుతున్న బిసి ఉద్యమాలు ఐక్యమతైనే ప్రభుత్వాల మేడలు వచ్చేందుకు అవకాశం ఉంటుందని, ఎన్నికల సందర్భంలో అమలుగాని వాగ్దానాలు చేసి బిసిలను, ఎస్సీలను, ఎస్టీలను మోసం చేసి అగ్రవర్ణాల వారు రాజ్యం ఏలుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలోచేపట్టనున్న బిసి జనగణనలో కులగణన చేపడతామని ప్రకటించిందని, తక్షణమే ఆ ప్రక్రీయను ప్రారంభించాలని అన్నారు. ఈ మహాసభకు దంతాల రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, గుండు వెంకటేశ్వర్లు, ఎస్‌కె లతీఫ్, చిలకరాజు శ్రీను, పిల్లుట్ల కనకయ్య, సింహాద్రి, ఇనుగుర్తి వెంకటరమణ, నిగిడాల వీరయ్య, ఉప్పతల శ్రీనివాస్, కొండ అన్నపూర్ణ, మండవ నాగమణి, బత్తిని శ్రీనివాస్, బాదె నర్సయ్య పాల్గొన్నారు.

## మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శేషగిరిరావు

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల ఇంచార్జీ తహసీల్దార్‌గా మంగళవారం శేషగిరిరావు బాధ్యతలు స్వీకరించారు. మండల తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జలజకుమారి లాంగ్ లీవ్‌లో ఉండడంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అడ్డగూడురు తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శేషగిరిరావుకు మండల ఇంచార్జీ తహశీల్దార్‌గా బాధ్యలను అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

మిల్లర్ల సమావేశంలో ఎమ్మెల్యే బాలునాయక్, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ పరిధిలోని రైస్ మిల్లర్లు మిల్లుల వద్ద రబీ ధాన్యం దించుకొనే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, దేవరకొండ ఎంఎల్‌ఏ బాలునాయక్ కోరారు. మంగళవారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో రబీ ధాన్యంపై రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఎంఎల్ఏ బాలునాయక్ మాట్లాడుతూ రైస్ మిల్లర్లు సకాలంలో ధాన్యాన్ని దించుకోనట్లయితే రైతులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని, అందువలన నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ధాన్యాన్ని మిల్లుల వద్ద దించుకోవాలని కోరారు. 15 రోజుల నుండి కొనుగోలు కేంద్రాల వద్ద నుండి పెద్ద ఎత్తున ధాన్యం మిల్లులకు పంపుతున్నారని, రోజు వారి నిర్దేశించిన టార్గెట్ ప్రకారం దించుకోవాలని తెలిపారు. ప్రతి మిల్లరు రోజు కనీసం 15 లారీలైన దించుకోవాలన్నారు. ఈ విషయాన్ని తహశీల్దార్‌లతో పాటు, ఆర్ఐ అందరూ పర్యవేక్షించాలని ఏ మిల్లరైన ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు పడకుండా మిల్లర్లు ప్రతి రోజు వారికి నిర్దేశించిన ప్రకారం ధాన్యాన్ని దించుకోవాలని తెలిపారు. మిల్లర్లకు రెండు రోజుల సమయం ఇచ్చి వేసి చూస్తామని తెలిపారు. 15 రోజుల్లో దేవరకొండ ప్రాంతంలో మొత్తం ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని ఆమె తెలిపారు. ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరు సహకరించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. అలాకాకుండా రైస్ మిల్లర్లు ధాన్యం దించుకోకుండా ఇబ్బందులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్, ఎంఎల్ఏ బాలునాయక్‌తో కలిసి కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ వాహనాల సమస్య ఉందని తెలుసుకొని ప్రతి రోజు 6 లారీలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని తరలించాలని, అవసరమైతే తహశీల్దార్ స్థానికంగా వాహనాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, దేవరకొండ ఆర్డీవో రమాణారెడ్డి, పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు వెంకన్న, జైపాల్ పాల్గొన్నారు.

# సుందరీమణుల రాకకు కట్టుదిట్టమైన భద్రత

యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** దేశ ప్రతిష్ట గౌరవము కీర్తి ప్రపంచానికి తెలిసేలా హైదరాబాదులో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 72వ మిస్ వరల్డ్ 2025 పోటీలలో పాల్గొనే ప్రపంచ సుందరీమణులు రేపు పోచంపల్లి టూరిజం, చేనేత ఇక్కత్ పరిశ్రమను సందర్శించనున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో పాటు ఘన స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేస్తున్నామని యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు పేర్కొన్నారు. యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్న టూరిజం పార్కు సుందరీకరణ పనుల పర్యవేక్షణలో భాగంగా ఆయన టూరిజం పార్కును సందర్శించారు. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భద్రత ఏర్పాట్లపై ప్రత్యేక నిఘా పెట్టి పటిష్టమైన బందో బస్తు చేయాలని కోరారు. అందాల రాణులు పోచంపల్లి సందర్శించి తిరిగి వెళ్లే వరకు ప్రతి శాఖ సిబ్బంది ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మ్యూజియం, హంపి థియేటర్ పార్కు పరిసరాలలో జరుగుతున్న సుందరీకరణ అన్ని పనులను పూర్తి చేయాలని కోరారు. ప్రణాళిక ప్రకారం ఎక్కడ ఎలాంటి అసౌకర్యం లేకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా కంటెస్టెంట్లు వచ్చే సందర్భంలో రహదారుల వెంట పోలీసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.రూట్ మ్యాప్ ప్రకారం ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. చౌటుప్పల్ ఏసిపి మధుసూదన్ రెడ్డి, ఆర్డీవో శేఖర్ రెడ్డి, టూరిజం మేనేజర్ ఉపేందర్ రెడ్డి, ఇన్చార్జి తహసిల్దారు నాగేశ్వరరావు, సిఐ రాములు, స్పల్ కమిషనర్ అంజన్ రెడ్డి, ఎస్ఐ భాస్కర్ రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకటరెడ్డి, ఈవెంట్ ఆర్గనైజర్స్ఇన్చార్జిలు అన్ని శాఖల ఉన్నతాధికారులు ఆయన వెంట ఉన్నారు.




## సిపిఐలో పలువురి చేరిక

**ప్రజాపక్షం/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం బోగారం గ్రామానికి చెందిన తెలుసూరి మల్లేశం, కూనూరు కబీర్ దాస్‌నీ, సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ చేతుల మీదుగా సిపిఐ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో నిత్యం ప్రజల పక్షాన ప్రజా గొంతుకై నినదిస్తున్న కూనమనేని సాంబశివరావు మాటలకు ఆకర్షితులై పార్టీలో పలువురు చేరుతున్నారని భవిష్యత్తులో పార్టీ అభివృద్ధి కొరకు పాటుపడాలని నిత్యం పేదల పక్షాన ఎర్రజెండా ప్రజా సమస్యలపై పోరాడుతుందని నిత్యం ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు భారత కమ్యూనిస్టుపార్టీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్, భగవంత, రచ్చ యాదగిరి, కళ్లెం యాదగిరి, ఊట్కూరి కృష్ణ, పర్సా సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఉపాధి' కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి? : బికెఎంయు

**ప్రజాపక్షం/ నాంపల్లి:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ ప్రదేశంలో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ జిల్లా కార్యదర్శి బొల్లుగిరి నరసింహ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దాపురం గ్రామంలోని ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడుతూ ఏడు వారాలుగా కూలీలకు వేతనాలు రావడం లేదని పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు లేక ఉపాధి హామీ కూలీలు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. పని ప్రదేశాలలో మంచినీరు టెంట్ సౌకర్యం ఓఆర్ఎస్ ప్యాకెట్లు మెడికల్ కిట్లు తదితర సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు పారా, గడ్డపార తట్ట ఆ పనిముట్లు ఇవ్వాలని అదేవిధంగా పని దినాలు 200 రోజులు కల్పించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజువారి వేతనము 700 రూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో ఫొటోస్ స్కానింగ్ విధానాన్ని ఎత్తివేయాలని నాలుగు నెలలుగా ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు రావడంలేదని వారి పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని అదేవిధంగా కూలీల కూడా పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఆయన ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు ఎండి జానిమియా, మండల కార్యదర్శి నేరెళ్ల సైదయ్య, కూలీలు వేలిజాల కవిత, పల్లె సైదమ్మ, అందుకుల లక్ష్మమ్మ, జిల్లెల్ల యాదమ్మ, వెలిజాల ముత్యాలు, జెల్లెల పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ సమస్యలకు నిధులు కేటాయించండి

ఎమ్మెల్యే రాజ్ గోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/మునుగోడు :** మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నో ఏండ్లుగా నెలకొన్న కరెంటు సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విద్యుత్ శాఖ సీఎం డి ముసారఫ్ ను కోరారు. మంగళవారం హైదరాబాదులో విద్యుత్ కార్యాలయంలో సిఎండి ముషారఫ్ తో మునుగోడు నియోజకవర్గ వివిధ మండలాల నాయకులతో కలిసి మునుగోడు నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్నలో వోల్టేజి సమస్య, అదనపు ట్రాన్స్ఫార్మర్ల కేటాయింపు, అదనపు సబ్ స్టేషన్ ల నిర్మాణం, లూజు లైన్ల సమస్యలు, గృహాలు ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలల పైన ప్రమాదకరంగా ఉన్న కరెంటు వైర్లు తొలగింపు సమస్యలతోపాటు మరికొన్ని సమస్యలను యాదాద్రి ,నల్లగొండ జిల్లాలకు సంబంధించిన అధికారుల దృష్టికి ఎమ్మెల్యే తీసుకువచ్చారు.మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా నెలకొని ఉన్న కరెంటు సమస్యలు పరిష్కరించడానికి 34 కోట్ల రూపాయల అవసరమవుతున్నాయని, ప్రత్యేక దృష్టితో 34 కోట్ల రూపాయల పనులను మంజూరు చేయాలని సీఎండి ముషారఫ్ వినతి పత్రం అందజేశారు. ఈ సమావేశంలో యాదాద్రి ,నల్లగొండ జిల్లాల విద్యుత్ అధికారులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/యాదాద్రి :** వానకాలం 2025/26 వ్యవసాయ సీజన్ ప్రారంభం అవుతున్న సందర్భంగా నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని యాదాద్రి భువనగిరి జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, అడిషనల్ డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ లక్ష్మీ నారాయణ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరం లో నకిలీ విత్తనాలు అరికట్టడంలో వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నకిలి విత్తనాలను అరికట్టడానికి తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులతో ప్రత్యేక స్క్వాడ్స్ ఏర్పాటు చేశారు. ఈ స్పెషల్ స్క్వాడ్స్ బృందాలు నకిలి విత్తనాలు అమ్మే వారిపై నిఘా పెట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. వ్యవసాయ అధికారి గోపాల్ మట్లాడుతూ విత్తనాల లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ నుండి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పనిసరిగా రసీదు పొందాలని, పంట కాలం ముగిసేవరికి రసీదును జాగ్రత్త పరచాలన్నారు. విత్తన నాణ్యత లోపం వలన జరిగే పంట నష్టమును నిర్ధారించి, పంట నష్ట పరిహారం ఇప్పించడానికి విత్తన కొనుగోలు రసీదు తప్పనిసరి అని గుర్తుంచుకోవాలన్నారు. కొనుగోలు చేయధలిచిన ప్రతి పత్తి విత్తన ప్యాకెట్ పై ప్యాకింగ్ తేదీని సరిచూసుకోవాలని తెలియజేశారు. అడిషనల్ డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ లక్ష్మీ నారాయణ మట్లాడుతూ ఎంఆర్‌పి రేటు కన్న ఎక్కువ ఇచ్చి విత్తనాలు కొనగోలు చేయరాదన్నారు. ఎవరైన ఎంఆర్‌పి రేటు కన్నా ఎక్కువ అమ్మజూపిన వెంటనే మీ మండల వ్యవసాయ అధికారికి తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

టియుడబ్ల్యూజె (ఐజెయు)జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి




**ప్రజాపక్షం/చిట్యాల:** జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో టియుడబ్ల్యూజె(ఐజెయు) ముందంజలో ఉంటుందని టియుడబ్ల్యూజె(ఐజెయు) నల్లగొండ జిల్లా కమిటి అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి అన్నారు. మున్సిపాలిటి కేంద్రంలో మంగళవారం జరిగిన చిట్యాల మండల జర్నలిస్టుల మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత 70 సంవత్సరాలుగా జర్నలిస్టులకు సేవలనందిస్తూ కొనసాగుతూ, సుధీర్ఘ అనుభవం గల యూనియన్ ఐజెయు అని అన్నారు. జర్నలిస్టులకు రూ. 15లక్షల వరకు వైద్య ఖర్చులకు ఉపయోగపడే హెల్త్ కార్డుల పంపిణీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వంతో రాష్ట్ర యూనియన్ జరుపుతున్న చర్చలు కొలిక్కి వస్తున్నాయని, అతి త్వరలోనే అమలులోకి వస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇండ్ల స్థలాల విషయంలో కూడా ప్రభుత్వంతో సంప్రదింపులు కొనసాగుతున్నాయన్నారు. జర్నలిస్టులందరికి ఆర్‌టిసి బస్సులలో రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశాలు కల్పించాలని కోరుతూ ఇటీవల రాష్ట్ర రోడ్డు, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ కలవగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల సమస్యలపై సంఘటితంగా పరిష్కార మార్గాలవైపు పయనిస్తామని కృష్ణారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కలిమెల నాగయ్య, ఉపాధ్యక్షులు ఏళ్ళ బయ్యన్న, సహాయకార్యదర్శి పెద్ది నరేందర్, జిల్లా నాయకులు దోసపాటి సత్యనారాయణ, వర్థిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాదరి యాదగిరి, దోతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### టియుడబ్ల్యూజె నూతన కార్యవర్గం

నల్లగొండ జిల్లా చిట్యాల మండల టియుడబ్ల్యూజె మండల నూతన కమిటిని మంగళవారం రోజున ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రతినిధుల సమక్షంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్నిక కార్యక్రమం జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా పెద్ది నరేందర్, సలహాదారుడిగి మిర్యాల ప్రకాష్, మండల అధ్యక్ష, కార్యదర్శులుగా మెండె వెంకన్న, పోకల కరుణాకర్, ఉపాధ్యక్షులుగా ఏళ్ళ వెంకన్న, జక్కలి మహేష్, కోశాధికారిగా చెరుపల్లి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా కూనూరు మధు, సూరెపల్లి సూర్యనారాయణ, సభ్యులుగా అమరోజు వెంకన్న, జిట్ట మల్లేష్, మెహర్‌బాబాలు ఎన్నికయ్యారు. నూతన కమిటికి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గార్లపాటి కృష్ణారెడ్డి, కలిమెల నాగయ్య, జిల్లా నాయకులు ఏళ్ళ బయన్న, పెద్ది నరేందర్ తదితరులు అభినందనలు తెలిపారు.

## నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండాలి : డిఎస్‌పి



**ప్రజాపక్షం/నల్లగొం( తిప్పర్తి):** అమాయకులైన నిరుద్యోగ యువతకు జాబ్ ఇప్పిస్తాము అంటూ మాయ మాటలు చెప్పి డబ్బులు అడిగే వాళ్లను నమ్మి మోసపోవద్దు అని నల్లగొండ డిఎస్పి శివరాంరెడ్డి సూచించారు. మంగళవారం తిప్పర్తి పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిఎస్పి మాట్లాడుతూ గత కొంత కాలంగా నల్లగొండ జిల్లా కోర్టులో సర్వేయర్, అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి, కోర్టు పరిసరాలను కేంద్రంగా చేసుకుని నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారని తెలిసి జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఆదేశానుసారం ఇట్టి కేసును తిప్పర్తి పోలీసులు ఛేదించి, మోసగాళ్లను పట్టుకున్నారని తెలిపారు. 31 మంది నిరుద్యోగ మహిళల నుండి రూ.10.32వేలు వసూలు చేసిన అడ్వకేట్ క్లర్క్ మహమ్మద్ నసిర్. న్యాయవాది గాజుల జ్యోతి అలియాస్ జ్యోతి రాణి లను పోలీసులు పట్టుబడి చేయడం జరిగిందని వెల్లడించారు.తిప్పర్తి మం డలం ఇండ్లూరుకు చెందిన ఏపురి హెపిసాబా అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 7న న తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని. విచారణలో నిందితులు అయిన ఏ 1 మహమ్మద్ నసీర్ ఏ 2 గాజుల జ్యోతి అలియాస్ జ్యోతి రాణి లు అమాయక నిరుద్యోగ మహిళలకు జిల్లా కోర్టులో కాంట్రాక్ట్ స్వీపర్, అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసపూరిత హామీ లు ఇచ్చి కొంతమంది వద్ద రూ.50వేల చొప్పున, మరికొంత మంది నుండి 20 నుండి 30 వేల రూపాయలు చొప్పున వసూలు చేసినట్లు విచారణలో తేలింది అన్నారు. మొత్తం 31 మంది బాధితులు నల్లగొండ, తిప్పర్తి, మాడ్గులపల్లి మండలాలకు చెందిన వారి వద్దనుండి మొత్తం రూ.10,32,000 అక్రమంగా వసూలు చేశారని ఈ కేసును త్వరితగతిన ఛేదించిన శాలిగౌరారం సిఐ కె.కొండల్ రెడ్డి, తిప్పర్తి ఎస్ ఐ బి.సాయి ప్రశాంత్, హెచ్ సి శ్రీనివాస్ రెడ్డి, పీసీ రాంరెడ్డి, పోలీస్ బృందాన్ని జిల్లా ఎస్.పి. అభినందించారు.

# ఫోకస్ — మహిళ

## వాతావరణ సంక్షోభం... మహిళల ఆరోగ్యంపై ప్రభావం




వాతావరణ సంక్షోభం వల్ల మహిళలు, బాలికలు అసమానంగా ప్రభావితమవుతున్నారు. వరదలు, కరువులు, వేడిగాలులు, వాయు కాలుష్యం, కార్చిచ్చులు, ఇతర పర్యావరణ విపత్తుల ఫలితంగా వారు ఆరోగ్య పరిణామాలను ఎదుర్కొనే అవకాశం ఎక్కువగా ఉంది. అదే సమయంలో, వారి మిగిలిన కుటుంబాలకు ఆహారం, నీరు, శక్తిని భద్రపరచడం కూడా మహిళల బాధ్యత. తీవ్రమైన వాతావరణం వల్ల వనరుల కొరత ఏర్పడినప్పుడు వారి జీవితాలు, జీవనోపాధి ప్రమాదంలో పడుతుంది. అయినా మహిళలు వాటన్నింటినీ అధిగమిస్తూ చాలా ఓర్పుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై మీడియా డైవర్సిటీ ఇన్స్టిట్యూట్ ప్రపంచ వ్యాప్తంగా విశ్లేషణ చేసింది. ఇరాన్, మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా అంతటా పర్యావరణ సమస్యలపై అధ్యయనం జరిపింది. ఇది ప్రపంచంలోని అత్యంత వాతావరణ దుర్బల ప్రాంతాలలో ఒకటి. ఇవి తీవ్రమైన వేడి, నీటి కొరత, ఇసుక మరియు ధూళి తుఫానులను ఎదుర్కొంటున్నాయి. ఇరాన్‌లో, పర్యావరణ సమస్యలు ఎక్కువగా రాజకీయం చేయబడ్డాయి. నీటి కొరత లేదా వాయు కాలుష్యం గురించి చర్చించడాన్ని ప్రభుత్వంపై విమర్శగా అర్థం చేసుకోవచ్చు. ఇరాన్‌లోని కొన్ని ప్రావిన్సులలో ఉష్ణోగ్రతలు 50 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతల కంటే ఎక్కువగా ఉన్నాయి. ఆఫ్‌ది రికార్డ్ సంభాషణల ద్వారా తీవ్రమైన వేడి వల్ల మహిళలు వడదెబ్బ, రుతుక్రమ సమస్యలు, గర్భస్రావాలు కూడా ఎదుర్కొంటున్నట్లు వెల్లడైంది. వివిధ ప్రాంతాలలోని తల్లులు, విద్యార్థులు, వైద్య నిపుణులను సంప్రదించగా అనామకంగా మాట్లాడినట్లు అధ్యయనం పేర్కొంది. పర్యావరణ కారణాల కోసం స్వచ్ఛందంగా పనిచేయడానికి లేదా పర్యావరణ అనుకూల మార్గంలో వ్యవహరించడానికి పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఉన్నారని ఆధారాలు సూచిస్తున్నాయి. రాజకీయ నాయకత్వంలో ఎక్కువ మంది మహిళలు ఉన్న దేశాలు బలమైన వాతావరణ విధానాలను కలిగి ఉంటాయి. అయితే, మహిళల మీడియా కవరేజీలో కూడా కొంత అసమతుల్యత ఉంది. ఉదాహరణకు, స్వీడిష్ కార్యకర్త గ్రెటా థన్‌బర్గ్ యూరప్, ఉత్తర అమెరికా, ఆస్ట్రలేసియా (దీనిని తరచుగా గ్లోబల్ నార్త్ అని పిలుస్తారు)లోని సంపన్న దేశాలలో ఎక్కువగా వినియోగించబడే మీడియాలో గుర్తింపు పొందారు. కానీ ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలో (తరచుగా గ్లోబల్ సౌత్ అని పిలుస్తారు) వాతావరణ మార్పు తీవ్రంగా దెబ్బతింటున్నందున, పర్యావరణ ఉద్యమాలకు నాయకత్వం వహించే మహిళలు అరుదుగా అదే స్థాయిలో శ్రద్ధ పొందుతున్నారని గమనించారు. ప్రపంచంలోని ఈ ప్రాంతంలో అనేక మంది మహిళా పర్యావరణ నాయకులు ఉన్నప్పటికీ ఇది జరుగుతోంది. ఇరాన్‌లో, వన్యప్రాణులు, పరిరక్షణ కార్యకర్తలు నీలోఫర్ బయానీ, సెపిదే కషానీలను ఇస్లామిక్ విప్లవాత్మక గార్డ్ కారప్స్ యొక్క నిఘా విభాగం గూఢచర్యం చేసినట్లు తప్పుడు ఆరోపణలు చేసిన తర్వాత ఆరు సంవత్సరాలకు పైగా జైలులో ఉంచి హింసించారు. వారి పని ఇరాన్ పర్యావరణాన్ని, ముఖ్యంగా తీవ్రంగా అంతరించిపోతున్న ఆసియా చిరుతను రక్షించడానికి అంకితం చేయబడింది. బయానీ 2023లో టెహ్రాన్‌లోని అపఖ్యాతి పాలైన ఎవిన్ జైలులో దశాబ్ద కాలం పాటు జైలు శిక్ష అనుభవిస్తున్నప్పుడు వాతావరణ సంక్షోభం గురించి ఒక మ్యానిఫెస్టోను రాశారు. మహిళలకు విద్యను అందించారు. రువాండాకు చెందిన జూలియట్ కబెరా అనే మరో మహిళ ప్లాస్టిక్ సంచులు, సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌లను నిషేధించడానికి మద్దతుదారుగా ఉంది. ప్లాస్టిక్ వ్యర్థాలను పరిష్కరించడానికి, ప్రపంచ ఉత్పత్తిని తగ్గించడానికి ప్రపంచ ఒప్పంద చర్చలకు హాజరయ్యారు. ఈ ప్రాంతంలోని ఇతర పనిని ప్రతిబింబించే మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికాలో పర్యావరణ నివేదికలపై పరిశోధనలో నిపుణులు, నాయకులు లేదా పరిష్కార తయారీదారుల కంటే మహిళలు తరచుగా వాతావరణ విపత్తుల బాధితులుగా చిత్రీకరించబడుతున్నారని కనుగొన్నారు. గ్లోబల్ సౌత్‌లోని వారి సహచరుల కంటే గ్లోబల్ నార్త్‌లోని మహిళలు తరచుగా వాతావరణ విధానం, క్రియాశీలత లేదా పరిశోధన గురించి చర్చలలో పాల్గొంటారు.

## విశ్వవిద్యాలయాలను శాసిస్తున్న మహిళా మణులు..



**ఆడపిల్లకు చదువు ఎందుకులే అని గతంలో చిన్నచూపు చూసేవారు. కానీ ఇప్పుడు పురుషులకు తామేమీ తక్కువ కాదు ఇంకొంచెం ఎక్కువేనని మహిళా మణులు నిరూపిస్తున్నారు. ఎంతలా అంటే ప్రపంచంలోని టాప్ విశ్వ విద్యాలయాలు వారి ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి అంటే వారి మార్క్ పాలన ఏంటో అర్థం చేసుకోవచ్చు.**

### టాప్ నాలుగింటిలో మొదటిసారిగా..

సాధారణంగా విశ్వవిద్యాలయాల్లో అధికార స్థానాలను పురుషులే నిర్వహిస్తుంటారు. అయితే నిర్ణయం తీసుకునే స్థానాల్లో ఎక్కువగా మహిళలే ఉంటున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ప్రపంచ ప్రముఖ 5 విశ్వవిద్యాలయాల్లో నాలుగింటికి వారే నాయకత్వం వహించనున్నారు. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ యొక్క గ్లోబల్ యూనివర్శిటీ ర్యాంకింగ్స్ 2023 ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ ఏడాది జూలై నాటికి ఆక్స్ ఫర్డ్ హార్వర్డ్ కేంబ్రిడ్జ్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (మిట్)లు.. మొదటిసారి మహిళల నేతృత్వంలో కార్యకలాపాలు కొనసాగించనున్నాయి.

### అగ్రి విశ్వవిద్యాలయాల్లో ఇలా..

ప్రపంచ విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్లో మొదటి స్థానంలో ఉన్న ఆక్స్‌ఫర్డ్‌ను ప్రస్తుతం ఐరీన్ ట్రేసీ నడిపిస్తున్నారు. రెండో స్థానంలోని హార్వర్డులో క్లాడిన్ గే, మూడవదిగా నిలిచిన కేంబ్రిడ్జిలో డెబోరా ప్రెంటిస్ ఈ జూలైలో నాయకత్వ స్థానాల్లో నియామకం కానున్నారు. మిట్ ప్రస్తుతం సాలీ కార్న్‌బ్లుత్ ఆధ్వర్యంలో కొనసాగుతోంది. వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2023 డేటా ప్రకారం.. 200 విశ్వవిద్యాలయాల్లో 48 మంది మహిళా ప్రెసిడెంట్‌లు లేదా వైస్‌ఛాన్సలర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. గతేడాదిలో 43తో పోలిస్తే ఇప్పుడు కొంత పెరిగింది. క్రితం సంవత్సరంతో పోల్చి చూస్తే.. మహిళలు నాయకత్వ బాధ్యతలు చేపట్టడం 12 శాతం పెరిగింది. ఐదేళ్ల క్రితంతో పోలిస్తే మాత్రం 41 శాతం ఈ రేటు అధికమైనట్లు నివేదిక వెల్లడిస్తోంది.

### అమెరికా, యూరప్‌లలో భారీగా..

ఆమెరికా, జర్మనీల్లో మహిళల నాయకత్వ రేటు ఎక్కువగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అమెరికాలోని మొత్తం 58లో 16ను వారే నిర్వహిస్తున్నారట. 5 అగ్రశ్రేణి జర్మన్ విశ్వవిద్యాలయాలకు మహిళలు నాయకత్వం వహిస్తున్నారని డేటా వెల్లడించింది. యూరప్ దేశాల్లోనూ దాదాపు ఇదే విధానం కొనసాగుతోంది. ఫ్రాన్సులోని 5లో 3, నెదర్లాండ్స్‌కు చెందిన 10కి 5, 28 యుకె యూనివర్సిటీల్లో ఎనిమిదింటికి మహిళలలే సారథ్యం వహిస్తున్నారు.

### నాంది పలికిన ఆసియా

ఈ విషయంలో ఆసియా సైతం ముందంజలో ఉంది. హాంకాంగ్ యూనివర్శిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అధ్యక్షురాలిగా నియమితులైన న్యూరో సైంటిస్ట్ నాన్సీ ఐప్.. 200 విశ్వవిద్యాలయాల్లో చూస్తే, నాయకత్వం వహించిన మొదటి మహిళగా చరిత్ర సృష్టించారు. సౌదీ అరేబియాలోని అతిపెద్ద విశ్వవిద్యాలయం కింగ్ అబ్దులాజీజ్ విశ్వవిద్యాలయానికి హనా అబ్దుల్లా అల్ నుయిమ్ తాత్కాలిక మహిళా నాయకురాలిగా వ్యవహరిస్తున్నారు.


### ఇదీ 5 ఏళ్ల ట్రెండ్



2022లో 43 మంది, 2021లో 41, 2020లో 39, 2019, 2018లో 34 గ్లోబల్ యూనివర్శిటీల్లో మహిళా బాస్‌ల సంఖ్య ఏటేటా స్థిరంగా పెరుగుతోందని డేటా చూపిస్తోంది. కానీ 27 దేశాలకు చెందిన 12 టాప్ విశ్వవిద్యాలయాల్లో వారి నాయకత్వం లేకపోవడం శోచనీయం. ప్రపంచ దిగ్గజ సంస్థ అమెజాన్ సైతం, 200 మంది మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తులను అంతర్జాతీయంగా అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## కార్లను రేస్ చేసే ట్రీ సర్జన్

ఖాళీ సమయంలో కార్లను రేస్ చేసే అర్మాగ్ ట్రీ సర్జన్ ఈ ఉద్యోగం ఊహించినంత భయానకంగా లేదు అని చెబుతున్నారు. అర్మాగ్ కౌంటీలోని న్యూటౌన్ హామిల్టన్‌కు చెందిన 20 ఏళ్ల లెటిషా కాన్, 2023లో తన తండ్రి ట్రీ సర్జరీ వ్యాపారంలో చేరింది. అప్పటి నుండి పూర్తి సమయం ట్రీ సర్జన్‌గా మారింది. ఆమె తన తండ్రి స్టీఫెన్ అడుగుజాడలను అనుసరించడం ఇదే మొదటిసారి కాదు. ఆమె అతను ర్యాలీ కార్లను రేస్ చేయడం చూస్తూ పెరిగింది. 2021లో 16 సంవత్సరాల వయస్సులో ఏదైనా యుకె జూనియర్ ర్యాలీ ఛాంపియన్‌షిప్‌లో జూనియర్ ర్యాలీలో పూర్తిగా విజయం సాధించిన మొదటి అమ్మాయిగా చరిత్ర సృష్టించింది.



### స్టార్మ్ ఎయోవిన్ సవాళ్లు

పాఠశాల సెలవుల్లో, వేసవి సెలవుల అంతటా తన తండ్రికి సహాయం చేయడం ప్రారంభించినప్పుడు లెటిషా కుటుంబ వ్యాపారంలోకి తన ప్రయాణం ప్రారంభమైంది. కళాశాల నుండి బయటకు వచ్చిన తర్వాత ట్రీ సర్జన్ కావడం ఆమెకు కెరీర్ అని ఆమె నిర్ణయించుకుంది. తాను ఆ పనిని ఆస్వాదిస్తున్నానని, అందువల్ల అందులే ఉండాలని నిర్ణయించుకున్నాని అంటున్నారు. ఆమె, ఇతర ట్రీ సర్జన్లు ఎదుర్కొనే ప్రధాన సవాళ్లలో ఒకటి అబ్బురపరిచే ఎత్తుల నుండి పనిచేయడం. ట్రీ సర్జన్‌గా వచ్చే వివిధ రకాల పని ఆమెను ఈ పాత్రకు ఆకర్షించింది. స్టార్మ్ ఎయోవిన్ వల్ల కలిగే నష్టం స్థాయి కొత్తగా అర్హత పొందిన ట్రీ సర్జన్‌కు కొత్త అనుభవం, ఎందుకంటే ఆమె తుఫాను తర్వాత చాలా నష్టాన్ని చూసింది.



### సీటులోకి తిరిగి రావడం సులభం

తన తండ్రి తనకు మొదటి గో కార్ట్ ఇచ్చినప్పుడు తనకు ఏడు సంవత్సరాలు అని అన్నారు. 13 సంవత్సరాల వయసులో పోటీగా ర్యాలీ చేయడం ప్రారంభించగా, 2024లో ఆమె తన తండ్రితో కలిసి ఉల్స్టర్ ర్యాలీలో పోటీ పడ్డారు. ఎరుపు బిఎండబ్ల్యులో కోర్సుకు వెళ్లారు. ప్రణాళిక ప్రకారం పనులు జరగకపోవడంతో, వారు ఓవర్‌షూట్‌ను ఎదుర్కొని లెటిషాకు తీవ్రమైన భుజం గాయం అయింది. గాయాల తర్వాత సీటులోకి తిరిగి రావడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. దీని వలన లెటిషా వాటిలో వీలైనన్ని ఎక్కువ రౌండ్లు ఉత్తర ఐర్లాండ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేలా చేసింది. లెటిషా తనను తాను కనుగొన్న రెండు ప్రపంచాలు సాధారణంగా పురుషుల ఆధిపత్యంగా పరిగణించబడేవి.... కానీ అది ఆమెను దూరం చేయలేదు. చెట్టు శస్త్రచికిత్స, ర్యాలీ డ్రైవింగ్ రెండింటిలోనూ తన తండ్రి అడుగుజాడలను అనుసరించడం తనకు గర్వంగా ఉందన్నారు. తన తండ్రి అండగా ఉన్నారని, అయితే ఆయనకు కృతజ్ఞతలు చెబుతాననని ఎప్పుడూ అనుకోలేదన్నారు.

---

## వ్యవసాయ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం

### బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** వ్యవసాయ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం తేవాలని బికెఎంయు జాతీయ కార్యవర్గసభ్యుడు తాటిపాముల వెంకట్రాములు కోరారు. మంగళవారం శివనగర్ తమ్మెరభవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యకర్తల సమావేశం సిలువేరు విజయ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వెంకట్రాములు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 200 రోజుల పని, రూ.700కూలీ, పట్టణాలలో ఉపాధి హామీ పనులు కల్పన, రైతు పంటలకు గిట్టుబాటు ధరల కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, కనీస వేతనం రూ. 26వేలు, సమాన పనికి సమాన వేతనం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు స్వస్తి పలుకాలని ఉద్యోగ భద్రత తదితర డిమాండ్స్ సాధనకు జరుగుతున్న మే 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మె, గ్రామీణబంద్‌లో అన్ని వర్గాల ప్రజలు, వ్యవసాయ కార్మికులు పాల్గొని ఐక్యతా శక్తిని ప్రదర్శించాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కపల్లి రమేష్, నాయకులు సిలువేరు విజయ, బి.సాయిలు, వేముల బాబు, వి.ఎల్లయ్య, సాంబ లక్ష్మి , స్వరూప తదితరులు పాల్గొన్నారు.




## పేదల నిరీక్షణ ఇంకెన్నాళ్లు?

### ఇండ్లు, ఇంటిస్థలాల కోసం

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** పేదలు ఇండ్ల స్థలాల కోసం ఇంకెన్నాళ్లు నిరీక్షించాలని, పేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ మండలంలోని గుండ్ల సింగారంలో సిపిఐ ఆధ్వర్యంలో పేదలు వేసుకున్న గుడిసెల కేంద్రం వద్ద పార్టీ ఆఫీస్ కార్యాలయానికి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన గుడిసెవాసుల సమావేశం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాటాడారు. ఇండ్ల స్థలాల కోసం, పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ఏండ్ల తరబడి పేదలు పోరాడుతూనే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.






స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు, బడుగు బలహీన వర్గాలు నివసించేందుకు స్థలం లేక, పక్కా ఇల్లు లేక, దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితి దాపురించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్లస్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, కానీ ఇంకా రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. పేదలకు, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారికి ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని తక్కళ్లపల్లి డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎన్‌వి స్టాలిన్, జిల్లా నాయకులు బత్తిని సదానందం, మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, కొట్టేపాక రవి, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, గ్రామ పెద్దలు గాదె రాజన్న, గాదె మొగిలి, కట్కూరి కృష్ణ, నాయకులు పోనుగోటి రాము, పూజారి అమృతయ్య, పూజారి నరేందర్, గడ్డం గోవర్ధన్, రామక్రిష్ణ, శ్రావ్య, ముప్పుడి రజిత, సునీత, గుడిసె వాసులు తదితరులు పాల్గొన్నారు.

---

## కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాల్సిందే



మందమర్రి ...

### 20న జరిగే దేశవ్యాప్త సమ్మె సన్నాహక సభల్లో కార్మిక నేతల డిమాండ్

**ప్రజాపక్షం/మందమర్రి :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాల్సిందేనని కార్మిక నేతలు డిమాండ్ చేశారు. నూతన లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను దూరం చేస్తున్నాయని, వాటి వ్యతిరేకంగా ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని జెఎసి కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. మంగళవారం మందమర్రి పట్టణంలోని ఎఐటియుసి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మారుస్తూ కార్మికులను కట్టుబానిసలుగా మలచాలని చూస్తోందని విమర్శించారు. కార్మికుల హక్కులను హరించి, కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెట్టేందుకు కేంద్రం ఈ కుట్ర చేస్తోందని తెలిపారు. లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించి పాత 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు 20న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, సిఐటియు అధ్యక్షుడు రాజిరెడ్డి, ఐఎన్‌టియుసి వైస్‌ప్రెసిడెంట్ దేవి భూమయ్య, టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, ఎఐటియుసి నాయకులు ఎండి అక్బర్ అలీ, శైలేంద్ర సత్యనారాయణ, భీమనాథుని సుదర్శన్, ఎం.కంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వరంగల్...

**వరంగల్ ప్రతినిధి :** నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అన్నారు. మే 20వ తేదీన జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎంజిఎం హాస్పిటల్‌లో సమ్మె పోస్టర్ మంద సంజీవ గడల రమేష్ అధ్యక్షతన రమేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బన్న రాంబాబు, రమేష్, మధు రమా, సునీత, యోగేందర్, రాజ్వీర్, శ్రీనివాస్, కోమల, మహేందర్, హేమలత, లక్ష్మి , లక్ష్మణ్ పాల్గొన్నారు.

**సత్తుపల్లి :** బిజెపి కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగం నరసింహారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని విశ్వశాంతి స్కూల్‌లో ఎఐటియుసి, సిఐటియు, టియుఐసిల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ, సిఐటియు జిల్లా నాయకులు సర్వేశ్వరరావు, టియుసిఐ నాయకుల శరత్‌లు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నాయకులు మోరంపూడి పాండురంగారావు, సుధాకర్, సత్తనపల్లి సుధాకర్, తడకమళ్ళ యోబు, టిరామారావు, కెబసవయ్య, కంచి శ్రీనివాసరావు, కనపర్తి మాలాద్రి, షేక్ రహీమ్‌తుల్లా, మహాదేవ లక్ష్మి , సత్యవతి, వసంత, వెంకటలక్ష్మి , సీత, వలి, సైదా, ఆటో మస్తాన్, యాకోబు, రాము, రవి, వెంకటేష్, బాజీ, పి వెంకటేష్, పవన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్ :** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం రెబ్బెన మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) మండల అధ్యక్షుడు ఆర్.రమేష్ ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి మండల అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి దేవాజీ, శంకర్, ప్రవీణ్, నర్సయ్య, లక్ష్మి , కమల తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ :** దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి ప్రచారంలో భాగంగా మంగళవారం సివిల్ సప్లై హమాలీ కార్మిక సంఘం (ఎఐటియుసి) ఆధ్వర్యంలో పద్మనగర్‌లోని సివిల్‌సప్లై గోదాం వద్ద ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ కార్మిక సంఘం నాయకులు సంపత్ యాదవ్, రాజేందర్, మల్లేశం, అంజయ్య, శ్రీధర్, రాజయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

### సమ్మెకు మద్దతుగా గ్రామీణ బంద్

**కరీంనగర్ :** దేశంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, వ్యవసాయ, రైతు కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా గ్రామాల్లో వ్యవసాయ కూలీలు గ్రామీణ బంద్ నిర్వహించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ పిలుపునిచ్చారు. బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘాల సమావేశంతో సృజన్ మాట్లాడారు. సమావేశంలో బికెఎంయు జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్, ఎఐఎడబ్ల్యుయు జిల్లా ఉపాధ్యక్షులు రాయికంటి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి సుంకరి సంపత్, నల్లగొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సత్తుపల్లి...


కరీంనగర్...




ఆసిఫాబాద్...

# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## కొనుగోలు కేంద్రం తనిఖీ



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ నియోజకవర్గంలోని ధారూర్ మండల పరిధిలోని గట్టేపల్లి గ్రామంలో పిఎసిఎస్ అధ్వర్యంలో కొనుగోలు కంద్రాంను అదనపు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయాన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యంను వెంటనే రైతుల నుంచి కొనుగోలు చేసి టాకింగ్ చేసిన విధంగా రైస్ మిల్లులకు వరి ధాన్యం వెంటనే పంపవల్సిందిగా ఇన్‌చార్జీలను అదేశించారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 128వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 17,459,920 మెట్రిక్‌టన్నుల వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసిన రైతులకు సుమరుగా 18కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌ఓవి మోహన్‌బాబు, డటిసిఎస్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గోన్నారు.

## విత్తన కంపెనీలు నాణ్యమైన విత్తనాలు తయారు చేయాలి




**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** జిల్లాలోని విత్తన కంపనీలు నాణ్యమైన విత్తనాలు తయారు చేయటంతో పాటు అనుమతి లేని విత్తనాలను విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకొంటామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రకళ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్, గండి మైసమ్మ, బాలానగర్, దుండిగల్ మండలాల్లోని పలు విత్తన కంపనీలను జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో విత్తన ధృవీకరణ అధికారి ఎం.శివకుమార్, మండల వ్యవసాయాధికార్లు యాదగిరి, సాయి రమేష్‌లతో కల్సి తనిఖీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ విత్తన కంపనీ నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనల మేరకు విత్తనాల రిజిస్టర్, స్టాక్ బోర్డులు, విత్తన నిల్వలను అధికారులు పరిశీలించారు. కొంపల్లిలోని నూజివీడు సీడ్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ, కుత్బుల్లాపూర్ మండలంలోని తెలంగాణా స్టేట్ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ విత్తన కంపనీలలో తనిఖీలు జరిగాయి.

## విద్యార్థుల ఉన్నతే గురువులకు ఆనందం



**ప్రజాపక్షం/పరిగి రూరల్ :** ఎక్కడో పుట్టి..ఎక్కడో పెరిగి చిన్ననాటి నుండి ఒకే విద్య సంస్థలో చదివిన పూర్వ విద్యార్థులు 18 సంవత్సరాల తర్వాత ఆత్మీయ వేదికపై కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం మిట్ట కోడూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో మిటకోడూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 2006–07 జ్ఞాపకాలను టెన్త్ క్లాస్‌లో చేసిన అల్లరి చేష్టలను, ఉపాధ్యాయులతో కలసి, అప్పటి ఆట, పాటలను గుర్తు చేసుకుంటూ ఆనందోత్సవాలతో గడిపారు. ఎన్నో సంవత్సరాల తర్వాత ఒకరితో ఒకరు చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆలింగనం చేసుకుంటూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు మేళ, తాళాలు, చప్పుళ్లతో సాంప్రదాయ పద్ధతిలో సభా స్థలానికి ఆహ్వానించి ఉపాధ్యాయులకు వేదిక పైకి పిలిచి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాని ఉద్దేశించి ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో నైతిక విలువలు, సమాజ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. తమ పిల్లల చదువుపై ఒత్తిడీ చేపట్టవద్దని అభిప్రాయం మేరకే ముందుకు సాగితే విజయం తథ్యమని చెప్పారు. వివిధ స్థాయిల్లో అందరూ పనిచేస్తున్నప్పటికీ 22 సంవత్సరాల తర్వాత ఒకే చోట కలుసుకోవడం శుభపరిణామం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బోధించిన ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, మాణిక్యం, అటెండర్ కిష్టయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నరసింహా స్వామి బ్రహ్మోత్సవాలు



**ప్రజాపక్షం/పూడూర్ :** పరిగి నియోజకవర్గంలోని పూడుర్ మండల రాకంచెర్ల గ్రామంలో శ్రీ తిరుమాలనాధ స్వామి దేవస్తానములో శ్రీ యోగానంద లక్ష్మి నరసంహ స్వామి బ్రహ్మోత్సవాల్లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు కమ్లిబాయి, పెంటయ్య, సతీష్ రెడ్డి, మండలఅధ్యక్షులు సురేందర్ ముదిరాజు, నరసంహరెడ్డి , భాస్కర్ ,రాజు, తదితరులు పాల్గోన్నారు.

## అర్హులైన పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు



**ప్రజాపక్షం/దోమ :** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని శివరెడ్డి పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సుజాత, లవణ్య, ఎండి షరీప్ ఇళ్ల నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇళ్లను అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. బేస్ మీట్ వరకు పూర్తి చేసిన వెంటనే లక్ష రూపాయలు లబ్ధిదారుల ఖతలో జమ చేశామని వీలైనంత తొందరగా ఇందిర్మ ఇల్లు నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ పరుశురాంరెడ్డి , మండల అధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి , యాదవరెడ్డి , రాఘవేందర్ రెడ్డి , శాంతుకుమార్ , రమేష్‌గౌడ్ , సాయిరెడ్డి , మొగులయ్యగౌడ్ తదితరులు పాల్గోన్నారు.

## త్వరలో ఆటోనగర్ ఏర్పాటు చేస్తాం

### తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు :** తాండూరు పట్టణ శివారు ప్రాంతంలోనే త్వరలో ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తానని తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి హామిచ్చారు. తాండూరులో అటోనగర్ ఏర్పాటు చేయాలని ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో తాండూరు మెకానిక్ అసోసియేషన్ సభ్యులు కలసి విన్నవించుకున్నారు. తాండూరు పట్టణంలో అటోనగర్ లేక పోవడంతో ఇబ్బందులు తలేత్తుతున్నాయని ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి దృష్టికి మెకానిక్ అసోసియేషన్ సభ్యులు తీసుకవెళ్లారు. అసోసియేషన్ సభ్యుల విజ్ఞాప్తి మేరకు ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి హైదరాబాద్ రోడ్డు మార్గంలో త్వరలో ఆధునాతన వసతులతో అటోనగర్‌ను అందుబాటులోకి తీసుకవచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని ఎంఎల్‌ఎ హామి ఇచ్చారు.

## చార్మినార్ వద్ద సుందరీమణుల సందడి









ప్రపంచ సుందరీమణులు మంగళవారం హైదరాబాద్ లోని చారిత్రాత్మక కట్టడం చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్ చేశారు. అనంతరం వారంతా చార్మినార్ పరిసరాల్లో తిరుగుతూ సందడి చేశారు. చార్మినార్ సమీపంలోని చుడీ బజారులో ఎంపిక చేసిన తొమ్మిది దుకాణాల్లో వివిధ రకాల గాజులు, ముత్యాల హారాలు తదితర అలంకరణ వస్తువుల షాపింగ్ నిర్వహించారు. కాగా చౌముల్లా ప్యాలెస్‌లో ప్రపంచ సుందరిమణులకు ఏర్పాటు చేసిన డిన్నర్‌కు సిఎం ఎ.రేవంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా చేరుకున్నారు.

## గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణాకు

# పెద్ద మొత్తంలో రోడ్ల నిర్మాణాలు

### స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/మోమిన్‌పేట్ :** గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం కోసం పెద్ద మొత్తంలో రోడ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట్ మండలంలో మంగళవారం రూ.10కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు గావించారు. ఈ సందర్భంగా రాళ్లగుడుపల్లి నుండి గుట్టమిది తాండ వారకు రూ.2040 కోట్ల విలువగల గిరిజన అభివృద్ధి ప్రత్యేక నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు ఉపాధి హామీ పథకం కింద రాళ్ళగుడుపల్లిలో రూ.15 లక్షల వ్యయంతో, లచ్చ నాయక్ తాండాలో రూ.20లక్షలు సీసీ రోడ్డు , మోమిన్‌పేట్‌లో రూ. 1.05 కోట్లతో సీసీ రోడ్డులను స్పీకర్ ప్రారంభించారు. అదేవిధంగా మోమిన్‌పేట్‌లో ఇందిరమ్మ ఇల్లు నమూనా నిర్మాణానికి భూమి పూజ , బిక్కరెడ్డి గూడెంకు రూ.3కోట్ల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు, మల్లారెడ్డి గూడెం,మొండి కట్ట వాడెక చెరువుకు రూ.16.85లక్షలు వ్యయంతో చేపట్టిన మరమ్మత్తుల పనులకు శంకుస్థాపన చేశారు. వేల్చాల్‌లో రూ.55లక్షలు , దర్గం చేరువులో రూ.50లక్షలు, మొరంగపల్లిలో రూ.45లక్షలు ఇజ్రాచిట్టేంపల్లిలో రూ.30లక్షలు, ఎన్కెపల్లిలో రూ.45లక్షలు వ్యయంతో చేపట్టిన సీసీరోడ్లను స్పీకర్ ప్రారంభోత్సవాలు గావించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉంటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. వెల్చాల్ గ్రామంలో రేషన్ కార్డులు ,సన్నబియ్యం సరఫర పై మహిళలతో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ వాఖ ఇఇ ఉమేష్ , తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి , ఎంపిడిఓ విజయలక్ష్మి తదితరులు పాల్గోన్నారు.

## మనోహర్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యం

### సిసి రోడ్డు పనులను ప్రారంభించిన ఎఎంసి చైర్మన్ బాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు :** ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి సహాకారం తోనే తాండూరు నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు పట్టణం సాయిపూర్ 9వ వార్డులో వార్డు ఇంచార్జీ సీనియర్ నాయకులు బంటు మల్లప్ప ఆధ్వర్యంలో సిసి రోడ్డు నిర్మాణం పనులను ఎఎంసి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి ప్రారంభించారు. ఎస్‌డిఎఫ్ రూ.8లక్షల నిధులతో బంటు రాములు ఇంటి నుంచి బుగ్గమ్మ ఇంటి వర కు, వడ్డే శ్రీను ఇంటి నుంచి మేయిన్ రోడ్డు వరకు సిసి రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎఎంసి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి మా ట్లాడుతూ అభివృద్ధికి నోచుకోని సాయిపూర్ ప్రాం తంలో ఎంఎల్‌ఎ ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధికి ఎన్ని కోట్ల నిధులైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం లో సిసి రోడ్డు, సైడ్రేన్ల, లింక్ రోడ్ల అభివృద్ధి పను లు కొనసాగుతున్నాయని అన్నారు. సీనియర్ నా యకులు బంటు మల్లప్ప మాట్లాడుతూ ఇబ్బందులు ఉన్న ప్రాంతంలోనే ఎంఎల్‌ఎ సహకారంతో వెంటనే సిసి రోడ్డు వేయాలని కోరుతామని, ఇం దుకు సహకారం అందజేస్తున్న ఎంఎల్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నీరాజ బాల్‌రెడ్డి, యువనాయకులు బంటు వేణు తదితరులు ఉన్నారు.

## రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గం అభివృద్ధి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ప్రజాభివృద్ధి కార్యక్రమాలను రాజకీయాలకు అతీతంగా ప్రణాళికాయుక్తంగా పూర్తి చేస్తున్నామని, ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొని రావాలని స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన గౌతంనగర్, నేరేడ్‌మెట్, మౌలాలి డివిజన్లలలో ఆయా కార్పొరేటర్లతో కలిసి పర్యటించారు. గౌతంనగర్ డివిజన్‌లో..గౌతంనగర్ డివిజన్ మిర్జాలగూడ చిన్మయి మార్గ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరద ముంపుకు గురవుతున్న చిన్మయ మార్గంలో ఇకపై వరద నీరు సజావుగా వెళ్లేందుకు వెంట్ ఏర్పాటు చేయనున్నామన్నారు. అదే విధంగా ఈ మార్గంలో ఉన్న 277 గజాల పార్కు స్థలంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. వెంకటాద్రినగర్‌లో రోడ్డు, భూగర్భ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. హనుమాన్‌పేటలోని రైల్వే లైన్ కింది నుండి కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజిని ఆయన పరిశీలించారు. నేరేడ్‌మెట్ డివిజన్‌లో...డివిజన్‌లోని మధురనగర్‌లోపర్యటించిన ఆయన డ్రైనేజి , పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించిన అనంతరం ఓపెన్ నాలలో మురికి నీటి వ్యర్థాలు తొలగించాలని, డ్రైనేజి వ్యవస్థను ఆధునీకరించాలని అధికారులకు సూచించారు. మధురనగర్ వెల్ఫేర్ సొసైటీ కమ్యూనిటీ హాలులో పార్కు అభివృద్ధి చేస్తూ ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని,చిల్డ్రన్ ప్లే ఏరియాలో పరికరాలు ఏర్పాటు చేయాలని, యోగా డెక్ ఏర్పాటు చేయాలని కోరారు. మౌలాలి డివిజన్‌లో... డివిజన్‌లోని ఈస్ట్‌మారుతీ నగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యేను కలిసిన స్థానికులు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు వెళ్లేందుకు స్టామ్ వాటర్ డ్రైన్ నిర్మించాలని, సిసి రోడ్లు వేయాలని పార్కు స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మించాలని, సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ టౌన్‌ప్లానింగ్‌విభాగ ఎసిపి శ్రీనివాస్,ఇంజనీరింగ్ విభాగ డిఈ మహేష్, లౌక్య, ఎఇ మధురిమ, సృజన, దివ్య జ్యోతి, జలమండలి మేనేజర్ రాజు, నవీన్, స్ట్రీట్ లైట్ విభాగ ఏఈ వెంకటేష్,లక్ష్మి లతో కార్పొరేటర్ మేకల సునీత, పాటు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు వెంకన్న,మేకల రాము యాదవ్,సాయిగౌడ్, సుమన్, వినీత్, శ్రీనివాస రెడ్డి, రవీంద్ర, సుధాకరరెడ్డి, మనోజ్ , వినీత్, నాగభూషణం, అమిరుద్దీన్, దినేష్, నవాబు, ఈస్ట్ మారుతీ సంక్షేమ సంఘ ప్రతినిధులు కుమార్, మాధవాచారి, సాయి కుమార్, కోటేశ్వరరావు, రహమాన్, అజయ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కార్మికుల సమ్మె గోడ పత్రిక విడుదల

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్



**ప్రజాపక్షం/కాప్రా :** కార్మిక చట్టాల పరిరక్షణ డిమాండ్లతో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 20న జరిగే దేశవ్యాపిత కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ పిలుపిచ్చారు. మంగళవారం కాప్రా ఏరియాలో మున్సిపల్ కార్మికులతో కల్సి సమ్మెకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో గత రెండు దశాబ్దాల పైబడి అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయటం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. మోడీ ప్రభుత్వం చేసిన నాలుగు కోడ్స్ వల్ల శ్రమ దోపిడీ పెరిగిందని, గతంలో రద్దు చేసిన 44 చట్టాలను పునరుద్దరించాలని ఆయన డిమాండ్ చేసారు. మూత బడ్డ ప్రభుత్వ రంగ సంస్థలను తిరిగి తెరిపించటంతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తూ కార్మిక చట్ట ప్రయోజనాలు వర్తించేలా చూడాలన్నారు. ఏఐటియుసితో పాటు అన్ని కార్మిక సంఘాలు సంఘటితమై దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నేతలు యాదగిరి, మహేష్,జయమ్మ, లక్ష్మి ,యాదమ్మ, జనార్థన్,హేమలత, మిరియాల సాయిలు, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

## అనునిత్యం ప్రజల కోసం పని చేసిన వారే నిజమైన కమ్యూనిస్టులు

### సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.యేసురత్నం, మండల కార్యదర్శి ఇ.ఉమా మహేష్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** అనునిత్యం ప్రజల కోసం పని చేసిన వారే నిజమైన కమ్యూనిస్టులని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే.యేసురత్నం, కుత్బుల్లాపూర్‌మండల కార్యదర్శి ఇ.ఉమా మహేష్ అన్నారు. మంగళవారం జగద్గిరి గుట్ట 25వ శాఖ మహసభలు నల్లమల్ల గిరి ప్రసాద్ విజ్ఞాన కేంద్రంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగురు వెంకటేష్ అధ్యక్షతన మహసభ జరిగింది. ఈ మహసభలో జగద్గిరిగుట్ట శాఖ కార్యదర్శిగా ఎం.సహదేవ రెడ్డి, సహయ కార్యదర్శులుగా వి.రాజు, పి.చంద్రయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహసభకు ముఖ్య అతిథులుగా వారు పాల్గొని మాట్లాడుతూ రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సిపిఐ నుంచి కార్పొరేటర్ స్థానాలకు పోటీ చేసి గెలవాలంటే ఎల్లవెళలా సిపిఐ నాయకత్వం , పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులు అందరూ కలిసికట్టుగా పని చేసి పార్టీని బలోపేతం పరచాలన్నారు. మండల, జిల్లా , రాష్ట్ర మహసభలు కుత్బుల్లాపూర్‌లో జరుగుతున్నాయని, ఈ మహసభ విజయం కోసం ప్రతినిత్యం సైనికులా పని చేయాలని కార్య కర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాఖ మాజీ కార్యదర్శి చర్లపల్లి రాములు, ప్రజానాట్య మండలి అధ్యక్షులు దొరవిబాబు, మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## పవర్ బోర్లకు ఎంపి నిధులు మంజూరు

### ఈటలను కోరిన మౌలాలి కార్పొరేటర్ సునీత



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మౌలాలి డివిజన్‌లోని నెహ్రూనగర్, గోకుల్‌నగర్, షఫీ నగర్ ప్రాంతాల్లో ఎంపి నిధుల నుండి పవర్ బోర్లకు నిధులు మంజూరు చేయాలని మల్కాజిగిరి ఎంపి ఈటెలను స్థానిక కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ కోరారు. మంగళవారం ఈటెలను శివగౌడ్,శ్రీనివాస్ యాదవ్, నటరాజలతో కల్సిన ఆమె యూజిడి పనులను సైతం అనుమతులు మంజూరు చేయించాలని కోరారు.

## నకిలీ ఐస్‌క్రీమ్ దందా ఛేదించిన పోలీసులు




**ప్రజాపక్షం/కుల్కచర్ల :** పరిగి నియోజకవర్గంలోని కుల్కచర్ల మండల కేం ద్రంలో నకిలీ ఐస్ క్రీమ్ అమ్మకాలు జరుగుతున్నాయని తెలుసుకున్న టా స్క్ ఫోర్స్ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుల్కచర్ల మండల కేంద్రంలోని పోస్టాఫీస్ దగ్గర ఎక్స్‌ఫెరైన పదార్థాలతో ఐస్‌క్రిమ్ తయారు చేస్తున్నావ్యక్తి ఎండి అజీమ్ నివసంలో పార్వతీపురం మండల నిక చెందిన అనిల్ ,రాంపాల్ అనే ఇద్దరు వ్యక్తులకు రెండు బండ్లు ఇచ్చి నకిలి ఐస్‌క్రీమ్‌లు అమ్ముతున్నారు.తినడం వల్ల ప్రజల అరోగ్యణ పడుతున్నారని పై ముగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకోని కుల్కచర్ల ఎస్ఐ అన్వేష్ కుమార్ తెలిపారు.

## హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** కోట్‌పల్లి పోలీస్ స్టేషన్ నమోదైన హత్య కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదుశిక్షణ విధిస్తు ప్రిన్సిపల్ డిస్టిక్ సెషన్స్ జడ్జి డా.సున్నం శ్రీనివాస్‌రెడ్డి మం గళవారం తీర్పు ఇచ్చినట్లు జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి తెలిపారు. ఈ కేసు గ్రామానికి చెందిన బా సుపల్లి పెంటప్పా, ఫిర్యాదు దారుడు మృతుడు తన తమ్ముడు బాసుపల్లి హన్మంతు తమ పాలివారైన బాసుపల్లి అంజిలప్ప కుటుంబంతో తరుచూ ఘర్షణలు జరిగేవి 2014 డిసెంబర్ 4వ తేదీ రాత్రి 7గంటల సమయంలో హన్మంతు తన ఇంటికి వెళ్లే క్రమంలో బాసుపల్లి అంజిలప్ప పాత గొడవలు మనసులో పెట్టుకొని గొడవకు దిగాడు, ఆ సమయంలో అంజిలప్ప కుమారులు ఏ1 శ్రీనివాస్ , ఏ2 పాండు, అక్కడికి వ చ్చి హన్మంతును దాడి చేయగా పాండు పట్టుకోని , శ్రీనివాస్ కట్టెతో, అంజిలప్ప రాయితో లతపై దెబ్బతిసిన ఫలితంగా హన్మంతు అక్కడిక్కడే మృతి చెందాడు అని ఫిర్యాదు రాగా ,ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ రమేష్ క్రైమ్ నెంబర్ 150/2014 గా సెక్షన్లు 148, 302,326,324 ,201, 109 ప్రకారం కేసు నమోదు చేశారు. కరణ్‌కోట్ సిఐ శివశంకర్ దర్యాప్తు నిర్వహించి కోర్టులో చార్ట్‌షీట్ దాఖలు చేశారు. వాదోపవాదలనలు విన్న న్యాయమూర్తి నిందితులకు జీవిత ఖైదు ,జరిమాన విధించారు. ఈ కేసు న్యాయపేవ అందించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నారాయణగౌడ్ , రవి కుమార్ , సుధాకర్‌రెడ్డి , దర్యాప్తు నిర్వహించిన రఘు రాములు, ఎస్ఐ గాఫ్పార్ , తదితరులు కృషి చేశారు.

## మున్సిపాలిటీ బిజెపి కైవసం ఖాయం

**ప్రజాపక్షం/తాండూరు :** మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు వచ్చిన తాండూరు మున్సిపల్‌ను బిజెపి కైవసం చేసుకోవడం ఖాయమని బిజెపి తాండూరు పట్టణ పార్టీ అధ్యక్షులు నాగారం మల్లేశం ఓ ప్రకటనలో పేర్కోన్నారు. ఇందుకు గాను త్వరలోనే తాండూరు పట్టణ నూతన కార్యవర్గం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బిజెపి రాష్ట్ర, జిల్లా సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, అభిమానులు అందరి సమన్వయంతో పట్టణ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కోన్నారు. కొత్త, పాత తరం నాయకులతో పాటు మహిళలు, యువకులను అందరిని కలుపుకుని అన్ని వర్గాలకు సమ న్యాయం చేసుకుంటూ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి తాండూరు మున్సిపల్ బిజెపి జెండా ఎగురవేయడంతో పాటు చైర్మన్‌ను పీఠాన్ని కైవసం చేసుకుంటామని పేర్కోన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్
GREATER HYDERABAD

## చీటింగ్ కేసులో టివి ఛానల్ ఎండి శ్రవణ్‌రావు అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చీటింగ్ కేసులో ఓ టివి న్యూస్ ఛానల్ ఎండి శ్రవణ్‌రావును హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కంపెనీలో పెట్టుబడులు పెడితే మంచి లాభాలు వస్తాయని బంజారాహిల్స్‌కు చెందిన ఎ.ఆకాష్ క్రిష్ణ నుంచి రూ.6 కోట్లు పెట్టుబడి పెట్టించుకుని మోసం చేశారు. ఈ మేరకు ఆకాష్ క్రిష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిసిఎస్ పోలీసులు ఈ నెల 25న ఇనిథమ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, న్యూస్ ఛానల్ డైరెక్టర్ ఎ.శ్రావణ్‌రావు (ఫోన్‌ట్యాపింగ్ కేసులో కూడా నిందితుడు)తో పాటు అకోర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి, కె.బి.వేధమూర్తి, ఎ.స్వాతిరావులపై బిఎన్ఎస్ సెక్షన్ 316 (5),318(4), రెడ్‌విత్ 3(5) కింద కేసు నమోదు చేశారు.ఈ కేసులో నిందితుడైన శ్రావణ్‌రావుకు నోటీసులు ఇచ్చి సిసిఎస్‌కు పిలిచిన తరువాత అతన్ని విచారించి అరెస్టు చేశారు.

## ఐక్యంగా ఉంటేనే హక్కుల సాధన



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** హక్కులను సాధించుకునేందుకు బిసిలందరూ ఏకతాటిపైకి వచ్చేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని బిసి సేన రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వ సుధాకర్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అయ్యావారిపల్లి గ్రామంలో జాతీయ బిసిసేన గ్రామ కమిటిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జువ్వ సుధాకర్ మాట్లాడుతూ బిసిలందరు విద్య, వైద్య, రాజకీయ, ఆర్థిక, సామాజికంగా ఎదిగేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. హక్కులను సాధించుకునేందుకు బిసిలందరు ఏకతాటిపైకి వచ్చేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. జనాభాలో బిసిల సంఖ్య తక్కువగా ఉన్న కులాల వారే ఎక్కువ ప్రాతినిత్యం వహిస్తున్నారని, బిసిలు ఐక్యంగా ఉంటే సాధించలేనిది ఏమి ఉండదని సూచించారు కార్యక్రమంలో బిసిసేన ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు మేకల వెంకటేష్, నందిగామ మండల ఉపాధ్యక్షుడు మలగాసి నర్సింలు, జిల్లేడు చౌదరిగూడ మండల మహిళా అధ్యక్షురాలు ప్యాట జయ శ్రీకాంత్, పట్టణ ప్రచార కార్యదర్శి ఏలూరు వసంత తదితరులు పాల్గొన్నారు.

## మాల్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ రవీందర్ పర్యటన



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని మాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ రవీందర్, వేస్లి పర్యటించారు. మాల్ గ్రామ పంచాయతీకి జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు వచ్చిన నేపథ్యంలో పంచాయతీరాజ్ కమిసినర్ రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. మాల్ గ్రామంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు ఏ విధంగా ఉందని స్వయంగా పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాల్ పశువుల సంత సందర్శిచి ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. పశువుల సంతలో కనీస సౌకర్యాలు కల్పించాలని అదేశించారు. పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. వేసవిలో మొక్కలు ఎండి పోకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు. నీటిని పోదుపుగా వాడుకోవాలన్నారు. పచ్చదనాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు వచ్చినందుకు అందరికి అదర్శవంతగా ఉండాలన్నారు. గ్రామ అభివృద్ధికి అందరి సూచనలు సలహలు తీసుకోని ముందుకు సాగాలన్నారు. అధికారుల సహకారంతో గ్రామ పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నారు.కార్యక్రమంలో అర్ సురేశ్ మోహన్, జిల్లా పంచాయతీ అధికారి రవింధర్, డివిలోపిఒ సాధన, ఇన్‌చార్జి ఎంపిడిఒ శైలాజా, ఎంపిఒ శ్రీలత, పంచాయతి కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

## రసాయనిక ఎరువులు తగ్గించాలి

ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త రామకృష్ణ



**ప్రజాపక్షం/యాచారం :** రైతులు వ్యవసాయంలో రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడకంపై దృష్టి సారించాలని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం బయో కంట్రోల్ యూనిట్ ఎంటామాలజి శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణ అన్నారు. మంగళవారం యాచారం మండల పరిధిలోని తక్కళ్ళపల్లి తండాలో రైతు ముంగిట శాస్త్ర వేత్తల కార్యక్రమం జరిగింది. ఈ సంధర్భంగా అయన మాట్లాడుతూ యూరియా వడకంపై రైతులు అవగాహణ పెంచుకోవాలన్నారు. తక్కువ నీటిని పంటలకు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మైక్రో ఇరిగేషన్ వ్యవస్తను అలవర్చుకోవాలని అన్నారు.విత్తనాలు, ఎరువులు కొన్నప్పుడు బిల్లులు తప్పకుండడా తీసుకోవాలన్నారు. పంట కోలతలు, వ్యవసాయ సాధనాలు నేర్పించారు. కార్యక్రమంలో శాస్త్రవెత్త డాక్ ఎం.రాజేశ్వర్ నాయుడు, యాచారం మండల వ్యసాయాధికారి అర్ రవినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం

కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని సాహెబ్ నగర్ క్రాంతి యువజన సంఘం వద్ద రూ.17.50 లక్షల వ్యయంతో నూతన భూగర్భ డ్రైనేజీ పనులు బుధవారం ప్రారంభించనున్నట్లు బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్‌లోని సాహెబ్ నగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులను జలమండలి మేనేజర్ సిరివెన్నెలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ డ్రైనేజీ పనులు మొదలు పెట్టితే సాహెబ్ నగర్ కాలనీ వాసులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొంగర మహేష్, మహేష్ గౌడ్, సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# పార్కింగ్ కార్లలో ఆటలు..

ప్రాణాలు పోగొట్టుకుంటున్న చిన్నారులు

వరుస ప్రమాదాలపై తల్లిదండ్రుల ఆందోళన





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్కింగ్‌లో ఉన్న కారులో ఆడుకుంటూ శ్వాస ఆడక మరణిస్తున్న చిన్నారుల సంఖ్య తెలంగాణాలో రోజురోజుకు పెరుగడం ఆందోళన కలిగిస్తుంది. గత రెండేళ్లలోనే కనీసం 15 కేసులు కారులో ఆడుకుంటూ తాళం వేసుకుని బయటపడలేక చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు తెలంగాణను కలచివేస్తున్నాయి. కారులో తాళం వేసిన నిమిషాల్లోనే ఆక్సిజన్ తక్కువై శ్వాస ఆగుతుంది కానీ ఈనిజాన్ని తెలుసుకునేలోపు చాలామంది తల్లిదండ్రులు తమబిడ్డలను కోల్పోతున్నారు.
తెలంగాణలో పార్కింగ్‌లో ఉన్న కార్లలో ఆడుకుంటూ పిల్లలు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా మంగళవారం రంగారెడ్డి జిల్లా కడ్లా మండలం మక్తమాధారం గ్రామంలో నాలుగేళ్ళ అక్షయ కారులో ఆడుకుంటూ ఊపిరాడక మృతి చెందింది. ఇటీవల కాలంలో ఈ తరహా ప్రమాదాలు అనేకం నమోదయ్యాయి. కొన్ని ముఖ్యమైన ఘటనలు ఇలా ఉన్నాయి.

– 2023 ఆగస్టు ఖమ్మం జిల్లాలో నాలుగు సంవత్సరాల బాలుడు ఇంటి వద్ద పార్కింగ్‌లో ఉన్న కారులో ఆడుకుంటూ లోపలికి వెళ్లి, తాళం వేసుకుని బయటపడలేకపోయాడు. ఆయన గాలితీసుకునే అవకాశం లేక, శ్వాస ఆడక మృతి చెందాడు.

– రాజేంద్రనగర్‌లో జూన్ 2017లో రెండు సంవత్సరాల బాలుడు తన తండ్రి కారులో ఆడుకుంటూ లోపలికి వెళ్లి, తాళం వేసుకుని బయటపడలేకపోయాడు. ఆయన శ్వాస ఆడక మృతి చెందాడు.

– చేవెళ్లలో ఎప్రిల్ 2025లో చేవెళ్ల మండలం దామరిగిద్ద గ్రామంలో, మేనమామ పెళ్లికి వచ్చిన ఇద్దరు చిన్నారులుతన్మయి శ్రీ (5) మరియు అభినయ శ్రీ (4)పార్కింగ్లో ఉన్న కారులో ఆడుకుంటూ లోపలికి వెళ్లి, తాళం వేసుకుని బయటపడలేకపోయారు. పిల్లలు కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. దాదాపు రెండు గంటల తర్వాత కారులో స్పృహ తప్పిన స్థితిలో కనిపించారు. ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

– భద్రాద్రి కొత్తగూడెంలో మే 2024లో మునుగూరు మండలం సాంబాయిగూడెంలో, 3 ఏళ్ల కలిన్‌షా అనే బాలిక ఇంటి ముందు పార్కింగ్లో ఉన్న కారులో ఆడుకుంటూ లోపలికి వెళ్లి, తాళం వేసుకుని బయటపడలేక పోయింది. తల్లిదండ్రులు ఆమెను వెతికినా, చివరికి కారులో స్పృహ తప్పిన స్థితిలో కనిపించారు. ఆసుపత్రికి తరలించినప్పటికీ, ఆమె మృతి చెందింది.

– ఖమ్మం జిల్లాలో ఆగస్టు 2024లో కామేపల్లి మండలం రుక్కి తండాలో, 4 ఏళ్ల బి. పార్థ నాయిక్ అనే బాలుడు ఇంటి వద్ద పార్కింగ్లో ఉన్న కారులో ఆడుకుంటూ లోపలికి వెళ్లి, తాళం వేసుకుని బయటపడలేక పోయాడు. తల్లిదండ్రులు వెతికినా, చివరికి కారులో మృతదేహంగా కనిపించాడు.

– నిజామాబాద్‌లో ఎప్రిల్ 2024లో బోధన్ పట్టణంలో, 6 ఏళ్ల రాఘవ అనే బాలుడు పార్కింగ్లో ఉన్న కారులో ఆడుకుంటూ లోపలికి వెళ్లి, తాళం వేసుకుని బయటపడలేకపోయాడు. మూడు రోజుల తర్వాత కారులో మృతదేహంగా కనిపించాడు.

– హయత్‌నగర్‌లో మే 2023లో బాలాజీ ఆర్కేడ్ అపార్ట్మెంట్లో, 3 ఏళ్ల లక్ష్మి అనే బాలికను ఆమె తల్లి వేసవి వేడిలో నుంచి రక్షించేందుకు పార్కింగ్లో నిద్రపుచ్చింది. కారు డ్రైవర్ ఆమెను గమనించకపోవడంతో, కారును పార్క్ చేస్తూ బాలికను తొక్కాడు. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.

### పాటించాల్సిన జాగ్రత్తలు ..

– పిల్లలను ఎప్పుడూ పర్యవేక్షించాలి, ప్రత్యేకంగా పార్కింగ్ ప్రాంతాల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలి.
ఉపయోగంలో లేని కార్లను.. ఎప్పుడూ లాక్ చేయాలి, పిల్లలు లోపలికి వెళ్లకుండా చూడాలి.

–అపార్ట్మెంట్లలో పార్కింగ్ ప్రాంతాల్లో సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేయాలి.

–ఈ ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు నివారించవచ్చు.

– ఈ ఘటనలు మనం పిల్లల భద్రతపై మరింత శ్రద్ధ వహించేలా చేశాయి.

– తెలంగాణలో పార్కింగ్లో ఉన్న కార్లలో ఆడుకుంటూ పిల్లలు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఘటనలు పిల్లల భద్రతపై మరింత శ్రద్ధ కనబర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## హైదరాబాద్‌లో నకిలీ విద్య సర్టిఫికెట్ గుట్టురట్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నకిలీ విద్య సర్టిఫికెట్ రాకెట్ గుట్టును హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. ఈ మేరకు నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన 108 నకిలీ విద్య సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ అదనపు డిసిపి అండె శ్రీనివాస్ మంగళవారం వెల్లడించారు.చంద్రాయణగుట్టకు చెందిన ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ మోహమ్మద్ ముజీబ్ హుస్సేన్ (54), టోలిచౌకికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మొహమ్మద్ నాసిర్ ఖాన్ (26), గుడిమల్కాపూర్‌కు చెందిన మొహమ్మద్ అల్ బసీర్ రెహమానీ (45), టోలిచౌకికి చెందిన జియా (34)లు దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన నకిలీ విద్య సర్టిఫికెట్లను తయారు చేసి విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. మెహదీపట్నం పరిధిలోని ఫస్ట్ లాన్సర్లోని ఈద్గా గ్రౌండ్స్‌లోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో నకిలీ సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్నప్పుడు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విచారణలో మహమ్మద్ ముజీబ్ హుస్సేన్ విద్య కన్సల్టెన్సీని నడుపుతున్నాడని, విదేశాలలో చదువుకోవడానికి వీసా, బహుళజాతి కంపెనీలలో ఉద్యోగ దరఖాస్తుల కోసం అవసరమైన వ్యక్తులకు నకిలీ విద్యా సర్టిఫికెట్లను అందిస్తున్నాడని వెల్లడైంది. మహమ్మద్ ముజీబ్ హుస్సేన్ నకిలీ విద్య సర్టిఫికెట్లను నాసిర్లోని మహమ్మద్ నాసిర్ ఖాన్కు అందిస్తున్నాడని, దీనిని మధ్యవర్తులు మొహమ్మద్ అల్ బసీర్ రెహమానీ, బస్సిర్ సోహైల్ ,జియా ద్వారా విక్రయిస్తున్నారని తేలింది. వారి వద్ద నుండి వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన 108 నకిలీ విద్య సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో, నకిలీ సర్టిఫికెట్ల తయారీదారులు, పశ్చిమ బెంగాల్లోని కలకత్తాలోని మనోజ్ విశ్వాష్, మీరట్లోని రవీందర్, ఉత్తర ప్రదేశ్లోని ముఖేష్ పోలీసుల అజయ్ పరారీలో ఉన్నట్లు గుర్తించారు.

## సంబంధం లేని విభాగపు వైద్యచికిత్స నేరం


డాక్టర్ రజిత దమిశెట్టి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** కొంతమంది డెంటల్, బిడిఎస్ వైద్యులు ఎలాంటి అర్హత లేకపోయినా స్కిన్ స్పెషలిస్టుగా చలామణి అవుతూ ప్రజలను మోసం చేయడం చట్టబద్ధమైన తప్పు అని ఎంబిబిఎస్ ఎండి (డెర్మటాలజిస్టు) డాక్టర్ రజిత దమిశెట్టి అన్నారు. ఎవరైనా సరే సంబంధం లేని విభాగపు వైద్య చికిత్సలు అందించడం నేరమన్నారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాజీ డిఎంఇ డాక్టర్ పుట్ట శ్రీనివాస్‌తో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. ఏ స్పెషలిస్ట్ అయినా అదే విభాగంలో చికిత్సలు అందించేలా తాము ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. విరుద్ధ ప్రాక్టీస్ చేస్తున్న వారిపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఏ) లకు ఫిర్యాదు చేస్తున్నట్టు చెప్పారు. దీంతో తనపై సామాజిక మాధ్యమాలలో వ్యక్తిగత దూషణలకు పాల్పడటం విచారకరమన్నారు. ముఖ్యంగా డెంటల్ విద్యను పూర్తి చేసిన వారు చర్మ సంబంధ చికిత్సలు అందించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. దీంతో ప్రజలు లక్షలు పోసినా రోగం నయం కాక తీవ్ర నిరాశలో ఉంటున్నారని పేర్కొన్నారు. ప్రజలు వైద్య చికిత్స వెళ్లే ముందు వైద్యుల అర్హతలు తెలుసుకోవాలని సూచించారు. తనపై దూషణలు చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, వారిపై చట్టపరంగా పోరాడుతానని తెలిపారు. సమావేశంలో పలువురు డెర్మటాలజి వైద్యులు పాల్గొన్నారు.



## ప్రణాళికాబద్ధంగా పంట నష్ట వివరాల సేకరణ

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతుల వివరాలను ప్రణాళిక బద్ధంగా సేకరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. అందులో భాగంగానే షాద్‌నగర్ వ్యవసాయ శాఖ ఏడిఏగా అదనపు బాధ్యతలు స్వీకరించిన నిశాంత్‌కుమార్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతుల వివరాలను పూర్తి స్థాయిలో సేకరించి నివేదిక ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్క రైతు కూడా నష్టపోకుండా వ్యవసాయ శాఖ అధికారులు సర్వే చేసి వివరాలు సేకరించాలని సూచించారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని నియోజకవర్గానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## డిఎస్‌పి పార్థసారథి ఇంట్లో అక్రమ ఆస్తులు గుర్తించిన ఎసిబి అధికారులు

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** సూర్యాపేట జిల్లా డిఎస్‌పి కొండం పార్థసారథి, సూర్యాపేట టౌన్ సిఐ వీరరాఘవులు ఒక వ్యక్తి నుంచి రూ.16 లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని, ఆ వ్యక్తిపై ఒత్తడి చేయడంతో బాధితుడు ఎసిబికి అశ్రయించిన మేరకు సోమవారం ఎసిబి అధికారులు పట్టుకున్న విషయం విధితమే. హయత్‌నగర్ మండల పరిధిలోని బాగ్యత్‌నగర్‌లోని దత్తాత్రేయ నగర్ రోడ్ నెంబర్2లోని కాకతీయ స్కూల్ సమీపంలో సూర్యాపేట డిఎస్‌పి పార్థసారథి నివాసం ఉంటున్నారు. రంగారెడ్డి జిల్లా ఎసిబి అనుబంధంగా ఉన్న హైదరాబాద్ సిటీ రేంజ్2లోని అవినీతి నిరోధక బ్యూరో ఇన్‌స్పెక్టర్ సిహెచ్.మురళీమోహన్ మంగళవారం పార్థసారది ఇంట్లో సోదాలు జరిపి అక్రమ ఆస్తులు భారీగా ఉన్నట్లుగా గుర్తించారు. ఈ మేరకు హయత్ నగర్ పోలీసులకు అవినీతి నిరోధక బ్యూరో ఇన్‌స్పెక్టర్ సిహెచ్. మురళీ మోహన్ ఫిర్యాదు చేయగా వారిపై హయత్ నగర్ సిఐ నాగరాజు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## కార్మిక చట్టాల రక్షణకు సార్వత్రిక సమ్మె



ఎఐటియుసి మున్సిపల్ కార్మిక సంఘం జోన్ కార్యదర్శి మద్దిలేటి

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కార్మిక హక్కుల రక్షణకు మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి మున్సిపల్ కార్మిక సంఘం ఎల్‌బి నగర్ జోన్ కార్యదర్శి మద్దిలేటి కోరారు. మంగళవారం ఎల్‌బి నగర్ సర్కిల్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాటం చేసి సాధించుకున్న కార్మికుల చట్టాలు, హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేషన్ శక్తులకు అప్పగించడం దారుణమన్నారు. 44 కార్మిక చట్టాలను ఉన్నవాటిని 29 చట్టాలను కేంద్ర తొలగించి కార్మికుల హక్కులను విస్మరించారన్నారు. కార్మికుల హక్కుల రక్షణకోసం మరో పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు రాజు, శ్రీకాంత్, రమేష్, ఎట్టమ్మ, వీరమని, వెంకటమ్మ, ఐలమ్మ, అండాలు, సుజాత, రాలమ్మ, కిష్టమ్మ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

**శేరిలింగంపల్లి :** దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. 20న నిర్వహించే సమ్మెను పురస్కరించుకొని మంగళవారం మాదాపూర్‌లోని ఇజ్జత్ నగర్‌లోని సిపిఐ కార్యలయంలో సమావేశం నిరవహించారు. కార్యక్రమానికి సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణ, ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా నాయకులు చందుయాదవ్, ఎఐటియుసి శేరిలింగంపల్లి ఆటో యూనియన్ అధ్యక్షులు రాములు, మున్సిపాల్ సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ కొమ్ము పరమేష్ పాల్గొన్నారు. అనంతరం కార్మికుల సమస్యలను పరిష్కారించాలని దేశవ్యాప్తంగా జరిగే సమ్మెకు సహకరించాలని జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.



## పేదలకు భూపంపిణి చరిత్ర సిపిఐదే

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** పేదలకు భూములు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకే ఉందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి అన్నారు. మంగళవారం బాలాపూర్ మండలం జిల్లలగూడ సిపిఐ గ్రామ శాఖ మహాసభ పార్టీ సీనియర్ నాయకులు దశరథ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవీంద్ర చారి మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం భూ పోరాటాలు నడిపి తెలంగాణ సాయుధ పోరాటంలో 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలలోని అనేక బస్తీలు కాలనీలు, భూ పోరాటాల ద్వారా పేదలకు ఇళ్లు, ఇండ్లస్థలాలు ఇప్పించిన పార్టీ ఎర్రజెండా పార్టీ అన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి ప్రజా పోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. పోరాటాలతో పార్టీని బలోపేతం చేయాలని నూతన కమిటీకి సూచించారు.

### నూతన కమిటీ ఎన్నిక

అనంతరం జిల్లలగూడ శాఖా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లలగూడ శాఖా కార్యదర్శిగా రమావత్ పాండు నాయక్, సహాయ కార్యదర్శులుగా బ్రహ్మచారి, కృష్ణ, కౌన్సిల్ సభ్యులుగా దశరథ, శ్రీనివాస్, కె.పద్మ, జంగయ్య, జర్పుల శివ నాయక్, పద్మ, ఇద్దరు కోఆప్షన్‌లతో కూడిన 11 మందిని ఎన్నుకున్నారు.



# క్రీడ

## ఇంగ్లాండ్ పర్యటనకు రోహిత్, కోహ్లీ!



భారత క్రికెట్ అభిమానులకు గుడ్ న్యూస్. టెస్ట్ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీలు ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనున్నారు. ఐపీఎల్ 2025 సీజన్ ముగిసిన వెంటనే ఐదు టెస్ట్‌ల సిరీస్ కోసం టీమిండియా ఇంగ్లాండ్‌లో పర్యటించనుంది. ఈ సిరీస్‌తోనే డబ్ల్యూటీసీ 2025–27 సైకిల్ ప్రారంభం కానుంది. అయితే ఈ పర్యటనకు ముందే రోహిత శర్మ, విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. కెప్టెన్సీతో పాటు ఆటగాడిగా అవకాశం లేదని సెలెక్టర్లు చెప్పడంతోనే రోహిత్ శర్మ తప్పుకున్నాడని ప్రచారం జరిగింది. కానీ ప్రపంచ క్రికెట్‌లోనే అత్యంత ఫిట్టెస్ట్ క్రికెటర్ అయిన విరాట్ కోహ్లీ తనకు నచ్చిన ఫార్మాట్‌కు వీడ్కోలు పలకడం అందర్నీ అయోమయానికి గురి చేసింది. విరాట్ కోహ్లీ లేని లోటు టీమిండియాలో కనబడనుంది. అయితే ఈ ఇద్దరి దిగ్గజాలను ఇంగ్లాండ్ పర్యటనలోని తొలి టెస్ట్‌కు బీసీసీఐ ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది. జూన్ 20న లీడ్స్ వేదికగా జరిగే ఈ మ్యాచ్‌కు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు హాజరయ్యే అవకాశం ఉంది. మ్యాచ్‌కు ముందు ఈ ఇద్దరికి గార్డ్ ఆఫ్ హానర్ ఇవ్వాలని బీసీసీఐ భావిస్తున్నట్లు తెలుస్తోంది. భారత క్రికెట్‌కు చేసిన సేవలకు గుర్తింపుగా వారికి గౌరవ వందన కార్యక్రమం ఏర్పాటు చేయాలనే యోచనలో బీసీసీఐ ఉంది. కోహ్లీ, రోహిత్ శర్మలను ఇంగ్లాండ్ పర్యటనలోని తొలి టెస్ట్‌కు హాజరవ్వాలని ప్రత్యేకంగా కోరనుందని ఓ బీసీసీఐ అధికారి మీడియాకు తెలిపారు. ఇప్పటికే విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మకు ఫేర్‌వెల్ మ్యాచ్ ఏర్పాటు చేసి ఘనంగా వీడ్కోలు పలకాలని అనిల్ కుంబ్లే వంటి మాజీ ఆటగాళ్లు బీసీసీఐకి సూచిస్తున్నారు. ఫ్యాన్స్ సైతం దిగ్గజ ఆటగాళ్లు అయిన కోహ్లీ, రోహిత్ నిశబ్దంగా నిష్క్రమించడం బాలేదని కామెంట్ చేస్తున్నారు.

# రీల్

## తమిళ దర్శకుడితో నాగ్ మూవీ!



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు నాగార్జున ప్రస్తుతం ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కుబేర' చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం జూన్ 20న విడుదల కానుంది. అలాగే, సూపర్ స్టార్ రజనీ కాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'కూలీ'లోనూ నాగార్జున ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ రెండు భారీ ప్రాజెక్ట్‌లలో నటిస్తున్న నాగార్జున తదుపరి చిత్రంపై సోషల్ మీడియాలో పలు ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం, నాగార్జున ఇటీవల ఒక యువ తమిళ దర్శకుడు చెప్పిన కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తుంది. తమిళ దర్శకుడు 'నిథం ఓరు వానమ్' (తెలుగులో ఆకాశం) సినిమా ఫేం కార్తీక్ నాగ్‌కి కథ వినిపించినట్లు సమాచారం. అయితే, ఈ విషయంపై చిత్ర నిర్మాతలు ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది. రానున్న రోజుల్లో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఒకవైపు వరుస చిత్రాలతో బిజీగా ఉన్న నాగార్జున, మరోవైపు యువ దర్శకులతో కలిసి పనిచేయడానికి ఆసక్తి చూపుతుండటం ఆయన అభిమానులకు ఆనందాన్ని కలిగిస్తోంది. కార్తీక్ వంటి ప్రతిభావంతుడైన దర్శకుడితో నాగార్జున జత కడితే ఎలాంటి సినిమా వస్తుందో చూడటానికి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.






## పేదరికం ఉన్నన్ని రోజులూ.. కమ్యూనిస్టు పార్టీ ఉంటుంది

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి

సిపిఐ పోరాట ఫలితమే సాగునీటి ప్రాజెక్టులకు నిధులు

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/ నాంపల్లి:** దోపిడీ పేదరికం ఉన్నన్ని రోజులు కమ్యూనిస్టు పార్టీ ఉంటుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. పాలకులు అవలంభించే ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను జాగృతి చేసి మరిన్ని బలమైన పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. నాంపల్లి మండల సిపిఐ 15వ మహాసభ మండల పరిధిలోని వడ్డేపల్లి గ్రామంలో సిపిఐ నాయకుడు దివంగత నారపాక కాశీరాంప్రాంగణంలో నిర్వహించిన మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన పల్లా వెంకట్‌రెడ్డి ఎర్రజెండాను ఆవిష్కరించి మహాసభలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు చంపేయడం దారుణమన్నారు. టెర్రరిజాన్ని అంతమొందించేందుకు కేంద్ర ప్రభుత్వానికి సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతవిద్వేషాలను రెచ్చగొడుతూ కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతూ రాజకీయ పబ్బం గడుపుతుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు మేలు కలిగించే విధానాలకు పాల్పడుతున్నారన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. ఉద్యమాలతోనే పార్టీకి గుర్తింపు వస్తుందన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన ఉండి పోరాటాలు నిర్వహిస్తు ప్రజాసమస్యలపై బలమైన ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం సిపిఐ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. భూసంస్కరణలు, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు, జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు ఉద్య మాలు నిర్వహించిన పార్టీ సిపిఐ అన్నారు. నల్లగొండ జిల్లాలో శాశ్వత కరువు నివారణ కోసం ఎస్ఎల్‌బిసి, డిండి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పూర్తిచేసి చర్లగూడెం రిజర్వాయర్‌తో మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగుఅందించాలనే లక్ష్యంతో సిపిఐ ఉద్యమాలు నిర్వహించిందన్నారు. నల్లగొండ జిల్లాలో నీటి కోసం, భూమి కోసం సిపిఐ చేసిన ఎన్నో ఉద్యమాల ఫలితంగానే ఎస్ఎల్‌బిసి, డిండి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టులు నిర్మాణం జరుగుతున్నయని గుర్తు చేశారు. ప్రపంచంలోనే అత్యధికంగా ఫ్లోరైడ్ ప్రాంతమైన మునుగోడు ప్రాంతానికి నీటిని అందించడం కోసం నాటి కమ్యూనిస్టులు చేసిన పోరాట ఫలితంగా డిండి ఎత్తిపోతల పథకాన్ని ద్వారా మునుగోడు దేవరకొండ ప్రాంతాన్ని నీరు అందించే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కేవలం కాలేశ్వరం ప్రాజెక్టుకే రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి నల్లగొండ జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టులపై వివక్షత చూపడంతో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరంలోనే రెండు సార్లు డిండి ఎత్తిపోతలపై ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అన్ని అనుమతుల నుంచి ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించేలా పథకాన్ని రూపొందించిందని అన్నారు. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో పరిష్కారానికి నోచుకోని అనేక సమస్యలైన ఎస్ వర్గీకరణ, బిసి కుల గణంకన లాంటి కార్యక్రమాలను చేపట్టి సమస్యకు పరిష్కారం చూపిందని పేర్కొన్నారు. త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు.

ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాగిఫణి అంజాచారి, సిపిఐ మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, సహాయ కార్యదర్శులు ఊరు పక్క వెంకటయ్య, నేతల రాజు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బి.జగన్, మండల కార్యవర్గ సభ్యులు పల్లె సైదయ్య, దండిగా వెంకటయ్య, కోరే సత్తయ్య ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## తెలుగు రాష్ట్రాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్

ప్రజాపక్షం / ఖైరతాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో బిసి, ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఇరురాష్ట్రాల సిఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడును రాజ్యసభ సభ్యులు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య కోరారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఎపి ఒబిసి సంఘం అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్, తెలంగాణ నిరుద్యోగ జెఎసి చైర్మన్ నీలం వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు శాఖల వారీగా పోస్టుల సమగ్ర వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. ఇప్పటికే ఖాళీగా ఉన్న లక్షా 63వేల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో ఆలసత్వం వీడాలని సూచించారు. ఎపిలో 1998 డిఎస్‌సి ఉద్యోగ అభ్యర్థులకు ఎంటిఎస్ పద్ధతిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్–1, గ్రూప్–2లో మొత్తం ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో 98 డిఎస్‌సి సంఘం నేతలు శ్రీనివాస్ యాదవ్, సంజీవ్, భైరవకోనా శ్రీనివాస్, బాబయ్య రమేశ్, లలిత తదితరులు పాల్గొన్నారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com